జిఒ 3కి ప్రత్యామ్నాయం తేవాలి

- పాడేరు ఐటిడిఎ పాలకవర్గ సమావేశంలో మంత్రిని నిలదీసిన ప్రజాప్రతినిధులు 3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 259 | విజయవాడ, మంగళవారం 22 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 22 April 2025 | Rs

పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

'ప్రజల మనిషి'
ప్రపంచ నేతల సంతాపం

వాటికన్ : కేథలిక్‌ల మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) సోమవారం కన్నుమూశారు. వాటికన్ వర్గాలు ఈ విషయాన్ని నిర్ధారిస్తూ, వీడియో ప్రకటన జారీ చేశాయి. రోమ్ బిషప్ పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం 7.35 గంటలకు కన్ను మూశారని, ఆయన తన జీవితమంతా ప్రజల సేవకే అంకితం చేశారని వాటికన్ కామెర్లాంగో కార్డినల్ కెవిన్ ఫెరల్ పేర్కొన్నారు. "విశ్వాసం, విలువలతో, ధైర్యం, విశ్వజనీనమైన ప్రేమ ముఖ్యంగా సమాజంలోని నిరుపేదలు, వెనుకబడిన వర్గాల పట్ల దయ, కరుణలతో జీవించాలని ఆయన మనకు నేర్పారు." అని ఆయన పేర్కొన్నారు. ఆయన కన్ను మూయడానికి ఒక రోజు ముందుగా ఈస్టర్ సండే నాడు సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో వేచి వున్న వేలాదిమంది ప్రజలను ఆశీర్వదించేందుకు ప్రజల ముందుకు వచ్చారు. తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో, డబుల్ న్యుమోనియాతో పోప్ గత కొద్ది వారాలుగా బాధపడ్డారు. ఐదు వారాల పాటు ఆస్పత్రిలోనే వున్న ఆయన గత నెల 24న ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. అనేక రోజులుగా ఊపిరి తీసుకోవడంలో తీవ్రంగా ఇబ్బంది పడుతుండడంతో ఫిబ్రవరి 14న ఆయనను రోమ్‌లోని గెమెలి ఆస్పత్రిలో చేర్చారు. 2013 మార్చి 13న ఆయనను రోమ్ కేథలిక్ చర్చి 266వ ప్రవక్తగా నియమితులయ్యారు. రోమన్ కేథలిక్ చర్చి చరిత్రలో తొలి లాటిన్ అమెరికన్ పోప్ అయిన ఫ్రాన్సిస్ పోప్‌గా నియమితులైనప్పటి నుండి కేథలిక్ చర్చిలో సంస్కరణలను అమలు చేయడానికి ప్రయత్నిం చారు. వాతావరణ మార్పులు, శరణార్థుల సమస్యలు, ఎల్‌జిబిటిక్యు సభ్యుల పట్ల ప్రవర్తన ఇలా పలు సామాజిక సమస్యలపై తన గళం వినిపించారు. చిన్నారుల పట్ల లైంగిక వేధింపులపై చర్చి క్షమాపణలు కోరాలని అన్నారు. గాజా, ఉక్రెయిన్, కాంగో, మయన్మార్ వంటి దేశాల్లో జరుగు తున్న పరిణామాల పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గాజాలో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న నిరంతర దాడులను ఆయన తీవ్రంగా విమర్శించారు. తన ఆరోగ్యం బాగా లేకపోయినా పోప్ ప్రతి రోజూ గాజా నగరంలోని చర్చికి ఫోన్ చేసి అక్కడి కేథలిక్స్ గురించి అడిగి తెలుసుకునేవారు.

తదుపరి పోప్ ఎన్నిక

పోప్ మరణిస్తే కొత్త పోప్‌ను ఎన్నుకోవడానికి రోమన్ కేథలిక్ చర్చికి ఒక విస్తృతమైన విధానం వుంది. పోప్ మరణించిన సమయంలో ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. ఆ తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తారు. అనంతరం కొత్త పోప్‌ను ఎన్నుకోవడానికి కార్డినల్స్ సమావేశమవుతారు. పోప్ స్థానం ఖాళీ అయిన 15-20 రోజుల మధ్య ఈ సమావేశం జరుగుతుంది.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తపన పడ్డారు : ప్రధాని మోడీ

కరుణ, వినయం, ఆధ్యాత్మిక ధైర్యానికి దిక్సూచిగా లక్షలాదిమంది ప్రజలకు పోప్ గుర్తుండిపోతారని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నిరుపేదలకు, సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన నిరంతరం తపన పడుతూ సేవలందించారని కొనియాడారు. బాధలు పడుతున్నవారిలో ఆయన ఆశా స్ఫూర్తిని రగిల్చారన్నారు.

పోప్ మరణం బాధించింది : సిఎం చంద్రబాబు

పోప్ ఫ్రాన్సిస్ మరణం తనను ఎంతో బాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఆధ్యాత్మిక నాయకుడిగా కోట్ల మందిలో స్ఫూర్తి నింపారని, శాంతి సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున ప్రపంచ క్యాథలిక్ కమ్యూనిటీకి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ కూడా వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు.

ప్రపంచ శాంతి దూత : జగన్

ప్రపంచ శాంతి దూతగా పోప్ ఫ్రాన్సిస్ మరణం కేథలిక్ సమాజానికి తీరని నష్టమని మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఉన్నంతకాలం శాంతి సామరస్యం కోసం పరితపించారని తెలిపారు.

ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు

సమస్యల పరిష్కారం కోసం
అంగన్‌వాడీల భారీ ధర్నా

మండుటెండల్లోనూ తరలివచ్చిన వేలాదిమంది • కిక్కిరిసిన ధర్నా చౌక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు సోమవారం నాడు విజయవాడలో భారీ ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపు మేరకు సోమవారం జరిగిన ఈ ధర్నాకు మండుటెండల్లోను సైతం లెక్కచేయకుండా వేలాదిమంది అంగన్‌వాడీలు తరలివచ్చారు. దీంతో ధర్నాచౌక్ కిక్కిరిసి పోయిందిమినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మార్చాలని, బాల సంజీవిని యాప్‌లో మార్పులు చేయాలని, వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు మే నెలలో వేసవి సెలవులు ఇవ్వాలని ఈ సందర్భంగా అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు చేసిన డిమాండ్లతో ఆ ప్రాంతం హోరెత్తింది. మినీ వర్కర్లకు ఖాళీ పోస్టుల్లో పదోన్నతలు కల్పించి భర్తీ చేయాలని, మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు అందించాలని, గ్రేడ్ 2 సూపర్‌వైజర్ల పోస్టులకు మినీ వర్కర్లకే అవకాశం కల్పించాలని, మెనూ చార్జీలు పెంచాలని, అదనపు హెల్పర్‌లను కేటాయించాలని వారు కోరారు. ఈ ధర్నాకు మినీ వర్కర్ రామలక్ష్మి అధ్యక్షత వహించారు. ధర్నాను మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడం, అంగన్‌వాడీల ఇతర సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాని దేనని చెప్పారు. ఈ అంశాలను అనేక సార్లు శాసన మండలిలో ప్రస్తావించినట్లు తెలిపారు. మిని సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తున్నా మని మంత్రి సంధ్యారాణి చెప్పినపుటికీ, అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇప్పటికీ జారీ చేయకపోవడం అన్యాయమని అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వర రావు మాట్లాడుతూ... అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె సందర్భంగా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, ఇతర నాయకులు శిబిరాలకు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి 9 నెలలు దాటినా ఇంత వరకూ వేతనాలు పెంచకపోవడం, మినీలను మెయిన్‌లుగా మారుస్తూ ఉత్తర్వులు ఇవ్వలేదని చెప్పారు.ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్రలో భాగంగా 2047 నాటికి ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేస్తానని, 18 శాతం ఉన్న పేదరికాన్ని నిర్మూలిస్తానని చెబుతూ ఈ పేరుతో రాష్ట్రంలోని భూములను కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో 6,830 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, మిని వర్కర్లు ఏజన్సీ ప్రాంతాల్లో, మారుమూల గ్రామాల్లోని పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారాన్ని వండి పెట్టడం, వైద్య సేవలు, ప్రీ స్కూల్ విద్య అందిస్తున్నారని తెలిపారు. వీరు మినీ వర్కర్ల పని, హెల్పర్‌ల పని చేస్తున్నారని చెప్పారు. దీంతో వీరిపై పనిభారం పెరిగిపోతోందన్నారు. ప్రీ స్కూల్ నడపడం, రికార్డులు, ఆన్‌లైన్ వర్క్ వంటి అనేక పనులు వీరు చేస్తున్నారని తెలిపారు. కాని మినీ వర్కర్ల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. వర్కర్లతో సమానంగా వేతనం, వేసవి సెలవులు, పదోన్నతులు ఇవ్వడం లేదని చెప్పారు. ధర్నాలో సిఐటియు రాష్ట్ర నాయకులు నాగరాజు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, వి.వెంకటేశ్వర్లు, ఎం.మనోహర్‌లు అంగన్వాడీలకు మద్ధతు తెలిపారు. యూనియన్ రాష్ట్ర నాయకులు లక్ష్మీదేవి, సుప్రజ, రమాదేవి, నిర్మల, శకుంతల, విజయలక్ష్మి, రాజేశ్వరీ, మహబూబున్నీసా తదితరులు పాల్గొన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు

- తిరుపతి రూరల్‌లో 42.1 డిగ్రీలు నమోదు
- నేడు 28మండలాల్లో తీవ్ర వడగాడ్పులు
- సమీక్షించనున్న హోంశాఖ మంత్రి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు తారెత్తిస్తున్నాయి. ఎండలతో పాటు పెద్ద ఎత్తున వీస్తున్న వడగాడ్పులతో ప్రజానీకం తల్లడిల్లుతోంది. తిరుపతిరూరల్‌లో సోమవరం 42.1 డిగ్రీల సెల్షియస్, అన్నమయ్య జిల్ల కంబాలకుంట, విజయనగరంలో 41.5డిగ్రీలు, నెల్లూరు జిల్లాదగదర్తిలో 41.4డిగ్రీలు, ఏలూరు జిల్లా దెందులూరులో 41.3డిగ్రీలు, నంద్యాలజిల్లా గోనవరం,పల్నాడు జిల్లా రావిపాడులో 41.1 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు మరికొద్ది రోజుల పాటు రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించింది. రాష్ట్ర వ్యాప్తంగా నేడు (మంగళవారం) 28 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, మరో 21 మండలాల్లోనూ వడగాడ్పులు వీస్తాయని ఆ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం 12 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 20 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. మంగళవారం శ్రీకాకుళంలో 4, విజయనగరంలో 13, పార్వతీపురం మన్యంలో 11 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచనున్నాయి. విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరిక ల నేపథ్యంలో వడగాడ్పులు, ఎండల తీవ్రతపై పూర్తిస్థాయిలో సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత నేతృత్వాన మంగళవారం (నేడు) ఈ సమావేశం జరగనుంది. వడగాడ్పులకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేయడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, రాబోయే వర్షాకాలానికి సంసిద్ధత వంటి అంశాలను ఈ సమావేశంలో సమీక్షిస్తామని అధికారులు తెలిపారు. ఈ సమావేశం అనంతరం విజయవాడలోని అగ్నిమాపక విభాగం ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకుఆ శాఖ ఉన్నతాధికారులతో హోంశాఖ మంత్రి భేటీ కానున్నారు.

రేపు 'టెన్త్' ఫలితాలు

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మార్చి-2025 ఎస్ఎస్‌సి, ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ఫలితాలు ఈ నెల 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు వెల్లడించారు. అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్ (మనమిత్ర) లీప్ యాప్‌లలో రిజల్ట్స్ చూసుకోవచ్చన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షా ఫలితాలు https//bse.ap.gov.in, https//apopenschool.ap.gov.in వెబ్‌సైట్లు, మనమిత్ర (వాట్సాప్), ఎల్ఇపి మొబైల్ యాప్‌లలో అందుబాటులో ఉంటాయని, వాట్సాప్ నెంబరు 9552300009 నెంబరుకు హాయ్ అని మెసేజ్ పంపించడంతోపాటు ఎటువంటి విద్యాసేవలు కావాలో ఎంచుకుని, ఆ పై వారి రోల్ నెంబరును నమోదు చేయడం ద్వారా పరీక్షా ఫలితాల పిడిఎఫ్ కాపీని పొందవచ్చన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్‌ల ద్వారా ఫలితాలు పొందే సౌలభ్యం కల్పించినట్లు తెలిపారు.

ఉర్సా' భూముల వ్యవహారం బయటపెట్టండి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో ఉర్సా కంపెనీకి కేటాయించిన భూముల వివరాలు బయటపెట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఊరూ పేరూ లేని ఉర్సా క్లస్టర్ అనే ఐటి కంపెనీకి విశాఖపట్నంలో 60 ఎకరాలు భూమి కేటాయించినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సంస్థకు అధికారికంగా భూములు కేటాయించి ఉంటే వెంటనే రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విశాఖపట్నంలో ఐటి కంపెనీలకు భూ కేటాయింపులు పారదర్శకంగా ఉండాలని, వాస్తవాలు వెల్లడించాలని కోరారు. కొద్దిరోజుల క్రితం టిసిఎస్ కంపెనీకి ఎకరం రూ.0.99 పైసలకు 21 ఎకరాలు ప్రభుత్వం అమ్మినట్లు ప్రకటించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. టిసిఎస్ ఆ భూముల్లో నిర్మాణాలు పూర్తిచేసేలోగా అద్దె భవనాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తాయని వార్తలు వచ్చాయని పేర్కొన్నారు. కానీ ఉర్సా కంపెనీకి భూములు కేటాయించినట్లుగా అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదని, ఇది వాస్తవమా కాదా అన్న విషయాన్ని ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలని కోరారు. వాస్తవమైతే అంతకన్నా తప్పు మరొకటి ఉండదని, ఐటిలో ఎలాంటి చరిత్ర, అనుభవమూ లేని నిన్నా మొన్న ప్రారంభించిన కంపెనీకి ఉచితంగా 60 ఎకరాలు ఎలా కట్టబెడతారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. ఐటి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలన్న పేరుతో విలువైన భూములను ఉచితంగా ఇవ్వడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వీటికి భూమి ఇచ్చినందుకు కనీసం ప్రభుత్వం వాటాదారుగా కూడా లేదని, లీజు కాకుండా ఏకంగా రూ.0.99 పైసలకు అమ్మడమంటే ఉచితంగా ధారాదత్తం చేయడమేనని తెలిపారు. ఇది ప్రభుత్వం చెబుతున్న పి4 నిబంధనలకు వ్యతిరేకమని, వెంటనే ఉచిత కేటాయింపులను రద్దుచేసి చట్టబద్ధంగా ఐటి కంపెనీలకు లీజుకివ్వాలని డిమాండు చేశారు. లీజు నిబంధనలు అమలు చేయని కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మల్లాం పెత్తందార్లపై చర్యలు తీసుకోవాలి

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామంలో పెత్తందార్లు దళితులను సామాజిక బహిష్కరణకు మిగతా 7లో

జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఎనిమిది మంది మావోయిస్టులు మృతి
- మరణించిన వారిలో కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు వివేక్!
- ఎదురుకాల్పుల పేరిట నరమేధం : పౌరహక్కుల సంఘాలు



బోకారో: జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్ ఉన్నట్లు సమాచారం. ఆయనపై ప్రభుత్వం రూ.కోటి రివార్డ్‌ను కూడా ప్రకటించింది. సోమవారం ఉదయం బొకారో జిల్లా లాల్‌పానియా ప్రాంతంలో సిఆర్‌పిఎఫ్‌కు చెందిన కోబ్రా దళం, రాష్ట్ర పోలీసులు నిఘా వర్గాల సమాచారంతో సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం 5.30 గంటల సమయంలో కొండల ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడినట్లు సిఆర్‌పిఎఫ్ అధికారులు తెలిపారు. దీంతో ఇరుపక్షాల మధ్య జరిగిన కాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు చనిపోయినట్లు వెల్లడించారు. మృతులను గుర్తించాల్సి ఉందని తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో ఎస్ఎల్ఆర్, రెండు ఇన్సాస్ రైఫిల్, ఒక పిస్టల్‌తో పాటు ఎనిమిది మంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మావోయిస్టుల కోసం కూంబింగ్ కొనసాగుతోందని తెలిపారు. భద్రతా దళాల్లో ఎవరూ గాయపడలేదని, కాల్పులు కొనసాగుతున్నాయని సిఆర్‌పిఎఫ్ అధికారులు తెలిపారు. అయితే అడవుల్లో ఎదురు కాల్పుల పేరిట భద్రతా బలగాలు నరమేధానికి పాల్పడుతున్నాయని ప్రజాహక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. 2026 మార్చి నాటికి మావోయిస్టుల్లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెబుతున్నట్టుగానే.. ఆధునిక టెక్నాలజీని వినియోగించి మావోయిస్టులను హత్య చేస్తున్నట్టు స్పష్టమవుతోందని వారు తెలిపారు.

బంగారం @ లక్ష..!

6

రజకులకు అట్రాసిటీ నిరోధక చట్టం చేయాలి

- ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభ తీర్మానం
- నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా గురుశేఖర్, భాస్కరయ్య

2

వాణిజ్య ఒప్పందమే కీలకం !

- కీలక పురోగతి సాధించామన్న వాన్స్, మోడీ
- అమెరికా ఉపాధ్యక్షునితో ప్రధాని భేటీ



న్యూఢిల్లీ : అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ భారత్ పర్యటనలో రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందమే కీలకంగా మారింది. ఇప్పటికే ఉన్నతాధికారుల స్థాయిలో దీనిపై చర్చలు సాగుతుండగా, భారతదేశానికి సోమవారం వచ్చిన జెడి వాన్స్ సైతం ఈ ఒప్పందంపైనే ప్రధానంగా దృష్టి సారించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ జరిగిన ముఖాముఖి చర్చల్లోనూ ఈ అంశమే ప్రధానంగా చోటుచేసుకుంది. ఒప్పందానికి సంబంధించిన వివిధ అంశాలను నేతలు ఇద్దరు చర్చించారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో ద్వైపాక్షిక వాణిజ్యఒప్పందంపై కీలక పురోగతిని సాధించామన్న అభిప్రాయాన్ని ఇరువురు నేతలు వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మరింత ముందుకు తీసుకుపోనున్నట్లు చెప్పారు. ఇంధన, రక్షణ రంగాల్లో సహకారంపై, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడంపై ఇరువురు చర్చించినట్లు ఈప్రకటన తెలిపింది. అంతకుముందు నాలుగురోజుల పర్యటనకు గాను వాన్స్ సోమవారం ఉదయం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. కొద్ది సేపు విశ్రాంతి అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వాన్స్ ప్రధాని మోడీ నివాసానికి వెళ్లారు. తన నివాసానికి వచ్చిన వాన్స్ కుటుంబ సభ్యులకు మోడీ ఎదురేగి సాదరంగా లోపలకు ఆహ్వానించారు. భారత సాంప్రదాయ దుస్తులను ధరించిన వాన్స్ పిల్లలతో ముచ్చట్లాడారు. అనంతరం ఇరువురు నేతలు విడిగా సమావేశమైనారు. వివిధ ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై, పరస్పర ప్రయోజనాలు కలిగిన అంశాలపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ ఏడాది చివరిలోగా ట్రంప్ భారత్‌లో పర్యటించాలని ఆశిస్తున్నట్లు ప్రధాని ఈ సందర్భంగా తెలిపారు. చర్చల అనంతరం వాన్స్ కుటుంబానికి ప్రధాని మోడీ ఆతిథ్యం ఇచ్చారు. వాన్స్‌తో పాటు వచ్చిన అమెరికా ప్రతినిధి బృందం కూడా ఈ ఆతిథ్యంలో పాల్గొంది.అంతకుముందు వాన్స్ కుటుంబం ఢిల్లీలోని స్వామి నారాయణ్ అక్షరధామ్‌ను సందర్శించింది. అక్కడ లభించిన ఆతిథ్యాన్ని, అబ్బురపరిచిన ఆలయ నిర్మాణ శైలిని, కట్టడాన్ని ప్రశంసిస్తూ వాన్స్, ఆలయ ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టారు. నాలుగు రోజుల పాటు సాగే వాన్స్ పర్యటనలో దౌత్యపరమైన కార్యకలాపాలతో పాటూ ఇటు సాంస్కృతిక పరమైన అంశాలపై కూడా దృష్టి సారించనున్నారు.

ఆరుగురు డిఎల్‌డిఒలకు పోస్టింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్ శాఖలో ఇటీవల డివిజనల్ అభివృద్ధి అధికారులు (డిఎల్‌డిఒ)గా ఉద్యోగోన్నతులు పొందిన వారికి పోస్టింగ్ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వై హనుమరెడ్డికి కృష్ణా జిల్లా డ్వామా ఫైనాన్స్ మేనేజర్‌గా, జి రాణికి పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం డిఎల్‌డిఒగా, ఎన్ బొజ్జికి ఏలూరు జిల్లా విజిలెన్స్ అధికారిగా, జి అరుంధతికి శ్రీకాకుళం డిఎల్‌డిఒగా, ఎస్ రవీంద్రకు విశాఖ జిల్లా డ్వామా ఫైనాన్స్ మేనేజర్‌గా, ఎస్ రాంబాబుకు నెల్లూరు జిల్లా కందుకూరు డిఎల్‌డిఒగా పోస్టింగ్ ఇచ్చారు.

సిట్ పోలీసుల అదుపులో రాజ్ కసిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి (కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి)ని ఎపి సిట్ పోలీసులు సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. గోవా నుంచి ఇండిగో విమానంలో శంషాబాద్ వచ్చిన ఆయనను ఎయిర్‌పోర్టు ఆవరణలో సిట్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం విచారణకు హాజరవుతానని పోలీసులకు రాజ్ కసిరెడ్డి మొరపెట్టినా అంగీకరించలేదు. తమ వెంట రావాల్సిందేనని ఆయనను అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. రాజ్ కసిరెడ్డిని విజయవాడ తరలించనున్నట్లు తెలిసింది.కాగా, రాజేశ్ రెడ్డి పేరుతో తప్పించుకునేందుకు రాజ్ కసిరెడ్డి ప్రయత్నం చేసినట్టు పోలీసులు తెలిపారు. గోవాలో ఉన్న తనను పోలీసులు అరెస్టు చేస్తారని తెలుసుకొని.. మారుపేరుతో హైదరాబాద్ చేరుకున్నారని, అక్కడి నుంచి విదేశాలకు పారిపోయేందుకు ప్రణాళికలు వేసుకున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు.

మళ్లీ 'ల్యాండ్ పూలింగ్'

- విశాఖలో 245 ఎకరాలకు స్కెచ్!
- విఎంఆర్‌డిఎను రంగంలోకి దించిన టిడిపి నేత

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో 'ల్యాండ్ పూలింగ్' ప్రక్రియ మళ్లీ మొదలైంది. భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఆనందపురం మండలం రామవరం, గంగసాని అగ్రహారంలలో రూ.వేల కోట్ల విలువైన 245 ఎకరాలను కాజేసేందుకు టిడిపి కీలక ప్రజాప్రతినిధి స్కెచ్ సిద్ధం చేశారు. ఈ భూములను తన అనుయాయులైన పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టి ఆర్థిక లబ్ధి పొందాలని చూస్తున్నారు. తన వ్యూహం పక్కాగా పారేందుకు విశాఖ అర్బన్ మెట్రోపాలిటన్ రీజియన్ అథారిటీ (విఎంఆర్‌డిఎ)ని తెరపైకి తెచ్చి నేరుగా రంగంలోకి దిగారు. 'ప్రజాశక్తి' ఈ గ్రామాలను సందర్శించింది. తొమ్మిదేళ్ల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వం ఈ గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ప్రారంభించింది. 2016 అక్టోబర్ 14న జిఒ నంబర్ 290ని తీసుకొచ్చింది. భూములను ప్లాట్లుగా మార్చి రైతులకు ఎకరాకు 900 గజాలు విఎంఆర్‌డిఎ ద్వారా అభివృద్ధి చేసి ఇస్తామని ప్రకటించింది. ఆనందపుర మండలంలోని గంగసాని అగ్రహారం సర్వే 1, 2 నెంబరులో 135 ఎకరాలు, రామవరం సర్వే నెంబరు 121లో 110 ఎకరాలు చొప్పున సమీకరించేందుకు సిద్ధమైంది. ఈ భూములు 170 మంది రైతుల సాగులో ఉన్నాయి. శొంఠ్యాం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో, కనమాం-గోరంట మధ్య రోడ్డుకు అనుకొని ఉన్న ఈ ప్రాంతంలో ఎకరా భూమి కోట్ల రూపాయల్లో ఉంది. అప్పట్లో రాజకీయ దళారులు రంగ ప్రవేశం చేసి ఈ భూములకు ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ కొందరి రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చారు. జీడి, మామిడి తోటలు ఉన్న ఈ భూములను చదును చేసినా ప్లాట్లు వేసే ప్రక్రియ ప్రారంభం కాలేదు.

ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన భూముల్లో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పక్కన విఎంఆర్‌డిఎ అధికారులు (ఫైల్ ఫొటో), రామవరంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో తీసుకుంటున్న భూమి

2014-2019 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వం అమరావతిపై అధిక కేంద్రీకరణ చేయడంతో ఈ పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. నేడు టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భూసమీకరణ మళ్లీ ప్రారంభమైంది. ఈ నియోజకవర్గానికి చెందిన కీలక ప్రజాప్రతినిధి గతంలో ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించిన రైతులతో నేరుగా చర్చలు జరుపుతున్నారు. విఎంఆర్‌డిఎ అధికారులూ వచ్చారని, గతంలో చెప్పిన విధంగా ప్లాట్లు ఇస్తామని చెబుతున్నారని రైతులు తెలిపారు.

రైతులకు ఏం చెబుతున్నారు?

అప్పట్లో భూసమీకరణకు అంగీకరించినందున మరో ఆరు నెలల్లో రైతులకు ఎకరాకు 900 గజాల చొప్పున ప్లాట్లు ఇస్తామని, ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడేలా విఎంఆర్‌డిఎ చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెబుతున్నారు. మాదాపూర్, గచ్చిబౌలి తరహాలో ఇక్కడికి ఐటి కంపెనీలు రాబోతున్నాయని ఊదరగొడుతున్నారు. గతంలో టిడిపి ఆధ్వర్యంలో ఎంవిపి కాలనీ లే అవుట్, మిథిలాపురి కాలనీ లే అవుట్లు రూపుదిద్దుకున్నాయని, ఇదే తరహాలో గంగసాని అగ్రహారం, రామవరం అభివృద్ధి చెందనున్నాయని ఈ నెల పదిన ఈ గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే గంటా; విఎంఆర్‌డిఎ కమీషనర్ కెఎస్‌విశ్వనాథన్, ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ రైతులకు చెప్పుకొచ్చారు. ల్యాండ్ పూలింగ్ కింద తీసుకోనున్న భూముల్లో ఎమ్మెల్యే గంటా భూమి పూజ చేశారు. దీనిలో విఎంఆర్‌డి అధికారులు కూడా పాల్గొన్నారు.

పేదలతో కలిసి భూ స్వాధీన పోరాటం చేస్తున్న సిపిఎం నాయకులు

ఇళ్ల స్థలాల కోసం భూస్వాధీన పోరాటం

ప్రజాశక్తి - గుత్తి (అనంతపురం జిల్లా)

అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని సర్వే నంబర్ 321లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో భూస్వాధీన పోరాటాన్ని చేపట్టారు. ముందుగా పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీ నుంచి ప్రదర్శనగా వెళ్లి ఆ స్థలంలో సిపిఎం జెండాలను పాతారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ... ఏళ్ల తరబడి పేదలు బాడుగ ఇళ్లల్లో ఉంటూ అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా పేదల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. పేదల వద్దకు నాయకులు ఓట్ల కోసమే వస్తున్నారని, తర్వాత వారి బాగోగులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇళ్ల పట్టాలు, పక్క గృహాలు, మౌలిక సదుపాయాలు సాధించుకునేంత వరకు పేదలకు అండగా సిపిఎం నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, నాయకులు బి.రామకృష్ణ, ఎన్.రేణుక, సి.రమేష్, ఎం.మల్లేష్, యు.మల్లికార్జున, కుమార్, రేవతి, కవిత, రామేశ్వరి పాల్గొన్నారు.

నిరసననుద్దేశించి కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో మాట్లాడుతున్న కె.ప్రభాకర్‌రెడ్డి

గో బ్యాక్ జెడివాన్స్

- స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో ఒప్పందాలు వద్దు : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - యంత్రాంగం

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల కోసం భారతదేశ పర్యటనకు వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్ పర్యటనను నిరసిస్తూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో ఒప్పందాలు వద్దని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో వ్యవసాయ, పాడి, మత్స్య రంగాల్లో అసమాన ఒప్పందాలు వద్దని, అమెరికాతో అన్ని అసమాన స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల చర్చల నుంచి వైదొలగాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు. నంద్యాలలోని తిక్కస్వామి సెంటర్ వద్ద ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియుల ఆధ్వర్యంలో రైతులు, కూలీలు, కార్మికులు ధర్నా చేశారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు, ఆత్మకూరు, పాములపాడులోనూ ఆందోళనలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చందనాడ పంచాయతీ తమ్మయ్యపేటలో పాడి రైతులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. 'వాన్స్ గో బ్యాక్, భారతదేశం అమ్మకానికి లేదు' అని నినాదాలు చేశారు. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో అసమాన ఒప్పందాలు వద్దని ఎపి రైతుసంఘం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో ఆందోళనలు చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. జీలుగుమిల్లిలో వాన్స్ గోబ్యాక్ అంటూ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయ సమీపంలో నిరసన తెలిపారు.

రజక వృత్తిదారుల కోసం అట్రాసిటీ నిరోధక చట్టం చేయాలి

ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభ తీర్మానం

నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా గురుశేఖర్, భాస్కరయ్య ఎన్నిక

ప్రజాశక్తి- ఇబ్రహీంపట్నం

రజక వృత్తిదారులు, మహిళలపై దాడులను అరికట్టేందుకు అట్రాసిటీ నిరోధక చట్టం చేయాలని, చెరువులు, గుంటలపై రజకులకే పూర్తి హక్కు కల్పించాలని, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను జిఒ నెంబర్ 27 ప్రకారం భర్తీ చేసి రజక యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభ తీర్మానించింది. సంఘం రాష్ట్ర మహాసభ సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ముత్తవరపు వెంకటేశ్వరరావు, స్వర్ణదేవి కల్యాణ మండపంలో జరిగింది. ఈ మహాసభకు 16 జిల్లాల నుంచి 180 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 14 జిల్లాల నుంచి 18 మంది చర్చల్లో పాల్గొన్నారు.

మహాసభలో మొత్తం 14 తీర్మానాలను ఆమోదించారు. రజక వృత్తిదారులకు నగరాల్లో ఆధునిక దోబీ ఘాట్లను ఏర్పాటు చేయాలని, జిఒ 26 ప్రకారం ప్రతి జిల్లాలో రజక సంక్షేమ కమిటీ ఏర్పాటు చేసి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని, రజక కార్పొరేషన్ ద్వారా విధివిధానాలను నిర్ణయించి కనీసం రూ.1000 కోట్లను వృత్తిదారుల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేయాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి రజక వృత్తిదారునికీ వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానించింది. ఈ తీర్మానాల అమలుకు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించింది. మహాసభకు అధ్యక్షవర్గంగా సి.గురుశేఖర్, వల్లభాపురం వెంకటేశ్వరరావు, మడక రాజు, లింగాల నిర్మలమ్మ వ్యవహరించారు.

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య నివేదికను ప్రవేశపెట్టారు. మహాసభలో నేతలు మాట్లాడుతూ రజకులకు సామాజిక రక్షణ చట్టం చేస్తామని, బిసిలందరికీ రక్షణ కల్పిస్తామని టిడిపి కూటమి నాయకులు గత ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలైనా వీటిని అమలు చేయలేదని తెలిపారు. మహాసభలో కోనేటి రాజు, రేకుల గుంట అంకయ్య, మల్లేశ్వరం ఈశ్వరరావు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు చెక్క వరకు వెంకటరెడ్డి మాట్లాడారు.

గురుశేఖర్

భాస్కరయ్య

నూతన కమిటీ ఎన్నిక

సంఘం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సి.గురు శేఖర్, మన్నూరు భాస్కరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 36 మందితో నూతన కమిటీని, తొమ్మిది మందితో నూతన కార్యవర్గాన్ని, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కోనేటి రాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, లింగాల నిర్మలమ్మ, కోశాధికారిగా బొజ్జ సుబ్బారావు, సహాయ కార్యదర్శులుగా రేకుల గుంట అంకయ్య, మడక రాజు, చెక్కవరపు వెంకటరెడ్డి ఎన్నికయ్యారు.

పోలీసుల కస్టడీకి గోరంట్ల మాధవ్

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి సోషల్ మీడియా కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై దాడికి పాల్పడిన, పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో అరెస్టు అయ్యి రాజమహేంద్రవరం జైలులో ఉన్న మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను రెండు రోజుల పోలీసుల కస్టడీకి గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు సోమవారం అనుమతించింది. ఈ నెల 23, 24 తేదీల్లో కస్టడీకి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే గోరంట్ల మాధవ్ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు తిరస్కరించింది.

హామీలు నెరవేరుస్తాం

- అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సునీత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలకిచ్చిన అన్ని హామీలనూ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని టిడిపి అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఆచంట సునీత పేర్కొన్నారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. జగన్ పాలనలో అంగన్‌వాడీల దుస్థితి దారుణంగా ఉండేదన్నారు. వైసిపి హయాంలో నాసిరకం ఆహారం, కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేశారని, ఎప్పుడు జీతం ఇస్తారో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ పెంపు హర్షణీయమన్నారు.

రైతుల పొట్టకొట్టే విధానాలను విడనాడాలి

- ఆమ్ ఆద్మీ పార్టీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులను అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ, వారిని ఒప్పించి భూ సేకరణ చేయాలే కానీ తమ బినామీ కంపెనీల కోసం రైతుల పొట్టకొట్టే చర్యలకు ప్రభుత్వాలు పాల్పడుతుండటాన్ని ఎదిరిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు పేర్కొన్నారు. విజయవాడలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర నాయకత్వంతో పాటు రైతు సంఘాలు, పౌర సంఘాలు, మిత్రపక్షాలను కలుపుకుని గ్రామాల్లో పర్యటిస్తామన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బినామీ కంపెనీలకు భూములను కట్టబెడుతున్నాయన్నారు. బినామీ కంపెనీల రూపంలో రాష్ట్రంలోకి నల్ల ధనాన్ని తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు.

ఐఎల్‌టిడి కార్మికులకు పని కల్పించడంపై హర్షం

- ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి కంపెనీ వర్కర్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇండియన్ లీఫ్ టుబాకో డివిజన్ (ఐఎల్‌టిడి) చీరాల బ్రాంచిలో లైన్ 2ను ప్రారంభించి గత ఏడేళ్లుగా పని లేకుండా ఉన్న కార్మికులకు పని కల్పించడం పట్ల ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి కంపెనీ వర్కర్స్ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. గుంటూరులోని ఐటిసి ఐఎల్‌టిడి ఇఆర్‌ఎం టి.ఎ పవన్ కుమార్‌ను ఫెడరేషన్ నూతన కార్యవర్గం సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. అనపర్తి బ్రాంచిలో క్యాంటీన్ కాంట్రాక్టు వ్యక్తులు నడపడంతో వస్తున్న ఇబ్బందులను పరిష్కరించాలని యాజమాన్యం దృష్టికి ఫెడరేషన్ తీసుకెళ్లింది. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు నూతన కార్యవర్గాన్ని సంస్థ యాజమాన్యానికి పరిచయం చేశారు. అదే విధంగా విజయవాడలో కార్మిక శాఖ కమిషనర్ ఎం.వి శేషగిరిబాబును ఫెడరేషన్ నూతన కార్యవర్గం సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందించింది. వినతి పత్రాలు అందించిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గోసాల సుధాకర్, కె.ధనలక్ష్మి, ఇతర నాయకులు సామ్యూల్ రాజు, బోయిన పోతురాజు, కొట్లు సూర్యనారాయణ, పఠాన్ కాలేషా, చింత శ్రీనివాస్, కోయ పోతురాజు, చప్పిడి భాస్కర్, వసంతరావు, తిరుమల రావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ నీరు

- హంద్రీనీవా కాలువ వెడల్పు అత్యవసరం : రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న వి.రాంభూపాల్, నాయకులు

హంద్రీ నీవా కాలువ వెడల్పు చేసి పది వేల క్యూసెక్కుల నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం ఆలూరు రోడ్డు సమీపంలోని హంద్రీనీవా కాలువ మరమ్మతు పనులను సోమవారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష హోదాలో జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో పది వేల క్యూసెక్కుల నీరు ఇచ్చేలా హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు కాలువను వెడల్పు చేసి జిల్లాలోని ప్రతి ఎకరాకూ సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత వరకు లైనింగ్ పనులు చేయకూడదనే రైతుల డిమాండ్‌ను పరగణలోకి తీసుకోవాలని కోరారు. రాగులపాడు లిఫ్ట్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా వజ్రకరూరు, గుంతకల్లు, పామిడి మండలాల్లోని గ్రామ ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు పిల్ల కాలువలు తవ్వాలని కోరారు. ఇటీవల జిల్లాలో కురిసిన గాలివానకు దెబ్బతిన్న అన్ని పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్ పాల్గొన్నారు.

వైద్య విద్య వ్యాపారంగా మారడమే అభివృద్ధికి ఆటంకం

- విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ పివి.రమేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వైద్య విద్య వ్యాపారంగా మారడమే వైద్య వ్యవస్థ అభివృద్ధికి ఆటంకంగా మారిందని విశ్రాంత ఐఎఎస్ అధికారి, ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పివి.రమేష్ అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ఆరోగ్య రంగం - మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ప్రభావాలు' అన్న అంశంపై అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ హరిప్రసాద్ మెమోరియల్ స్మారక ఉపన్యాసంలో భాగంగా ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పివి.రమేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ వైద్య వ్యవస్థ పట్ల మధ్యతరగతి ప్రజలు నమ్మకం కోల్పోతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా 70 నుంచి 80 శాతం సిజేరియన్లు ప్రయివేట్ ఆస్పత్రుల్లో జరుగుతున్నాయని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైద్య విద్యకు సంబంధించి ప్రభుత్వం ఆధ్వర్యాన 1200 మెడికల్ సీట్లు, 300 పీజీ సీట్లు, 1000 నర్సింగ్ సీట్లు మాత్రమే ఉన్నాయని అదే ప్రయివేటు కళాశాలల్లో 3600 మెడికల్ సీట్లు, 1400 పీజీ సీట్లు, 5000 నర్సింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అందుకు అనుగుణంగా అధ్యాపక వ్యవస్థ మాత్రం లేదన్నారు. భారతదేశంలోని అత్యధిక ప్రయివేటు ఆస్పత్రులలో ఎక్కువ వాటాలు కార్పొరేట్, ప్రయివేటు వారి ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు.

సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ పివి.రమేష్

మరోవక్త డిఎంఇ (డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) మాజీ డైరెక్టర్ డాక్టర్ సత్యవరప్రసాద్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఐదు నూతన వైద్య కళాశాలలు ప్రారంభించిందని, ప్రస్తుత ప్రభుత్వం మరో 12 వైద్య కళాశాలలు ప్రారంభించేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి నియోజకవర్గంలోనూ ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, రానున్న రోజుల్లో నూతన వైద్య కళాశాలన్నీ పిపిపి విధానంలో నిర్వహణకు ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. ఇది భవిష్యత్తు తరానికి అత్యంత ప్రమాదకరమని చెప్పారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం ప్రధానమన్నారు. మన దేశంలో ఒకప్పుడు వైద్యం ఎంతో చౌకగా లభించేదని, నేడు అది పూర్తిగా ప్రయివేటు వారి చేతుల్లోకి వెళ్లి ఖరీదుగా మారిపోయిందని వివరించారు. మెడికల్ కళాశాలలో సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి రావాలని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలో అధ్యాపకుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం కన్వీనర్ టి.కామేశ్వరరావు, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

అధునాతన సౌకర్యాలతో హాస్టళ్లు

- మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధునాతన సౌకర్యాలతో నూతన సంక్షేమ హాస్టళ్లను నిర్మించాలని అధికారులను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. సచివాలయంలో సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారులతో సోమవారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. హాస్టళ్ల మరమ్మతులు, కొత్త హాస్టళ్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. డిజైన్లను పరిశీలించి పలు సూచనలు చేసి, కొన్ని డిజైన్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ.. అధునాతన సౌకర్యాలతో హాస్టళ్ల భవనాలు నిర్మించాలని, కొత్తగా నిర్మించే ప్రతి హాస్టల్‌లో రీడింగ్ రూమ్, జిమ్, ఎయిర్ వెంటిలేషన్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది నవంబరులోపు హాస్టళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, ఎపిఎస్ఐడిసి ఎమ్‌డి దీవెన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తే చర్యలు

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. కుల ధ్రువీకరణ పత్రాల అప్పీళ్లపై సచివాలయంలో సోమవారం హియరింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీలో సహేతుకంగా, సమగ్రమైన, నిష్పక్షపాత విచారణ చేయాలని సూచించారు.

డిసెంబర్‌కు డయాఫ్రమ్ వాల్ పూర్తి : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామని తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి, ఇరిగేషన్ శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రమ్ వాల్ పనులు చేపట్టామని, ఈ ఏడాది జనవరి 18న కాంక్రీట్ నిర్మాణ పనులు మొదలుపెట్టామని తెలిపారు.

రెండు కట్టర్లు, రెండు గ్రాబర్లతో డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకూ 202 మీటర్లకు పైగా నిర్మాణ పనులు పూర్తిచేశామని, ఏప్రిల్ 30 నాటికి మూడవ కట్టర్ కూడా అందుబాటులోకి రానుందని తెలిపారు. వర్షాకాలంలో సైతం పనులు జరిగేలా, ఎగువ కాఫర్ డ్యామ్‌ను బలోపేతం చేయడానికి బట్రస్ డ్యామ్‌ను మే నెలకు పూర్తి చేస్తామని చెప్పారు. డయాఫ్రం వాల్ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, సమాంతరంగా గ్యాప్-1 వద్ద, ఇసిఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణాన్ని మొదలుపెట్టామన్నారు. గ్యాప్-2 వద్ద ఇసిఆర్‌ఎఫ్ డ్యామ్ పనులు ఈ ఏడాది నవంబర్ 30లోగా మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా పనులు చేస్తున్నామన్నారు. ఇరిగేషన్ శాఖలో రూ.18వేల కోట్ల బిల్లులను వైసిపి ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, అసలు డయాఫ్రమ్ వాల్ ఉందో లేదో కూడా వైసిపి నాయకులకు తెలియదని విమర్శించారు. గత ప్రభుత్వం లస్కర్లకు ఏడాది పాటు జీతాలు బకాయిలు పెడితే, టిడిపి కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. నాడు చంద్రబాబు రూ.430 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తే, జగన్ హయాంలో అసంబద్ధ నిర్ణయాలతో దాన్ని విధ్వంసం చేశారని విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాసు, బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సచివాలయంలోని ఆర్థికశాఖలో పనిచేస్తున్న గెజిటెడ్ ఉద్యోగుల ఉద్యోగోన్నతులకు ప్యానెల్‌ను రూపొందించేందుకు ఉద్యోగోన్నతుల కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పియూష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో ఛైర్మన్‌గా ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, సభ్యులుగా ప్రభుత్వ కార్యదర్శి డి రోనాల్డ్ రోస్, ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి గౌతమ్ అల్లాడ, సభ్య కన్వీనర్‌గా ప్రభుత్వ ఉపకార్యదర్శి నూరుల్ ఖమర్‌తో కమిటీని ఏర్పాటు చేసింది.

ప్రతి ఇంటికీ వైసిపి కార్యకర్త

- ఎస్‌సి విభాగ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దళితులకు వైసిపితోనే సామాజిక న్యాయం లభించిందని, కూటమి పాలనలో దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని, దీనికోసం ప్రతి ఇంటికీ వైసిపి కార్యకర్త వెళ్లాలని వైసిసి కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఎస్‌సి విభాగ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. దీనికి హాజరైన సజ్జల మాట్లాడుతూ.. రెడ్‌బుక్ పేరుతో అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. నాయకులు సుధాకర్‌బాబు, కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ.. పిఠాపురంలో దళితులను అంటరానివారిగా చూస్తున్నారని, వారిపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. మాజీ ఎంపి నందిగం సురేష్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు జగన్ అండగా ఉన్నారని పేర్కొన్నారు. విజన్ పేరుతో చంద్రబాబు రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎస్‌సిలపై అరాచకాలు జరుగుతుంటే పవన్ నోరెత్తడం లేదని విమర్శించారు. ఎంపి గొల్ల బాబూరావు, మాజీ మంత్రి తానేటి వనిత, ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. జగన్ దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని అన్నారు. దళితవాడల్లో పార్టీ వ్యవస్థాగత నిర్మాణంపై ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు, కొరుట్ల శ్రీనివాసులు, కైలే అనిల్, జోగారావు, రాజశేఖర్ తదితరులు మాట్లాడారు.

జిఒ 3కి ప్రత్యామ్నాయం తేవాలి

- పాడేరు ఐటిడిఎ పాలకవర్గ సమావేశంలో మంత్రిని నిలదీసిన ప్రజాప్రతినిధులు

మంత్రి సంధ్యారాణితో వాగ్వివాదం చేస్తున్న వైసిపి ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్ (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ 74వ పాలకవర్గ సమావేశం సోమవారం వాడివేడిగా సాగింది. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా, గిరిజన ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులైన ఎంపిపి, జడ్‌పిటిసి సభ్యులు సైతం వైసిపికి చెందినవారు కావడంతో సమావేశంలో అనేక సమస్యలపై తీవ్ర చర్చలు జరిగాయి. ముఖ్యంగా జిఒ-3కి ప్రత్యామ్నాయ జిఒ చట్టబద్ధతకు పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేయాలని, గిరిజన స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలని, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్మన్, ఎంపి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ఎంపిపి, జడ్‌పిటిసి సభ్యులు పట్టుబట్టారు. ఈ విషయమై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని నిలదీశారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య కొంతసేపు తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా సభ్యులందరూ నిలబడి మంత్రితో మూకుమ్మడిగా ప్రశ్నించారు. దీనిపై మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలోనే సుప్రీంకోర్టు జిఒ-3ని కొట్టివేస్తే ఎందుకు పట్టించుకోలేదని, జిఒ-3కి ప్రత్యామ్నాయంగా అప్పుడు మీరు ఏం చేశారని తిరిగి ప్రశ్నించారు. ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించలేకపోయారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన అంశాలను ప్రస్తుత సమావేశంలో నిలదీయడంపై మంత్రి మండిపడ్డారు. జిఒ-3కి ప్రత్యామ్నాయంగా వేరే జిఒ తీసుకొచ్చి గిరిజనుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అనంతగిరి సిపిఎం జడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసీలకే వంద శాతం ఉద్యోగాలు కల్పించే జిఒ-3 ప్రయోజనాలను కాపాడుతూ ప్రత్యామ్నాయ జిఒ తీసుకొచ్చి ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. జిఒ-3 ప్రయోజనాల చట్టబద్ధతకు పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆప్కాస్ కార్మికులు, సిఐటియు నాయకులు

కార్మికుల తొలగింపు అన్యాయం

- ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్‌ఆర్ కడప జిల్లా పులివెందులలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమని ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య అన్నారు. కార్మికుల తొలగింపునకు నిరసనగా సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి మాట్లాడారు. అన్యాయంగా 25 మంది కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. ఆప్కాస్‌ను కొనసాగించాలా? వద్దా? అనే నిర్ణయం ప్రభుత్వమే ఇంకా తీసుకోలేదని, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలో చేరాలని కార్మికులను బెదిరించడం తగదన్నారు. విధులకు హాజరుకాకుండా ఉద్దేశపూర్వకంగానే కార్మికులను పులివెందుల వ్యవసాయ పరిశోధన కేంద్రం ఇన్‌ఛార్జి సిఇఒ శ్రీనివాస ప్రసాద్ అడ్డుకుంటున్నారని విమర్శించారు. శ్రీనివాస ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు రామ్మోహన్, కమిటీ సభ్యులు మహేష్, జిల్లా కమిటీ సభ్యులు గోపి, ఆప్కాస్ యూనియన్ నాయకులు పవన్, ఉదయ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ పునర్ వైభవానికి పోరాటం

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

దీక్షలో కూర్చున్న సిఐటియు నాయకులు

విశాఖ స్టీల్‌ప్లాంట్ పునర్ వైభవానికి కార్మికులు అలుపెరుగని పోరాటం చేస్తున్నారని, వారి పోరాటాన్ని గౌరవించి కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1530వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన వివిధ విభాగాల సిఐటియు నాయకులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు కెఎం శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఎన్ రామారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఐరన్ ఓర్ మైన్స్ కేటాయించాలని, బ్యాంకు రుణాలు ఈక్విటీలో కలపాలని, బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, వేతన సవరణ ఒప్పందం ప్రకారం జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులపై జరుగుతున్న దాడులను అడ్డుకొని ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువి రావు, డిసిహెచ్ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన

ప్రధాని సభకు భారీగా జనం

- ఏడు రోడ్ల గుర్తింపు
- 2న సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం
- గంటలోపు ముగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి పునర్నిర్మాణ పనులకు వచ్చే నెల 2న ప్రధాని శంకుస్థాపన చేయనున్న సందర్భంగా సుమారు ఐదు లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సోమవారం ఉదయం మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. దీనికి మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సిఎస్ విజయానంద్, నోడల్ అధికారి వీరపాండ్యన్ హాజరయ్యారు. పర్యటన విజయవంతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం కావడంతో రాష్ట్రంలో అన్ని ప్రాంతాల నుండి ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో తెలుగుదేశం గెలుపు తరువాత తొలిసారి ప్రధాని రాజధానికి వస్తున్న సభ కావడంతో ప్రభుత్వం కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భారీ ఎత్తున జన సమీకరణ ద్వారా ఘనస్వాగతం పలకాలని భావిస్తోంది. సుమారు ఐదు లక్షల మంది జనాభా వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం విజయవాడ, గుంటూరు నుండి ఏడు రోడ్లను గుర్తించారు. వెలగపూడి సచివాలయం వెనుకభాగంలో సభా వేదికను నిర్మించనున్నారు. అక్కడ నుండి విట్ యూనివర్సిటీ, వెలగపూడి, మందడం, ఐనవోలు, నేలపాడు వెళ్లేందుకు దారులు ఉన్నాయి. గతంలో కృష్ణాయపాలెం నుండి సెక్రటేరియట్‌కు ఉన్న రోడ్డును కూడా పునరుద్ధరించాలని నిర్ణయించారు. దీంతో ట్రాఫిక్‌కు పెద్దగా సమస్య లేకుండా ఉండేలా చూస్తున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే వాహనాల కోసం వెలగపూడి, కరకట్ట దగ్గర్లో పార్కింగు ఏర్పాటు చేశారు. సభ వేదికకు నాలుగువైపులా ఒక్కోచోట వెయ్యి వాహనాలు ఆపేలా పార్కింగును గుర్తించారు. ఎక్కడికక్కడ స్థలాలు ఖాళీగా ఉండటంతో పార్కింగు సమస్య పెద్దయెత్తున ఉండకపోవచ్చని భావిస్తున్నారు. కరకట్ట వెంట అదనపు రోడ్డును విస్తరిస్తున్నారు. అమరావతికి వెళ్లే మంగళగిరి, తుళ్లూరు, గుంటూరు, నీరుకొండ వైపు నుండి అన్ని రోడ్లనూ పునరుద్ధరించారు. అలాగే ఎక్కడికక్కడ నీరు, మజ్జిగ, ఇతర వసతులూ కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లనూ పూర్తిచేసి అధికారులను నియమించారు. కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తోపాటు, రైతుల నుండి కూడా ప్రధానికి బొకే ఇప్పించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో రైతులు, ప్రజలు సభకు వెళ్లేలా సమావేశాలు పూర్తి చేశారు. దూర ప్రాంతం కూడా కాకపోవడంతో తాడికొండ, మంగళగిరి, పెదకూరపాడు, గుంటూరు, విజయవాడ నగరాల నుండి పెద్దయెత్తున జనసమీకరణ చేయనున్నారు. మే రెండో తేదీన సాయంత్రం మూడు గంటలకు ప్రధాని అమరావతి ప్రాంతానికి చేరుకుంటారు. హెలిప్యాడ్ నుండి రోడ్‌షో ద్వారా నాలుగు గంటలకు సభావేదిక వద్దకు చేరుకుంటారు. ఐదు గంటలకు సభ ముగించనున్నారు. వేసవి దృష్ట్యా సాయంత్రం సమావేశం ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పేదలు, వ్యకాస నాయకులు

భూ పంపిణీ చేయాలని ధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్రామీణ వలసలు నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ అమలు చేయాలని, 200 రోజులు 'ఉపాధి' పనులు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని పేదలు ఆందోళనకు దిగారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ కడప జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, ఉపాధ్యక్షులు దాసరి వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు అయినా గ్రామీణ పేదలకు భూ పంపిణీ చేయలేదన్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులు పెద్ద ఎత్తున భూములు ఆక్రమించుకున్నారని, ఆ భూములను స్వాధీనం చేసుకోవడంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బద్వేల్, గోపవరం, పోరుమామిళ్ల, మైదుకూరు పట్టణాలలో ప్రభుత్వ భూములలో ఇల్లు నిర్మించుకుని నివాసం ఉన్నవారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వల్లూరు, సింహాద్రిపురం, అట్లూరు మండలాలలో ఉపాధి పనులు చేస్తూ మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం కింద రూ.పది లక్షలు చొప్పున చెల్లించాలని కోరారు. ధర్నాకు ముందుగా మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వీరయ్య, నరసయ్య, సురేష్ బాబు, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై పోరుబాట

- కలెక్టరేట్ వద్ద పేదలు, నిర్వాసితుల ధర్నా
- భూముల జోలికొస్తే ఊరుకోం : వెంకటేశ్వర్లు

పాతబస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు ప్రదర్శన నిర్వహిస్తున్న పేదలు, నిర్వాసితులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పేదలు, నిర్వాసితులు కదం తొక్కారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర దౌర్జన్యాలను ఖండిస్తూ పెద్ద ఎత్తున నినదించారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి కలెక్టర్ వరకూ ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు డి పట్టా ఇవ్వాలని, ప్రతి గిరిజన కుటుంబానికి పది ఎకరాల వరకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారుల వద్దకు జాయింట్ కలెక్టర్ వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. పేదల నుంచి భూ సమస్యల దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం జెసి ఎస్.ఎస్. శోభిక మాట్లాడుతూ.. జిల్లాలోని భూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, బంటువాని వలసలో జెసిబితో కూల్చివేసిన కట్టడాలపై తహశీల్దార్, సంబంధిత అధికారులపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అంతకుముందు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పేదలకు న్యాయం చేస్తామని ఓట్లడిగి.. గెలిచి.. నేడు భూస్వాములకు, కార్పొరేట్లకు న్యాయం చేకూర్చడమే పనిగా పెట్టుకున్న స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తీరు మార్చుకోవాలని, లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యే అక్రమ పనులకు అధికారులు తలొగ్గి పనిచేయడం దుర్మార్గమని, అటువంటి పనులకు అధికారులు దూరంగా ఉండాలని హితవు పలికారు. పేదలు, నిర్వాసితుల భూముల జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, నిర్వాసితుల సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు మాట్లాడారు. మే పది లోపు భూ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

యుఎస్‌తో వాణిజ్య ఒప్పందాలపై జాగ్రత్త

- రాజీ పడితే గౌరవం లభించదు
- పలు దేశాలకు చైనా హెచ్చరిక

బీజింగ్ : అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకునే దేశాలకు చైనా పలు హెచ్చరికలు చేసింది. ముఖ్యంగా తమ దేశానికి నష్టం చేసేలా డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న షరతులకు తలొగ్గి యుఎస్‌తో చేసుకునే ఒప్పందాలపై జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేసింది. అమెరికాతో టారిఫ్ ఒప్పందాలు చేసుకోవడానికి అనేక దేశాలు ఆ దేశంతో తీవ్రంగా చర్చలు జరుపుతున్నాయి. ఈ క్రమంలో టారిఫ్‌ల నుంచి ఉపశమనం కావాలంటే చైనాతో ఆర్థిక బంధాన్ని తెంచుకోవాలని ఆయా దేశాలకు అమెరికా షరతులు పెడుతోన్నట్లు రిపోర్టులు వస్తోన్నాయి. బీజింగ్‌తో ఆర్థిక సంబంధాలను తగ్గించుకోవాలని అమెరికా మిత్రదేశాలపై ఒత్తిడి తెస్తోంది. ఈ నేపథ్యంలో చైనా అప్రమత్తమయ్యింది. తమ దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటే ప్రతీకార చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించింది.

చైనా ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఏ దేశమైనా అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంటే దాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని చైనా స్పష్టం చేసింది. ఒకవేళ అలాంటి పరిస్థితి ఎదురైతే దాన్ని ఎన్నటికీ అంగీకరించబోమని పేర్కొంది. తమ నుంచి ప్రతిస్పందన కూడా అదే స్థాయిలో ఉంటుందని హెచ్చరించింది. ఇతరుల ప్రయోజాలను పణంగా పెట్టి తాత్కాలికంగా, స్వార్థపూరితంగా లాభం పొందాలనుకోవడం మంచిది కాదని సూచించింది. దీని వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం చేకూరదని తెలిపింది. స్వల్పకాలిక లాభాల కోసం ఒప్పందాలు చేసుకుంటే అది ఎప్పటికైనా హాని చేస్తుందన్న విషయాన్ని ఆయా దేశాలు గుర్తుంచుకోవాలని సూచించింది. బుజ్జగింపులతో శాంతి స్థాపన జరగదని.. రాజీ పడితే గౌరవం లభించదని స్పష్టం చేసింది. ఏప్రిల్ 2 నుంచి ప్రపంచ దేశాలపై అమెరికా భారీగా పన్నులు విధించింది. కాగా.. వాణిజ్య చర్చల పేరిట వాటిని 90 రోజులు తాత్కాలికంగా నిలిపివేసింది. అయితే చైనాపై మాత్రం క్రమంగా పెంచుతూ 145 శాతం సుంకాలను అమలు చేస్తోంది. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రంగా ముదురుతోంది.

యుఎస్ సభ్యులపై ఆంక్షలు..

అమెరికాతో చైనా ఢీ అంటే ఢీ అంటోంది. తాజాగా అమెరికా కాంగ్రెస్ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, ఎన్‌జిఒ సంస్థల అధిపతులపై చైనా ఆంక్షలు విధించింది. హాంకాంగ్‌కు సంబంధించిన అంశాల్లో అతి ప్రవర్తన కారణంగానే ఈ చర్యలు చేపట్టాల్సి వచ్చిందని పేర్కొంది. గత నెలలో ఆరుగురు చైనా, హాంకాంగ్ అధికారులపై అమెరికా ఆంక్షలు విధించడంపై యుఎస్ తీరుపై చైనా విదేశాంగ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఎన్‌టిపిసితో ఎవ్రెన్ ఒప్పందం

న్యూఢిల్లీ: బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీ గ్రూపు సంయుక్త భాగస్వామ్యంలోని ఎవ్రెన్ తాజాగా దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టిపిసితో ఒప్పందం కుదర్చుకున్నట్లు ప్రకటించింది. డిస్పాచబుల్ పునరుత్పాదక ఇంధన సరఫరా కోసం 300 మెగావాట్ విద్యుత్ కొనుగోలు కోసం ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొంది. విద్యుత్ డిమాండ్ ఉన్న సమయంలో ఇంధన సరఫరా కోసం సౌర, పవన, బ్యాటరీ స్టోరేజ్‌ను సమర్థవంతంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొంది. ఈ పునరుత్పాదక సరఫరా వల్ల గరిష్ఠ డిమాండ్ సమయాల్లో విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి సహాయపడుతుందని తెలిపింది.

బిగ్ బ్యాటరీతో ఒప్పో కె13 5జి విడుదల

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో సోమవారం తన కొత్త ఒప్పో కె13 5జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. బిగ్ బ్యాటరీ 7000 ఎంఎహెచ్‌తో ఆవిష్కరించింది. 8జిబి, 128జిబి వేరియంట్ ధరను రూ.17,999గా, 8జిబి, 256జిబి ధరను రూ.19,999గా నిర్ణయించింది. ఏప్రిల్ 25 నుంచి మార్కెట్‌లో లభించనుందని తెలిపింది. వెనుకవైపు 50 ఎంపి కెమెరా, 2 ఎంపి సెకండరీ కెమెరా, సెల్ఫీ కోసం 16ఎంపి కెమెరాను అమర్చింది.

పంటల సాగుపై బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

మొక్కజొన్న పంటలో వృద్ధి సాధించాలి

- వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు సత్యనారాయణ
- ఉత్తర కోస్తా జిల్లాల పరిశోధన, విస్తరణ మండలి సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి- విజయనగరం

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో వ్యవసాయోత్పత్తి పెరిగేందుకు మరింతగా వీలుందని, మొక్కజొన్న వంటి పంటల్లో ఇంకా వృద్ధి సాధించాల్సి ఉందని ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ అన్నారు. ఉత్తర కోస్తాలోని అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వ్యవసాయ పరిశోధన, విస్తరణ మండలి సమావేశాలు సోమవారం విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. తొలిరోజు పి.వి.సత్యనారాయణ ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ..ఉత్తర కోస్తాలోని వ్యవసాయ యాజమాన్య పనుల్లో నాణ్యమైన శిక్షణ అందిస్తున్నారని, విశ్వవిద్యాలయం నుంచి మంచి వంగడాలు వచ్చాయని తెలిపారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ మాట్లాడుతూ... అభ్యుదయ రైతుల పొలాల్లో మినీకిట్‌లు, ప్రదర్శన కేంద్రాలు, పరిశీలనలు మరింత పెరగాలని, రైతు సేవాకేంద్రాలను మరింతగా ఉపయోగించుకోవాలని సూచించారు. నైరా వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భరతలక్ష్మి, నాబార్డు డిడిఎం నాగార్జున మాట్లాడుతూ... వ్యవసాయంలో యువత ప్రాధాన్యం వుండాలని, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పెరగాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ అధికారి త్రినాధస్వామి మాట్లాడుతూ.... వరి, అపరాలు, నూనెగింజలు, మొక్కజొన్న, చిరుధాన్యాలు, మెట్ట వ్యవసాయం, కలుపుశాస్త్రం, యాంత్రీకరణ తదితర అంశాలపై రైతుల నుంచి వచ్చిన సందేహాలను ప్రధాన శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. విజయనగరం జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు మాట్లాడుతూ... ప్రాథమిక రంగమైన వ్యవసాయం ద్వారా అధికోత్పత్తి రావాలన్నారు. అభ్యుదయ రైతులు మాట్లాడుతూ... మేకలు, పాడిపశువుల పెంపకం ద్వారా ఆదాయం పొందుతున్నట్టు తెలిపారు. రెండో రోజున నాలుగు జిల్లాలకు చెందిన ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖల అధికారులు చర్చలో పాల్గొంటారు.

హైదరాబాద్‌లో అత్యాధునిక చిన్న ఆయుధాల తయారీ కేంద్రం

- క్యారకల్ - ఐకామ్ భాగస్వామ్యంతో ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశ రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించే ప్రపంచ శ్రేణి చిన్న ఆయుధాల తయారీ కేంద్రాన్ని హైదరాబాద్‌లో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) గ్రూపునకు చెందిన ఐకామ్ ఏర్పాటు చేసింది. ఐకామ్ సమీకృత ఇంజనీరింగ్ విభాగం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ఆయుధ తయారీ కేంద్రాన్ని సోమవారం ఐకామ్ టెలీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుమంత్ పాతూరు, క్యారకల్ సిఇఒ హమద్ అల్ అమెరి సంయుక్తంగా ప్రారంభించారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఇక్కడ తయారయ్యే ఆయుధాలు భారత సాయుధ దళాలు, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సిఎపిఎఫ్ఎస్), సాయుధ బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలు, ఎస్‌పిజి వంటి సంస్థల కీలక అవసరాలను తీరుస్తాయని ఆ సంస్థ పేర్కొంది. అలాగే క్యారకల్ సంస్థ ప్రపంచంలోని వివిధ దేశాలకు ఆయుధాల్ని ఎగుమతి చేసేందుకు హైదరాబాద్‌లోని ఆయుధ తయారీ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపింది. యుఎఇ సంస్థ భారత దేశానికి తొలిసారి చిన్న ఆయుధాల తయారీకి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోందని వెల్లడించింది. దేశంతో పాటు ప్రపంచానికి ఉపయోగపడే విధంగా ఆయుధాలను తయారు చేస్తున్నామని సుమంత్ పాతూరు తెలిపారు. ఇది యుఎఇ-భారతదేశ రక్షణ సహకారంలో ఒక మైలురాయిని సూచిస్తుందన్నారు.

ఐదో సెషన్‌లోనూ మార్కెట్ల పరుగు

- సెన్సెక్స్‌కు 855 పాయింట్ల లాభం

ముంబయి : దలాల్ స్ట్రీట్ వరుసగా ఐదో సెషన్‌లోనూ లాభాల్లో సాగింది. అమెరికా టారిఫ్‌ల ఆందోళనలు తగ్గుముఖం పట్టాయనే అంచనాల్లో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం సెన్సెక్స్ 79వేల మార్క్‌ను దాటింది. ముఖ్యంగా బ్యాంకింగ్ షేర్లు ప్రధాన మద్దతును అందించాయి. తుదకు బిఎస్‌ఇ సెన్సెక్స్ 855 పాయింట్లు పెరిగి 79,408.50కు చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 274 పాయింట్లు లాభపడి 24,126 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటిసి, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా షేర్లు అధిక నష్టాలను చవి చూసిన వాటిలో ఉన్నాయి.

నెలాఖరుకు నీటి తొట్టెల నిర్మాణం పూర్తి

- పిఆర్ అండ్ ఆర్‌డి కమిషనర్ కృష్ణతేజ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకంలో పశువుల కోసం చేపట్టిన 15 వేల నీటి తొట్టెల నిర్మాణాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ విఆర్ కృష్ణతేజ తెలిపారు. ఇప్పటి వరకూ 12 వేల తొట్టెల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.45 వేల వ్యయంతో పశు సంవర్ధకశాఖ గుర్తించి ప్రదేశాల్లో 15 వేల తొట్టెల నిర్మాణం ఉపాధి హామీ పథకంలో చేపట్టినట్లు తెలిపారు. ఒక్కో తొట్టె 3 వేల లీటర్ల పరిమాణం కలిగి ఉందన్నారు. వీటివల్ల 15 లక్షల మూగ జీవాలకు తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల పాల ఉత్పత్తి పెరిగి రైతులకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. వీటి నిర్మాణాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల ఒకటిన ప్రారంభించినట్లు తెలిపారు. ఉపాధి పథకంలో వ్యవసాయ అనుబంధ పనుల్లో భాగంగా ఇప్పటికే మినీ గోకులాల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VISAKHAPATNAM

Tender Notice No: 01/2025-26/CE(GVMC)/SE(Elec)/EE (Elec)/ Dt:21.04.2025
01. No.of Works : 1 (One)
02. Value of works (ECV) : Rs.270.00 Lakhs
03. Down loading Starting Date : 21-04-2025 5.00 PM
04. Down loading End Date : 08-05-2025 @ 4.00 PM
05. Last date for Submission of bid : 08-05-2025 @ 4.30 PM
Further details at http://www.apeprocurement.gov.in
O/o the Executive Engineer (Electrical) Division
Sd/- Commissioner, GVMC, Visakhapatnam

State Bank of India Officers Coop. Credit Society Ltd., SBI Building, Bank Street, Koti, Hyderabad (Regd. No.TA-754)

ELECTION NOTICE

Elections to the Posts of (11) managing Committee members of the Society to be held on 06-05-2025 and the detailed Election programme is shown below:

Programme	Date	Time	Venue
Filing of Nominations	26-04-2025 28-04-2025 29-04-2025	11.00AM to 3.00 PM	AT THE SEAT OF THE SOCIETY
SCRUNITY	30-04-2025	11.00 AM onwards	
WITHDRAWAL	01-05-2025	Up to 04.00 PM	
Date of Poll	06-05-2025	9.00 AM to 3.00 PM	

For further details contact the under signed
Hyderabad
Date: 21-04-2025
Sd/- K. Shriram
Deputy Registrar/Election Officer.
Phone No. 9440493950

VIZIANAGARAM MUNICIPAL CORPORATION

e-Proc.NIT No.1269/02/E/TO/2025-26, Dt.19-04-2025.

Sanitation Workers, Engaging of Taurus vehicles, Precast Compound wall, UPHC, Roads, Drains, Culverts etc., under General funds & 15th Fc. Approx. Est.Rs.1496.10 Lakhs.

	1st Spell	2nd Spell	3rd Spell
Download start date & time	Dt.22-04-2025 from 3.30 P.M.	Dt.26-04-2025 from 3.30 P.M.	Dt.02-05-2025 from 3.30 P.M.
Download end date & time	Dt.30-04-2025 upto 3.30 P.M.	Dt.12-05-2025 upto 10.30 A.M.	Dt.17-05-2025 upto 10.30 A.M.
Bid Submission Closing Date&Time	Dt.30-04-2025 upto 4.00 P.M.	Dt.12-05-2025 upto 11.00 A.M.	Dt.17-05-2025 upto 11.00 A.M.
Bid opening date & time	Dt.30-04-2025 after 4.30 P.M.	Dt.12-05-2025 after 11.30 A.M.	Dt.17-05-2025 after 11.30 A.M.

Contact Nos.9849906481, 9849907020. Further details can be seen at www.apeprocurement.gov.in.
Commissioner

సంపాదకీయం

భగవత్ విద్వేషం

దేశ వ్యాప్తంగా ప్రజలందరికీ ఒకే గుడి, ఒకే బావి, ఒకే స్మశాన వాటికలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ఆదివారం తన అలీగఢ్ పర్యటనలో ఇచ్చిన పిలుపు రాజ్యాంగాన్ని సవాల్ చేయడమే అవుతుంది. సంఘ్ మూల సిద్ధాంతం హిందూ రాష్ట్ర స్థాపన దిశకు నడిపించడంగా పరిగణించాలి. భగవత్ విద్వేష వ్యాఖ్యలను రాజ్యాంగాన్ని ఆమోదించే, లౌకిక, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి. దేశంలో మత విభజనకు ఒడిగట్టి భగవత్ ఇంతగా బరితెగించి విషం కక్కడం మోడీ ప్రభుత్వ అండతోనే సాధ్యమవుతుంది. దేశ సమైక్యతకు, సమగ్రతకు విఘాతం కలిగించే వారిపై దేశ ద్రోహం వంటి కఠిన సెక్షన్ల కింద కేసులు పెట్టి జైలుకు పంపాలి. భగవత్‌పై అది జరగలేదంటేనే బిజెపి, మోడీ ప్రభుత్వ మద్దతు ఏ స్థాయిలో ఉందో తేటతెల్లమవుతోంది. భారతదేశం విభిన్న మతాలు, కులాలు, జాతుల సమాహారం. భిన్నత్వంలో ఏకత్వం మన సంస్కృతి, సంప్రదాయం, వారసత్వం. ఈ సామాజిక వైవిధ్యంగానే లౌకిక రాజ్యంగా భారత్ అవతరించింది. రాజ్యాంగ స్వరూపానికి అదే పునాది. ఆసేతు హిమాచలం ప్రజలందరినీ దండలో దారంలా కలిపి ఉంచుతున్నదిదే. ఈ వ్యవస్థను విధ్వంసం చేయాలన్నది సంఘ్ చిరకాల వాంఛ. దానిలోనుంచి పుట్టినదే తాజాగా భగవత్ నోటి నుంచి ఆవిష్కృతమైన విద్వేష 'సందేశం'.

ఆర్ఎస్ఎస్‌కు బిజెపి రాజకీయ విభాగం అన్నది బహిరంగ రహస్యం. కేంద్రంలో మోడీ అధికారంలోకొచ్చాక సంఘ్ మార్గదర్శకత్వంలోనే ప్రభుత్వం పని చేస్తోందనడానికి కేబినెట్ కూర్పు సహా పలు దృష్టాంతాలు కనిపిస్తాయి. ఎప్పటికప్పుడు నాగపూర్‌లోని సంఘ్ హెడ్‌క్వార్టర్‌కు ప్రోగ్రెస్ రిపోర్టులను సమర్పించి దిశా నిర్దేశాలను స్వీకరించడం తెలిసిందే. బిజెపి సర్కారు రెండవ తడవ పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే 370 ఆర్టికల్‌ను రద్దు చేసినా, మూడవ సారి పీఠం ఎక్కాక ముస్లింల లక్ష్యంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని బుల్డోజ్ చేసినా సంఘ్ దీర్ఘకాలిక హిందూ రాజ్య స్థాపన ప్రాజెక్టులో భాగమే. ఒకే దేశం- ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే భాష, ఏక రూప పౌరస్మృతి, నూతన విద్యా విధానం... ఇటువంటివన్నీ ఆర్ఎస్ఎస్ కర్మాగారంలో తయారైనవే. జమిలి ఎన్నికలనే తీసుకుంటే తమకు లోక్‌సభలో, రాజ్యసభలో మెజార్టీ లేకపోయినా ఆర్ఎస్ఎస్ అభిలాషకనుగుణంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వరకు వెళ్లింది. ఆర్ఎస్ఎస్ రెండవ చీఫ్ గోల్వాల్కర్ తన సైద్ధాంతిక గ్రంథంలో ఒకే ఎన్నిక ప్రతిపాదన చేశారు. ఆ తోవకు మోడీ సర్కారు ప్రయత్నాలు ముమ్మరం కావిస్తోంది.

ఈ మధ్యనే మోహన్ భగవత్ మసీదులను కూల్చి దేవాలయాలు నిర్మించడం, మసీదు లోపల శివలింగాలను కనుగొనడం మానుకోవాలని తమ శాఖలకు సూక్తి ముక్తావళి పఠించారు. అయోధ్య అనేది ప్రత్యేక పరిస్థితుల్లో తీసుకున్నదని, అది విజయవంతమైందని శెలవిచ్చారు. అంతలోనే ప్రజలందరికీ ఒకే గుడి, బడి, వల్లకాడు అంటున్నారు. ఆర్ఎస్ఎస్‌ది రెండు నాల్కల విధానమని, గోముఖ వ్యాఘ్రమని ఈ ఉదంతంతో రూఢీ అవుతుంది. అయోధ్యపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చినప్పుడు, తదుపరి వంతు మధుర, కాశీ... అన్నారు. ఇటీవలనే జైపూర్ దర్గా హిందువులదన్న వివాదం లేవదీశారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో మసీదు కింద ఆలయం ఉందని సర్వే పేరిట నానా యాగీ చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని కులం మన దేశంలో వేల ఏళ్లుగా వేళ్లూనుకుంది. హిందూ మత రాజ్య స్థాపనకు కులం అవరోధమని ఆర్ఎస్ఎస్ ఎప్పుడో గుర్తించింది. కుల విభేదాలొద్దని భగవత్ చెప్పే సుద్దులు తన లక్ష్య సాధనలోనివే. జాతీయ ఐక్యత, సామాజిక ఏకత్వం, సామూహికంగా హిందూ పండగల నిర్వహణ... ఇవన్నీ హిందూ రాష్ట్ర ప్రాజెక్టులోనివే. తన వందేళ్ల ప్రస్థానంలో వీటినే ఆర్ఎస్ఎస్ నమ్ముకొని అవకాశం చిక్కినప్పుడల్లా వాటిపై కేంద్రీకరించి పని చేస్తోంది. భగవత్ విద్రోహ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి. కేంద్రంలో మోడీ మనుగడకు భుజం కాసే పార్టీలు తమ వైఖరి చెప్పాలి. దేశ ఐక్యతను సవాల్ చేస్తున్న సంఘ్‌ను ఒంటరి చేసి దోషిగా నిలబెట్టేందుకు లౌకిక, ప్రజాస్వామిక వాదులు నడుం కట్టాల్సిన సమయమిది.

మంచి మాట

ఒక దేశం గొప్పతనం
ఆ దేశం
ప్రజలకు కల్పించిన హక్కులపై
ఆధారపడి వుంటుంది.
-హెచ్.జె.లాస్కీ
ఆంగ్ల ఆర్థికవేత్త.

ప్రపంచానికి ప్రతిపదార్థం లెనిన్

సందర్భం

తె.ర



నేడు లెనిన్ 155వ జయంతి

మనం చరిత్ర చదివేప్పుడు యోధులు, రాజనీతిజ్ఞులు, దేశాధినేతలు, వ్యూహకర్తలు ఇలా రకరకాలుగా చెప్పుకుంటాం. కొందరిని కొన్నింటికి ప్రతీకలుగా అభిమానిస్తాం. అనుసరిస్తాం. కానీ ఇందులో ప్రతి వర్ణనలో ఇమిడిపోయేవారు చాలా అరుదుగా వుంటారు. అలాంటి అరుదైన మహా నేత, నిర్మాత, సిద్ధాంత సూత్రాల సంధాత, విప్లవాల ప్రయోక్త వ్లదిమీర్ ఇల్యిచ్ లెనిన్. యువకుడుగా విద్యార్థిగా అధ్యయనశీలిగా, ఉద్యమ నిర్మాతగా, వ్యూహశిల్పిగా, విప్లవకారుడుగా, అంతిమంగా చరిత్ర అప్పటి వరకూ ఎరగని అరుణారుణ సామ్యవాద మహారాజ్య నిర్మాతగా నిలిచిపోయిన మహనీయుడు లెనిన్. కమ్యూనిస్టు ఉద్యమంలోనూ సిద్ధాంత కోవిదులూ, సమర సేనానులు అంటూ కనిపిస్తుంటారు గానీ లెనిన్ ఈ రెండింటి మేలు కలయిక. మార్క్స్, ఎంగెల్సుల విప్లవ సిద్ధాంతాన్ని ఆకళింపు చేసి, ఆధునీకరించి, అన్వయించి విజయం సాధించడమే గాక విశ్వవ్యాప్తం చేసిన విజ్ఞాన ఖని. విప్లవ మేధ. యోధ. ఈ రోజు ఆయన 155వ జయంతి. 1870 ఏప్రిల్‌లో ఆయన పుట్టారు.

లెనిన్ పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశగా సామ్రాజ్యవాదమనే భావనను తీసుకొచ్చి ద్రవ్య పెట్టుబడి రూపాలను ఆవిష్కరించి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సుసంపన్నం చేసిన ధీశాలి. సిద్ధాంతం విజయం సాధించాలంటే ఆచరణలోకి తెచ్చే అగ్రగామి దళం లాంటి శ్రామికవర్గ పార్టీ వుండాలని బోధించడమే గాక మిగిలిన పాలక వర్గ పార్టీలకు భిన్నంగా దాన్ని ఎలా నిర్మించుకోవాలో కూడా ఆచరించి చూపిన దార్శనికుడు. దాన్ని ప్రచారంతో ఆ జనంలోకి తీసుకువెళ్లేందుకు ప్రచార సాధనాలు వుండాలని ప్రజాశక్తి వంటి ప్రజా పత్రికల వరవడికి నాంది పలికాడు. ఇందులో ఒక్కొక్కటి చేయడానికే ఒక జీవిత కాలం చాలదు గానీ ఇవన్నీ చేసి యాభయ్యవ పడిలోనే శాశ్వతంగా తుది శ్వాస విడిచిన అమరజీవి లెనిన్. వ్యక్తిగా జారు చక్రవర్తిని అంతం చేయడం కోసం ప్రయత్నించి ఉరికంబం ఎక్కిన అన్నను ఆరాధిస్తూనే ఆ మార్గం సరైంది కాదని తెలుసుకోగలిగిన ప్రతిభావంతుడు. ఉద్యమ సహచరి కృపస్కయాను విప్లవ పథంలో తోడుగా చేసుకున్న ప్రేమికుడు. తన తర్వాత సోషలిజాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం స్టాలిన్ వంటి వారికి బాధ్యతలు అప్పగించి దూరంగా గడిపిన త్యాగశీలి.

'సామ్రాజ్యవాదం-పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' (1916) అనే తన మహత్తర గ్రంథంలో లెనిన్ తొలిసారిగా 19వ శతాబ్దపు లక్షణాలను క్రోడీకరించాడు. ఈ దశలో పెట్టుబడిదారీ విధానం గుత్త స్వభావం సంతరించుకుంటుంది. దేశాల ఆర్థిక వ్యవస్థల్లో గుత్త సంస్థలే కీలక పాత్ర వహిస్తాయి. గుత్తాధిపత్యం సామ్రాజ్యవాద దశ మొదటి లక్షణం. సరుకుల ఎగుమతి బదులు పెట్టుబడి ఎగుమతి రెండో లక్షణం. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కలగలసిన ఫైనాన్స్ పెట్టుబడి ప్రాబల్యం పెరగడం మూడో లక్షణం. నాలుగో లక్షణం వివిధ దేశాల గుత్త సంస్థలు చేతులు కలిపి గొలుసుకట్టుగా ఏర్పడ్డం. చివరి లక్షణం ఈ క్రమంలో అగ్ర స్థాయి పెట్టుబడిదారీ దేశాలు ప్రపంచ భూభాగాన్ని తమ మధ్య పంచుకోవడం ఆ పంపకాలలో వాటాలు పెంచుకోవడానికి పునర్విభజనకు యుద్ధాలు సృష్టించడం-ఇవీ లెనిన్ వివరించిన అంశాలు. వీటి ఆధారంగా తమ దేశంలో కర్తవ్యాలను వాటిని సాధించే రాజకీయ శక్తిగా కార్మికవర్గ పార్టీని ఆయన అంకురార్పణ చేశాడు. ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలోనే రష్యా ప్రపంచ విప్లవ శక్తులకు ప్రధాన ప్రేరణ అయింది. 1898లో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఏర్పడింది. 1903లో పార్టీ రెండవ మహాసభలో పార్టీ నాయకత్వానికి జరిగిన ఎన్నికలలో లెనిన్ భావాలను బలపరచేవారు అధికంగా ఎన్నికైనారు. అందుకు వ్యతిరేకంగా తప్పుడు సిద్ధాంతాలను బోధించేవారు ఓడిపోయారు. ఈ రెండు వర్గాలను బోల్షివిక్ (మెజారిటీ), మెన్షివిక్ (మైనారిటీ) అన్నారు. 1905 డిసెంబర్‌లో కార్మికులు 1905లో రష్యా సైనికుల సాయుధ తిరుగుబాటు చేయగా అది విఫలమైంది. అయినా ఎన్నో గుణపాఠాలు నేర్పింది. ముఖ్యంగా కార్మికులలో ఐక్యత అవసరాన్ని చెప్పింది. "1905 డ్రెస్ రిహార్సల్ లేకపోతే 1917 అక్టోబర్ విప్లవం అసాధ్యమై వుండేది" అని లెనిన్ అన్నారు. 20వ శతాబ్ది ప్రారంభం నాటికే ప్రపంచ అగ్రరాజ్యాల మధ్య శతృత్వాలు, ఘర్షణలు పరాకాష్టకు చేరుకున్నాయి. సామ్రాజ్యవాదులు కొత్తగా వలసలు ఏర్పరచుకోవడానికి ఎక్కడా భూభాగం అందుబాటులో లేదు. అలాంటి తరుణంలో సంభవించిన వివిధ ఘటనలు ప్రపంచయుద్ధ పరిస్థితికి దారితీశాయి. చివరకు 1914 ఆగస్టు 1న మొదటి ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లింది. అవకాశవాద కార్మిక నేతలు తమ తమ దేశాలలో పాలకులను బలపర్చే విధానం తీసుకున్నారు. 1914లో నెదర్లాండ్స్‌లో వున్న లెనిన్ కార్మికోద్యమానికి నూతన విప్లవ కార్యక్రమాన్ని ప్రతిపాదించాడు. ఇది సామ్రాజ్యవాద యుద్ధమంటూ అవకాశవాద పోకడలను ఖండించాడు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలని పిలుపునిచ్చారు.

అక్టోబర్ 25, 26 తేదీల (కొత్త తేదీ నవంబర్ 7) మధ్య తెల్లవారుతుండగా సైనికులు, నావికులు రష్యా చక్రవర్తుల నివాస భవనమైన వింటర్ ప్యాలెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. జార్ చక్రవర్తి కూల్చివేత అనంతరం కూడా లెనిన్ ఓపికతో అనేక వ్యూహాలు అనుసరించారు. అయితే తాత్కాలిక ప్రభుత్వం చేతుల్లో నుంచి సోవియట్లకు అధికారం బదలాయించేందుకు జరిగిన అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాకే విప్లవం అవసరమైంది. దానిపై పెట్టుకున్న ఆశలు వమ్మయినందువల్లనే ప్రజలు విప్లవాన్ని సంపూర్ణంగా బలపరిచారు. నవంబర్ 7వ తేదీన 2 కోట్ల మంది ఓటర్లకు ప్రాతినిధ్యం వహించే సోవియట్ల ప్రతినిధులు లెనిన్ నాయకత్వాన నూతన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. సోవియట్ ప్రభుత్వం ఏమాత్రం ఆలస్యం చేయకుండా మొదటగా శాంతి కోసం విజ్ఞప్తి చేసే డిక్రీ ఆమోదించింది. ప్రజాతంత్రబద్ధమైన న్యాయమైన శాంతి కోసం సంప్రదింపులకు సిద్ధంగా వున్నట్లు యుద్ధంలో పాల్గొనే దేశాలకు తెలియచేసింది. భూస్వాములకు, చర్చిలకు సంబంధించిన పొలాలను, పశుసంపదను ఎలాంటి పరిహారం లేకుండా స్వాధీనం చేసుకునే మరో డిక్రీ, 8 గంటల పనిదినంపై ఇంకో డిక్రీ ఆమోదించింది. జాతుల స్వయం నిర్ణయాధికార హక్కును, విడిపోయే స్వేచ్ఛను గుర్తించే డిక్రీ ఇంకోటి. సోవియట్ రష్యా విప్లవ విజయానంతరం కూడా అనేక అగ్నిపరీక్షలను ఎదుర్కోవలసి వచ్చింది. కూలిపోయిన కెరెన్స్కీ ప్రభుత్వం విప్లవ వ్యతిరేక ప్రతీఘాత శక్తులను ఎగదోసింది. వైట్ గార్డులనే పేరిట వారు గ్రామాల్లో చేరి తీవ్ర బీభత్సకాండ సృష్టించారు. వాటన్నిటి మధ్యనా లెనిన్ ఎంతో చాకచక్యంగానూ సిద్ధాంతబద్ధంగానూ సమయోచితమైన ఎత్తుగడలు అనుసరించారు. ఆర్థికాభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళిక రూపొందించాడు. 1918 జులైలో సోవియట్ తొలి రాజ్యాంగం రూపొందింది. కెరెన్స్కీ ప్రతీఘాత చర్యలకు మద్దతుగా సామ్రాజ్యవాద శక్తులు రంగంలోకి దిగాయి. 1918 మార్చిలో ఫ్రెంచి, బ్రిటిష్, అమెరికన్ సేనలు రష్యాలో దిగాయి. ఏప్రిల్ 4,8 తేదీలలో జపాన్ అమెరికా సేనలు కూడా ప్రవేశించాయి. ఈ అంతర్గత బాహ్య శత్రువులను భౌతికంగా ఎదుర్కొంటూ లెనిన్ రష్యాను నిలబెట్టారు. సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించకపోగా చుట్టుముట్టి కూలదోసేందుకు కుట్రలు పన్ని సామ్రాజ్యవాదులు ఆ తర్వాత నెమ్మదిగా దిగివచ్చి, ఒప్పందాలు చేసుకున్నారు.

తమ దేశంతోనే ఆగక లెనిన్ ఇండియాతో సహా దేశదేశాల కార్మిక వర్గ పోరాటాలకు ఊతమిచ్చారు. వలసాధిపత్యంపై పోరాడాల్సిన అవసరాన్ని గుర్తించి ప్రాచ్య దేశాల విశ్వవిద్యాలయంలో భారతీయ విప్లవకారులకు కూడా తర్ఫీదునిచ్చారు. నిజంగా లెనిన్ శ్రామికవర్గ అంతర్జాతీయతను అమలు చేసిన ప్రపంచ నాయకుడు. ఒక వామపక్ష తీవ్రవాది హత్యాప్రయత్నం కారణంగా లెనిన్ తీవ్రంగా గాయపడిన తర్వాత స్టాలిన్ ఆ స్థానంలో నాయకత్వం చేపట్టారు. ఆ దశలో కూడా లెనిన్ అధ్యయనం కొనసాగించారు. తన వంతు సలహాలు ఇస్తుండేవారు. చివరకు 1921 జనవరి 21 లెనిన్ కన్నుమూశారు.

ఆయన బహుముఖ ప్రజ్ఞ, అపార అధ్యయనం, నిశితమైన సైద్ధాంతిక రచనలు మరెవరితోనూ పోల్చలేనివి. గోర్బచేవ్ వంటి వారి కారణంగా విచ్ఛిన్న చర్చలు మొదలైనాక లెనిన్ విగ్రహాలనే కూల్చడం యాదృచ్ఛికం కాదు. 1991 ఆగస్టులో సోవియట్ విచ్ఛిన్నత వరకూ దారితీసిన ఆ పరిణామాలు...లెనినిస్టు సూత్రాలను పరిత్యజించిన దాని పర్యవసానాలు తప్ప...మార్క్సిజం, లెనినిజం మౌలికతను వమ్ము చేసేవి కావు. ఆయన చెప్పిన సామ్రాజ్యవాదం, ద్రవ్య పెట్టుబడి విశ్వరూపం దాల్చి ప్రపంచీకరణ పేరిట పెత్తనం చేసి ఇప్పుడు అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయిన తీరు అమెరికా నుంచి ఆంధ్రావనిలో రొయ్యల వ్యాపారం వరకూ కనిపిస్తూనే వుంది. సాంకేతిక సైనిక వ్యవస్థలలో పెద్ద మార్పులు వచ్చాయి. మీడియా స్వరూపం మారింది. వీటిని సవ్యంగా అర్థం చేసుకుని పోరాడితే విప్లవకర శక్తుల పురోగమనానికి దోహదం కలుగుతుంది. ఆ క్రమంలో ముందువెనకలుంటాయి. మా తప్పులను ఆత్మవిమర్శ చేసుకుంటే శత్రువులు నవ్వొచ్చు గాని మేము మాత్రం అది అవసరమనే భావిస్తాం. తప్పులు జరిగితే దిద్దుకుంటాం అని ఒకటికి నాలుగు సార్లు ఢంకా బజాయించి చెప్పిన లెనిన్ స్ఫూర్తి ఈనాడు మనకు మరింత అవసరం. అవకాశవాద పోకడలపై పోరాటం, ఆశయాల పట్ల అవగాహన, ఆచరణలో అప్రమత్తత ఇదే లెనిన్ మార్గం. ప్రపంచమనే పద్యానికి ప్రతిపదార్థం లెనిన్ అని శ్రీశ్రీ చెప్పిన మాట యథార్థమని తను రాసిన ఏ పంక్తి చదివినా అర్థమవుతుంది.

విశాఖ మేయర్ పీఠం-ప్రలోభ రాజకీయాలు

వ్యాఖ్య



డా.బి. గంగారావు

> అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇచ్చేనాటికి ఇంతమంది సభ్యులు టిడిపి కూటమికి లేరు. ఈ నేపథ్యంలో వైసిపి కార్పొరేటర్లపై ఆపరేషన్ ఆకర్ష్‌కు పాల్పడింది. అలాగే కూటమిలో ఉన్న వారిని కాపాడుకోవటానికి మలేషియా విహార యాత్రకి కుటుంబ ప్యాకేజీగా తీసుకెళ్ళి విదేశాల్లో క్యాంప్ రాజకీయాలకు తెరలేపింది. మొత్తం 27 మంది వైసిపి కార్పొరేటర్లను తన వైపు చేర్చుకుంది. అయినా అవిశ్వాసంలో నెగ్గలేమనే భయంతో కేరళలోని వైసిపి క్యాంప్ నుండి మరికొందరు కార్పొరేటర్లను రాబట్టడానికి పోలీసు అస్త్రాన్నీ వాడారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి నుండి మంత్రి లోకేష్ తోపాటు అనేకమంది స్వయంగా రంగంలోకి దిగారు. కొంతమంది మంత్రులను విశాఖలో మకాం పెట్టించారు. అయినా కేవలం 74 మంది మద్దతుతో అతి కష్టం మీద బయటపడింది.

టిడిపి కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను తమ వశం చేసుకోవటానికి తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించాయి. తొలుత మున్సిపల్ మేయర్, చైర్ పర్సన్‌లపై అవిశ్వాస తీర్మానంపై ఉన్న నాలుగేళ్ల కాలపరిమితి గడువును మూడేళ్లకు కుదించటానికి సవరణ తీసుకురావటానికి ప్రయత్నం చేశాయి. తీవ్ర విమర్శలు రావడంతో వెనక్కి తగ్గాయి. ఆ తరువాత వైసిపి అధీనంలో వున్న మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) మేయర్ పీఠాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవటానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. కొంతమంది వైసిపి కార్పొరేటర్లను తమ పార్టీల్లో చేర్చుకొని గత మార్చి 22వ తేదీన 56 మంది సభ్యుల సంతకాలతో అవిశ్వాస తీర్మానం ఇచ్చాయి. ఫలితంగా అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని ఇంచార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ ఏప్రిల్ 19న ఏర్పాటు చేశారు.

ఎ.పి మున్సిపల్ కార్పొరేషన్-1955 నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కౌన్సిల్‌లో ఓటింగ్ హక్కు కలిగిన సభ్యుల్లో 2/3 వంతు సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం జివిఎంసి లో 97 మంది కార్పొరేటర్లతో పాటు మరో 14 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు మొత్తం 111 మంది సభ్యులుగా ఉన్నారు. కూటమి ప్రతిపాదించిన తీర్మానం నెగ్గాలంటే 2/3 అంటే 74 మంది సభ్యులు అవసరం. అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇచ్చేనాటికి ఇంతమంది సభ్యులు టిడిపి కూటమికి లేరు. ఈ నేపథ్యంలో వైసిపి కార్పొరేటర్లపై ఆపరేషన్ ఆకర్ష్‌కు పాల్పడింది. అలాగే కూటమిలో ఉన్న వారిని కాపాడుకోవటానికి మలేషియా విహార యాత్రకి కుటుంబ ప్యాకేజీగా తీసుకెళ్ళి విదేశాల్లో క్యాంప్ రాజకీయాలకు తెరలేపింది. మొత్తం 27 మంది వైసిపి కార్పొరేటర్లను తన వైపు చేర్చుకుంది. అయినా అవిశ్వాసంలో నెగ్గలేమనే భయంతో కేరళలోని వైసిపి క్యాంప్ నుండి మరికొందరు కార్పొరేటర్లను రాబట్టడానికి పోలీసు అస్త్రాన్నీ వాడారు. దీనికి ప్రతిగా వైసిపి కూడా తమ కార్పొరేటర్లు కూటమి పార్టీల్లోకి వెళ్లకుండా నిరోధించేందుకు కుటుంబ ప్యాకేజీగా శ్రీలంక విహార యాత్రకు తీసుకెళ్ళి క్యాంప్ శిబిరాన్ని నడిపింది. తాయిలాలను ఎరేసింది. ఈ మొత్తం ఎపిసోడ్‌లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి నుండి మంత్రి లోకేష్ తోపాటు అనేకమంది స్వయంగా రంగంలోకి దిగారు. కొంతమంది మంత్రులను విశాఖలో మకాం పెట్టించారు. అయినా కేవలం 74 మంది మద్దతుతో అతి కష్టం మీద బయటపడింది.

మేయర్ మారితే... పార్టీల విధానాలు మారతాయా?

ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నుండి జగన్మోహన్ రెడ్డి వరకు రాజకీయ విలువలు, నీతి, నిజాయితీ ప్రజాస్వామ్యం గురించి తెగ వల్లె వేస్తున్నారు. తామే పవిత్రులమన్నట్లు ఎవరికి వారు సర్టిఫికెట్లు ఇచ్చుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. వైసిపి నాలుగేళ్ల కాలంలో విశాఖను అవినీతి ఊబిలో ముంచిందని, అందిన కాడికి అందినట్లు దోచుకున్నారని, ఇపుడు అవిశ్వాస తీర్మానంతో వైసిపి అరాచక పాలన నుండి విశాఖను విముక్తి చేశామని టిడిపి, జనసేన, బిజెపి నాయకత్వం పగల్బాలు పలుకుతున్నారు. ఇకనుండి ప్రజారంజకంగా విశాఖను అభివృద్ధి పథాన నడిపిస్తామని ప్రకటనలు చేస్తున్నారు.

వాస్తవంగా వైసిపి నాలుగేళ్ల కాలంలో విశాఖ ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడింది. కేంద్ర బిజెపి ఆదేశిత హానికర పట్టణ సంస్కరణలను విశాఖలో అమలు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసింది. ఆస్తి విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధానాన్ని తీసు కొచ్చింది. చెత్తపై యూజర్ చార్జీలు విధించింది. స్మార్ట్ సిటీ ప్రాజక్టులు, క్రీడా మైదానాలు, పార్కులు, స్టేడియంలు వంటి ప్రజల ఉమ్మడి ప్రయోజనాల ఆస్తులను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) పేర ప్రైవేట్ శక్తులకు ధారాదత్తం చేసింది. ఇప్పుడు టిడిపి, జనసేన కూటమి వైసిపి అమలు చేసిన విధానాలను రద్దు చేస్తామని చెప్పటం లేదు. ఆస్తి విలువ ఆధార ఆస్తి పన్నును సమీక్షించి రద్దు చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏడాది దాటుతున్నా నోరు మెదపటం లేదు. కనీసం ప్రతి ఏడాది 15 శాతం ఆస్తి పన్ను పెంచుతున్న విధానాన్ని కూడా రద్దు చేయకుండా అమలు చేస్తున్నది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆస్తి పన్ను తగ్గింపుపై ఇటీవల జరిగిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో సిపిఐ(ఎం) కార్పొరేటర్ ప్రతిపాదించిన ఎజెండాకు కూడా టిడిపి, జనసేన, బిజెపి కూటమి కార్పొరేటర్లు మద్దతు ఇవ్వకుండా వ్యతిరేకించారు. ఇపుడు నీటి చార్జీలు, మురుగు నీటి చార్జీలు పెంచటానికి ప్రయత్నించడమే కాకుండా మొత్తం మంచి నీటి వ్యవస్థను ప్రైవేటీకరించబోతున్నారు.

మోడీ ప్రభుత్వ పట్టణ సంస్కరణలను వైసిపి కన్నా కూటమి వేగంగా అమలు చేస్తున్నది. జివిఎంసి ఆస్తులను పిపిపి పేర బడా సంస్థలకు ధారాదత్తం చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రతి పౌర సేవలకు యూజర్ చార్జీలను ప్రజల నుండి వసూలు చేయనున్నారు.

టిడిపి కూటమి కూడా అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి వలె రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని కాగితాలకే పరిమితం చేసింది. ఈ ప్రభుత్వం కూడా జివిఎంసి నిధులను సుమారు రూ.370 కోట్లు ఇవ్వకుండా వాడుకుంటూ వేధిస్తున్నది. అంతేగాక విశాఖ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్లు సొంతగా వసూలు చేసుకొని వినియోగించుకునే వృత్తి పన్నును ఏకపక్షంగా చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌కి తరలించుకుపోయింది. దీనివల్ల జివిఎంసి ఏడాదికి సుమారు రూ.65 కోట్లు ఆదాయం నష్టపోయింది. ఇపుడు జివిఎంసి ని అభివృద్ధి పేర అప్పుల ఊబిలోకి దించబోతున్నారు. అందువల్ల విశాఖ మేయర్ వైసిపి నుండి టిడిపి కూటమికి బదిలీ అయినా విశాఖ ప్రజలకు వొరిగేదేమీ లేదు. పైగా గతంకన్నా వేగంగా కేంద్ర బిజెపి పట్టణ సంస్కరణల అమలు, ప్రజలపై రకరకాల పన్నుల వడ్డింపుతో పాటు మున్సిపల్ మౌలిక సదుపాయాలు, ప్రజల ఉమ్మడి ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతోంది.

వామపక్ష పార్టీల విలక్షణ పాత్ర

సిపిఐ, సిపిఐ(ఎం)లకు జివిఎంసి లో ఒక్కొక్కరు చొప్పున ఇద్దరు కార్పొరేటర్లు ఉన్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానంలో పాల్గొనకూడదని నిర్ణయించాయి. మతోన్మాద, ఫాసిస్టు తరహా బిజెపితో అంటకాగుతూ దాని ప్రమాదకర పట్టణ సంస్కరణలను వేగంగా అమలు చేసేందుకు పూనుకున్న టిడిపి, జనసేన కూటమి ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని బలపర్చకూడదని, అలాగే వైసిపి అనుసరించిన విధానాలకు, కూటమి అనుసరిస్తున్న విధానాలకు ఎలాంటి తేడా లేదని భావించాయి. అలాగే నాలుగేళ్లలో ప్రజలపై ఆస్తి పన్ను, చెత్తపై యూజర్ చార్జీలు విధించడం తదితర భారాలతో ప్రజలను కడగండ్ల పాలుచేసిన వైసిపి కి కూడా మద్దతు ఇవ్వకూడదని నిర్ణయించాయి.

అయినా టిడిపి, జనసేన కూటమితో పాటు వైసిపి పార్టీలు వామపక్ష కార్పొరేటర్లను తమవైపు తిప్పుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేశాయి. రకరకాల ప్రలోభాలు, పదవులు ఎరవేశాయి. కాని అవినీతి, వ్యాపార రాజకీయాలకు దూరంగా...నీతి, నిజాయితీతో ప్రజల పక్షాన నికరంగా నిలబడ్డారు. మేయర్ వాటిలో ఏ పార్టీకి చెందిన వారయినా విశాఖ ప్రజలకు ఎలాంటి మేలు జరగదని, ఈ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలను సమైక్యంగా తిప్పికొట్టాలని బహిరంగంగా ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలో చట్టసభల్లోనూ ప్రజా క్షేత్రంలోనూ వామపక్ష పార్టీల బలం పెరిగితేనే అవినీతి, వ్యాపార, డబ్బు రాజకీయాలను, దోపిడీ విధానాలను బలహీనపర్చడం సాధ్యమౌతుందని, ఆ దిశగా వామపక్షాల బలాన్ని పెంచాలని కోరాయి.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

కవిత్వం

పుడమి తల్లి

పల్లవి :
నేడే ఈనాడే ధరిత్రీ దినోత్సవం
నేడే ఈనాడే ధాత్రికి ప్రణమిల్లుదాం

చరణం:1
పచ్చని మొక్కలనే మిక్కిలి నాటేద్దాం
పుడమికి ఆయువునే హాయిగ పెంచేద్దాం
పచ్చదనంతో ఈ ధరణినే నింపేద్దాం
వెచ్చదనాన్నే తుదకంతా తరిమేద్దాం

చరణం:2
ప్లాస్టిక్ సంచులను వాడుట మానేద్దాం
గుడ్డ సంచులనే విరివిగా వాడేద్దాం
వ్యర్థ జలాలనే పరిశుద్ధం చేసేద్దాం
కాలుష్య భూతాన్నే తన్ని తరిమేద్దాం

చరణం:3
జీవన ఎరువులతో భూసారం పెంచేద్దాం
పాడి పంటలతో కలకాలం బతికేద్దాం
జంతు జాలంతో సమతౌల్యం పాటిద్దాం
అంతు చిక్కని రోగాలనే అరికడదాం

చరణం:4
వాహనాలను అరుదుగానే వాడుదాం
శిలాజ ఇంధనాన్నే పొదుపు చేసేద్దాం
దగ్గరి పనులకు నడకనే చేరుకుందాం
దూర తీరాలకు వాహనాల్లో పయనిద్దాం

చరణం:5
పచ్చని చీరనే భూమాతకి చుట్టేద్దాం
పచ్చని పచ్చికలో పులకించి పవళిద్దాం
స్వచ్ఛ గాలులనే ఈ అవనికి పంచేద్దాం
మంచి నేలనే భావి తరాలకందిద్దాం.

- గుండాల నరేంద్రబాబు,
అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్, నెల్లూరు
సెల్ :9493235992

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

ది తెనాలి P&T ఎంప్లాయిస్ MACS LTD., తెనాలి

పాలకవర్గపు ఎన్నికల ప్రకటన

పాలకవర్గమునకు ఎన్నుకొనబడవలసిన అభ్యర్థుల సంఖ్య : 4
ఎన్నికలు నిర్వహించబడు తేది : 11-5-2025 ఆదివారం
స్థలం / సమయం : ఎ-1 ఫంక్షన్ హాల్, హెడ్ పోస్టాఫీస్ ప్రక్కన, తెనాలి నందు ఉదయం 8-00 గంటల నుండి మధ్యాహ్నం 2-00 గంటల వరకు
నామినేషన్ పత్రములు దాఖలు చేయు తేది : 2-5-2025 శుక్రవారం ఉదయం 10-00 గంటల నుండి మధ్యాహ్నం 2-00 గంటల వరకు
నామినేషన్ పత్రములు పరిశీలన చేయు తేది : 3-5-2025 శనివారం ఉదయం 10-00 గంటల నుండి మధ్యాహ్నం 12-00 గంటల వరకు
నామినేషన్ పత్రములు ఉపసంహరణ తేది : 4-5-2025 ఆదివారం సాయంత్రం 5 గం.ల వరకు

పాలకవర్గమునకు పోటీ వున్నచో ది.11-5-2025న రహస్య పద్ధతి ద్వారా ఓటింగ్ జరుపబడును.

తెనాలి
తేది: 21-4-2025

ఇట్లు
పి.రామచంద్రరావు,
ఎలక్షన్ ఆఫీసర్.

VENSAI AND ASSOCIATES
వెన్‌సాయి అండ్ అసోసియేట్స్

రిజిస్టర్ ఆఫీస్ : డోర్ నెం. 14-201/2, T.F-A, 3వ అంతస్తు, బ్లాక్ -2, మహేశ్వరీ టవర్స్, పవర్‌గ్రిడ్ ఎదురు, నున్న, విజయవాడ రూరల్, ఎన్.టి.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521 212

ప్రకటన
ఫారం నెం. యుఆర్ సి-2
కంపెనీల చట్టం, 2013, యొక్క సెక్షన్ 374 (బి) మరియు (కంపెనీస్ (అథారిటీ టు రిజిస్టర్) రూల్స్, 2014 యొక్క రూల్ 4 (1) అనుసరించి)

1) ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడమేమనగా కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 366 యొక్క సబ్ - సెక్షన్ (2) అనుసరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో **'వెన్‌సాయి అండ్ అసోసియేట్స్ ప్రైవేట్ లిమిటెడ్'** పేరున వాటాదారులచే మెస్సర్స్ వెన్‌సాయి అండ్ అసోసియేట్స్ భాగస్వామ్య సంస్థగా కంపెనీల చట్టం 2013 యొక్క చాప్టర్ 21 యొక్క పార్ట్ 1 క్రింద రిజిస్టర్ చేయబడి విజయవాడ వద్ద రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కి దరఖాస్తు చేసుకొన్నారు.
2) కంపెనీ యొక్క ప్రధాన ఆబ్జెక్ట్స్ దిగువ విధంగా ఉన్నవి అవి "ఫ్రాంచైజ్ ఏజెంట్లు, ట్రేడింగ్, ప్రతినిధులు, పంపిణీదారులు మరియు నిర్వహణ కాంట్రాక్టర్లు మొదలైనవి" దీనికి సంబంధించినవి.
3) ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమొరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ యొక్క కాపీని ఆఫీస్ డోర్ నెం. 14-201/2, T.F-A, 3వ అంతస్తు, బ్లాక్-2, మహేశ్వరీ టవర్స్, పవర్‌గ్రిడ్ ఎదురు, నున్న, విజయవాడ రూరల్, ఎన్.టి.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521 212 వద్ద పరిశీలించవచ్చును.
4) ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడమేమనగా ఈ దరఖాస్తు ఆక్షేపించు ఎవరైనా వ్యక్తి వారి అభ్యంతరములను వ్రాతపూర్వకముగా సంస్థ / కంపెనీ వారి రిజిస్ట్రారు ఆఫీస్ వద్ద ఒక కాపీతో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 21 రోజులలోగా సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (CRC), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (IICA), ప్లాట్ నెం. 6, 7, 8, సెక్టార్-5, IMT మనేసర్, గుర్గాన్ జిల్లా-122 052, హర్యానా వారికి సమాచారం ఇవ్వవచ్చును.

For VENSAI AND ASSOCIATES
సం/- (పద్మనాభుని వెంకట రవికుమార్)
మేనేజింగ్ పార్ట్‌నర్
తేది : 21-04-2025

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గణపత్రావ్ కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400013. CIN No.U67190MH2008PLC187552. సంప్రదించు నెం.(022) 61827414, (022) 61827375

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(1) ప్రకారం)

ఏదైతే, క్రింది సంతకందారు ది **టాటాక్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్కఅధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ చూపినట్లుగా తేదీన డిమాండ్ నోటీసుజారీచేసి, రుణగ్రహీతలను సదరు నోటీసు తేది నుండి 60రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీత, మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరురూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకున్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి దిగువ పేర్కొన్న మొత్తాలను మరియు డిమాండ్ నోటీసు తేది నుండి దానిపై వడ్డీ మరియు పెనల్ వడ్డీ, చార్జీలు, ఖర్చులు మొ॥వాటిని చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధ వహించవలసిందిగా కోరబడుచున్నది.

క్ర. సం.	రుణ ఖాతా నెం	బాధ్యు(ల)/చట్టబద్ధ వారసు(ల)/ చట్టబద్ధ ప్రతినిధు(ల)పేరు	డిమాండ్ నోటీసు మొత్తం & తేది	స్వాధీనతా తేది
1.	9926453 & 10623784	కె నాగ ఫణీంద్ర (రుణగ్రహీత) కోటమాసు రాజేశ్వరి మరియు శ్రీమతి కోటమాసు వెంకట సాయి మోహన సుధ (సహ-రుణగ్రహీతలు)	16-06-2023 నాటికి మొత్తం రూ.37,06,219/- (రూపాయలు ముప్పైఏడులక్షల ఆరు వేల రెండు వందల పంతొమ్మిది మాత్రమే). డిమాండ్ నోటీసు తేదీ. 16-06-2023	17th April, 2025 భౌతికంగా

సెక్యూర్డు అసెట్స్/ స్థిరాస్తుల వివరణ: రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.1601/2017 ప్రకారం కె నాగ ఫణీంద్ర కుమార్ వారిపేరున ఆర్.ఎస్.నెం.546/2ఏ, 546/2బి, డోర్ నెం.5-66 దగ్గర, గొల్లపూడి గ్రామం మరియు గ్రామపంచాయతీ ఏరియా, ఎస్ఆర్ఓ ఇబ్రహీంపట్నం-521456, కృష్ణ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని దానికి అనుసంధానించబడిన అన్ని సౌకర్య హక్కులు మరియు ఫిక్చర్లతో 751.72చ.అ.ల ప్లింత్ ఏరియా, 122.65 ఉమ్మడి, 180.04 చ.అ.ల బాల్కనీ, 90.0చ.అ.ల కార్ పార్కింగ్‌తో రెండం అంతస్తులోని ఫ్లాట్ నెం.ఎస్ఎఫ్-4లో నిర్మించిన "హిమాగ్న హోమ్స్" అపార్ట్‌మెంట్‌తోసహా సైట్ యొక్క 470.94చ.గ.లు లేదా 393.77చ.మీ.ల విస్తీర్ణంతో మొత్తం ఐటం 1నుండి 4 లోని 27.0చ.గ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థలం మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులుగా: **ఏ-షెడ్యూల్ ఆస్తి:పార్ట్-1:** ఆస్తి 103.63 చ.అ.లు మందపాటి రామకృష్ణకు చెందినది. **సరిహద్దులు: తూర్పు:** పొన్నం వెంకయ్య మరియు ఇతరుల ఆస్తి 24.8 అ.లు, **దక్షిణం:** కలిదిండి భానువర్మ మరియు ఇతరుల ఆస్తి 37.6 అ.లు, **పడమర:** ఐటం-4 ఆస్తి 24.9 అ.లు, **ఉత్తరం:** శ్రీమట్ తిరుమల పెద్దింటి రాధా కృష్ణమాచార్యులు ఆస్తి 38.0 అ.లు. **పార్ట్-2 ఆస్తి 207.57 చ.గ.ల ఖాళీ స్థలానికి సరిహద్దులు: తూర్పు:** ఐటం 4 ఆస్తి 48.0అ.లు, **దక్షిణం:** అంబటి సత్యనారాయణ మరియు ఇతరుల ఆస్తి 37.6 అ.లు, **పడమర:** వల్లూరు వెంకటేశ్వరరావు ఇతరులకు విక్రయించినది-50.0అ.లు, **ఉత్తరం:** వాజిపేయాజులు శ్రీరామ చంద్రమూర్తి ఆస్తి 39.0 అ.లు. **పార్ట్-3 ఆస్తి 10.374 చ.అ.ల ఖాళీ స్థలం: తూర్పు:** పొన్నం వెంకయ్య మరియు ఇతరుల ఆస్తి 24.10 అ.లు, **దక్షిణం:** అంబటి సత్యనారాయణ మరియు ఇతరుల ఆస్తి 37.1 అ.లు, **పడమర:** ఐటం 4 ఆస్తి 25.3అ.లు, **ఉత్తరం:** పెన్మత్స శివప్రసాద్ నరేంద్రనాథ్ ఆస్తి 37.6 అ.లు. **ఐటం 2 మరియు 3 అనునవి కలిదిండి భానువర్మకు చెందినది.** పార్ట్ 4 విస్తీర్ణం 112.0 చదరపు గజాల ఖాళీ స్థలంలో 56.0 చదరపు గజాల విస్తీర్ణంలో ఉంది. మండపాటి రామకృష్ణ మరియు కలిదిండి భానువర్మ ఉమ్మడి ఆస్తి. **దీని సరిహద్దులు: తూర్పు:** విక్రేత ఆస్తి, **దక్షిణం:** అంబటి సత్యనారాయణ మరియు ఇతరుల ఆస్తి, **పడమర:** విక్రేత నెం.ఆస్తి, **ఉత్తరం:**వాజిపెయాజులు శ్రీరామ చంద్రమూర్తి మరియు రంగినేని వెంకటేశ్వరరావు ఆస్తి. **ఐటి నెం.1 నుండి 4 వరకు 470.94 చ.గ.లు లేదా 393.77 చ.మీ.లు. బి) షెడ్యూల్ ఆస్తి: తూర్పు:** ఒపెన్ టు స్కై, **దక్షిణం:** ఒపెన్ టు స్కై, **పడమర:** ఉమ్మడి కారిడార్, మెట్లు మరియు లిఫ్ట్ **ఉత్తరం:** ఫ్లాట్ నెం.ఎస్ఎఫ్-3 ఆస్తి.

ప్రదేశం: విజయవాడ
తేది: 17-04-2025
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — గవర్నర్‌పేట బ్రాంచి-01451

డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ-520002.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: శ్రీ వేమూరు వెంకటేశ్వర్లు, తండ్రి: విశ్వేశ్వరరావు, నెం.29-28-5, దాసరి వారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520002.
విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి (01451) వారికి శ్రీ వేమూరు వెంకటేశ్వర్లు కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 15-10-2024** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.
పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 19-12-2024** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.
ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి (01451)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఈ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.
మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.
విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఈ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.
ఈ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.15-10-2024** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి
తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు ఇక్కడ వివరించబడ్డాయి:
ఆంధ్రప్రదేశ్-521108, విజయవాడ, విజయవాడ రూరల్, ప్రసాదంపాడు, ఆర్.ఎస్.నెం.57/7, బేరింగ్ అసెస్మెంట్ నెం.479, డి.నెం.5-84, రాజ గోపాల్ టవర్స్ గ్రూప్ హౌస్‌లో మొత్తం విస్తీర్ణం 484.00 చ.గ.లలో 32.00 చ.గ.ల అవిభక్త వాటా గల భూమి మొదటి అంతస్తులో 935 చ.అ.ల ఫ్లాట్ నెం-ఎఫ్.ఎఫ్-3 శ్రీ వేమూరు వెంకటేశ్వర్లు, తండ్రి: విశ్వేశ్వరరావు గార్ల పేరు మీద ఉంది. అపార్ట్‌మెంట్ హద్దులు: **ఉత్తరం:** శూన్యాకాశము, **దక్షిణం:** శూన్యాకాశము, **తూర్పు:** శూన్యాకాశము, **పడమర:** కామన్ కారిడార్.

తేది: 16-04-2025
ప్రదేశము: విజయవాడ
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వక్ఫ్ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు కుట్ర

- ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ సుభాన్
- పలు జిల్లాల్లో శాంతియుత ర్యాలీలు

సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ సుభాన్

ప్రజాశక్తి - యంత్రాంగం

వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ ముస్లిము ఐక్యవేదిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో శాంతియుత ర్యాలీలు చేపట్టారు. అల్ప సంఖ్యాక వర్గాల రక్షణ, రాజ్యాంగ హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని పలువురు మండిపడ్డారు. నరేంద్రమోడీ ఈ బిల్లును ఉపసం హరించుకునేంత వరకూ దేశవ్యాప్తంగా ఉద్యమా లు కొనసాగుతూనే ఉంటాయని హెచ్చ రించారు. తహశీల్దార్, ఆర్‌డిఒలకు వినతిపత్రాలు అంద జేశారు. 'వక్ఫ్ బోర్డు సవరణ చట్టం-రాజ్యాంగ బద్ధత సవాళ్లు' అనే అంశంపై కడపలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ... ధార్మిక బోర్డులలో పరమతస్తులను నియమించే నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ముస్లిముల ధార్మిక సంస్థల ఆస్తుల రక్షణకు జస్టిస్ సచార్ కమిటీ అనేక ప్రతిపాదనలు చేసిందని, అందులోని ఏ ఒక్కటి కేంద్రం అమలు చేయలేదని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఎం, సిపిఐ, ఆర్‌పిఐ, సిపిఐ (ఎంఎల్), కాంగ్రెస్, వైసిపి, ముస్లిము సంస్థల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముస్లిముల మనోభావాలకు వ్యతిరేకంగా ఒక పథకం ప్రకారం మైనార్టీలకు కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని, అందుకు నిదర్శనమే బడా కార్పొరేట్ కంపెనీలకు వక్ఫ్‌బోర్డు ఆస్తులను అప్పజెప్పడానికి వక్ఫ్‌బోర్డ్ కమిటీలోకి ముస్లిమేతరులను తీసుకొచ్చే విధానాన్ని చేస్తోందని పలువురు విమర్శించారు. నరేంద్రమోడీ ఈ బిల్లును ఉపసంహరించుకు నేంత వరకూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. కర్నూలులో ముస్లిము జెఎసి, ఆవాజ్ ఆధ్వర్యంలో అలీషేర్ బాగ్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. నంద్యాల జిల్లా ఆత్మకూరులో జెఎసి ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం పట్టణంలో చేపట్టిన శాంతియుత ర్యాలీనుద్దేశించి ముస్లిము మత పెద్ద మౌలానా మహమ్మద్ హిదయతుల్లా మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టం భారత ప్రజలను మతపరంగా విభజించే కుట్రలో భాగమన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లలో వినతి పత్రాలు అందజేశారు. ఏలూరు జిల్లా నిడమర్రులో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో జామియా మసీదు నుంచి ప్రారంభమై శ్రీకన్య కూడలి వరకు సాగింది. అనంతరం అక్కడే మానవహారం నిర్వహించారు. ఆర్‌డిఒ వి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు.

అంబేద్కర్ దృశ్య రూపక ప్రదర్శన ప్రారంభ సభలో మాట్లాడుతున్న రామన్న

బిజెపి నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

- రాష్ట్రవ్యాప్త అంబేద్కర్ దృశ్య రూపక ప్రదర్శనలు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- మంత్రాలయం (కర్నూలు)

అంబేద్కర్ అనేది పేరు, నినాదం కాదని ప్రతి ఒక్కరి గుండె చప్పుడు కావాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కౌలన్న, విద్యుత్ శాఖ డిఇఇ అంజినయ్య అన్నారు. కర్నూలు జిల్లా పెద్దకడబూరులో ఈస్టర్ పండుగను పురస్కరించుకుని డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ, అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో సామాజిక చైతన్య - సాంస్కృతిక ఉత్సవ నాటిక ప్రదర్శన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి మే 17వరకు రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ దృశ్య రూపక ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు. అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని, ఆయన ఆశయ సాధన కోసం పాటుపడాలని కోరారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపిఎస్‌సి సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ఇ. తిక్కన్న, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దేవదాసు, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె. విల్సన్, జె. రాజు, డివైఎఫ్ఐ నాయకులు అశీర్వాదం, ఆదాము, శంకర్, బాలు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టిఎంసి నాయకులకు ఢిల్లీ కోర్టు సమన్లు

న్యూఢిల్లీ : గతేడాది ఏప్రిల్‌లో భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) కార్యాలయం ముందు ఆందోళనల కేసులో టిఎంసి నాయకులు డెరెక్ ఓ'బ్రెయిన్, సాగరిక ఘోష్, సాకేత్ గోఖలే, పార్టీ ఇతర కార్యకర్తలకు ఢిల్లీలోని కోర్టు సోమవారం సమన్లు జారీ చేసింది. ఈ నెల 30న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ నేహా మిట్టల్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. సమన్లు జారీ అయిన వారిలో శాంతాను సేన్, డోలా సేన్, నడిముల్ హక్, వివేక్ గుప్తా, అర్పితా ఘోష్, అబిర్ రంజన్ బిశ్వాస్, సుదీప్ రాహా వంటి మరికొంత మంది టిఎంసి నాయకులు కూడా ఉన్నారు. 2024 ఏప్రిల్ 8న ఈ టిఎంసి నాయకులంతా ఇసిఐ మెయిన్ గేట్ ముందు ఆందోళన చేశారు. కేంద్ర సంస్థలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అవసరమైన అనుమతి లేకుండా, సెక్షన్ 144 అమల్లో ఉన్నప్పటికీ ప్లకార్డులు, బ్యానర్లతో ఆందోళన చేశారని టిఎంసి నాయకులపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఢిల్లీ కోర్టులో ఛార్జిషీట్ కూడా దాఖలు చేశారు. ఛార్జిషీట్‌ను పరిశీలించిన జడ్జి నిందితులకు విచారణా ధి కారి ద్వారా సమన్లు జారీ చేశారు.

అక్రమ నిర్మాణం.. అడ్డుకట్ట వేయరేం..!

- అనంత నగరంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ఎమ్మెల్యే ఆదేశిస్తున్నా చర్యలు శూన్యం
- టౌన్ ప్లానింగ్ అధికారుల వింత ధోరణి

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలో అక్రమ నిర్మాణాలను నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలను అమలు చేయడంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల నుంచి నిర్లక్ష్యం కొనసాగుతున్నట్లు క్షేత్రస్థాయిలో కన్పిస్తోంది. టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా నగరంలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు నిర్మితం అవుతున్నాయి. టౌన్‌ప్లానింగ్‌లో ఓ వైపు సిబ్బంది కొరత, మరోవైపు ఉన్నవారికి బాధ్యతలు అప్పగించకుండా విభాగాధిపతి, మరో ఉన్నతాధికారి ద్వంద్వ వైఖరి అవలంభిస్తుండడంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడం కష్టతరం అవుతోందనే చర్చ ఉద్యోగ వర్గాల్లో విన్పిస్తోంది.

టౌన్‌ప్లానింగ్‌లో సిబ్బంది కొరత..!

కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో 16 మందికిపైగా సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారిలో ఒకరు ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఆ అధికారి డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 15వ తేదీతో డిప్యూటేషన్ కాల పరిమితి ముగిసింది. కొన్ని రోజులుగా ఆ ఉద్యోగిని సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మంజుల మాత్రమే విభాగం అంతటికీ ఫీల్డ్‌వర్క్ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పాతూరు ప్రాంతాన్ని టిపిఎస్ మంజుల పర్యవేక్షిస్తుండగా, మిగతా ప్రాంతమంతా టిపిఎస్ దుర్గాంజలి పర్యవేక్షిస్తున్నారు. దుర్గాంజలి డిప్యూటేషన్ గడువు ముగియటం తోడు ఆమె వ్యక్తిగత కారణాలతో సెలవులపై వెళ్లనున్నారు. ఈ క్రమంలో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ శిరీష ఎక్కువగా కార్యాలయానికే పరిమితమవుతున్నారు. అనారోగ్య సమస్యలతో ఫీల్డ్‌వర్క్‌కు వెళ్లలేకపోతున్నట్లు ఆమె కూడా ఉన్నతాధికారులకు చెబుతున్నారు.

నిర్మాణాల్లో నిబంధనలకు పాతర

నగరంలో జరుగుతున్న పలు భవన నిర్మాణాలను పరిశీలిస్తే నిబంధనలు ఏమాత్రం పాటించనట్లు తెలుస్తోంది. భవన నిర్మాణాల ద్వారా లభించాల్సిన ఆదాయం భారీగా గండిపడుతున్నా అధికారులెవరూ దీనిపై దృష్టి సారించడం లేదు. సెలవులపై వెళ్లినవారు భవన నిర్మాణ అనుమతులు జారీ చేయడానికి వక్రమార్గాల అవలంభిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వాటిని కట్టడి చేయకపోవడం చూస్తే అందులో ఉన్నతాధికారుల పాత్ర లేకుండా జరగదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రెండు రోజుల క్రితం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ నగరంలోని అనధికార నిర్మాణాలను నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ బాలస్వామి, ఇన్‌ఛార్జి ఎసిపి టిపిఒ శిరీషకు ఆదేశాలు జారీ చేశారు. ఈ అంశంపై టిపిఒ శిరీష మాట్లాడుతూ అర్బన్ ఎమ్మెల్యే కోరినట్లుగా అక్రమ కట్టడాల జాబితా తయారు చేసి అందజేస్తామని తెలిపారు.

నగరంలో సగభాగానికి పర్యవేక్షణాధికారులు లేకున్నా వాటిని భర్తీ చేసే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిచ్చేదిగా ఉంది. పాలనాపరమైన సమస్యలు పరిష్కరించి అధికార యంత్రాంగాన్ని ముందుకు నడిపించాల్సిన అధికారులే వాటిని నీరు కార్చే విధంగా వ్యవహరిస్తున్నారనే చర్చ సాగుతోంది. దీనికి తోడు మారిన టౌన్ ప్లానింగ్ నిబంధనలతో భవన ప్లాన్లను వేసే ఎల్‌టిపిలు, బిల్డర్లు ప్లాన్ల అనుమతి పొందడంలో నిర్మాణ లోపాలు, డివియేషన్ తదితర అంశాలకు సంబంధించి తామే బాధ్యత వహిస్తామని, ప్రభుత్వం చేపట్టే క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతామని అఫిడవిట్ అందించాల్సి ఉంది. ఈ నిబంధనతో గడచిన రెండు నెలలుగా ఎల్‌టిపిలు, బిల్డర్లు ప్లాన్లను సమర్పించడానికి ముందుకు రాని పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇలా అన్ని విధాలాలుగా భవన నిర్మాణాల్లో జరుగుతున్న లొసుగులు కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చకపోగ, అక్రమాలకు తావిస్తోందనే విమర్శలు ఉన్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్‌ను చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందనే భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

మోసాల కేసుల్లో బాధితులకు రూ. 15 వేల కోట్లు చెల్లించనున్న ఇడి

న్యూఢిల్లీ : రియల్ ఎస్టేట్, పోంజీ, ఇతర మోసాల కేసులో బాధితులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 15 వేల కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తిరిగి చెల్లించనుంది.

ఈ విషయాన్ని ఇడి అధికారులు సోమవారం వెల్లడించారు. ఆర్థిక నేరాల ద్వారా మోసపోయిన చట్టబద్ధమైన యజమానులు, హక్కుదారులు తమ ఆస్తులను తిరిగి పొందేవిధంగా గత ఏడాది నుంచి ఇడి చర్యలు తీసుకుంటోందనిఅధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటి వరకూ ఇడి తాను స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల నుంచి రూ.31,951 కోట్ల విలువైన ఆస్తులను తిరిగిచ్చింది. ఇందులో రూ.15,201.65 కోట్ల విలువైన ఆస్తులను 2019-21 మధ్యకాలంలో తిరిగిచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ)లోని సెక్షన్ 8(8) కింద ఆస్తులను తిరిగి బాధితులకు కేటాయిస్తున్నట్లు ఇడి అధికారులు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — అస్సెట్ రికవరీ బ్రాంచి (79170),

విజయవాడ, లొకేటెడ్: 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(Rule 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(2)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు: శ్రీ కోడూరి లక్ష్మణ్‌రావు,** తండ్రి: కె. వీరయ్య (దరఖాస్తుదారుడు) **& శ్రీ కోడూరి దిలీప్ కుమార్,** తండ్రి: కోడూరి లక్ష్మణ్‌రావు (సహ-దరఖాస్తుదారుడు) చిరునామా డి.నెం.8-104, ఫ్లాట్ నెం. జిఎఫ్-1, గ్రౌండ్ ఫ్లోర్, సాయి కృష్ణ రెసిడెన్సీ, జెడ్.పి హైస్కూల్ దగ్గర, నిడమానూరు గ్రామం, విజయవాడ రూరల్ మండలం, కృష్ణాజిల్లా-521104. వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.47,44,485.50** (అక్షరాలా నలభై ఏడు లక్షల నలభై నాలుగు వేల నాలుగు వందల ఎనభై ఐదు రూపాయల యాభై పైసలు మాత్రమే) + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేది. 13.09.2024**న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.
ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 ప్రకారము **తేదీ.17-04-2025**న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.
ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.47,44,485.50** (అక్షరాలా నలభై ఏడు లక్షల నలభై నాలుగు వేల నాలుగు వందల ఎనభై ఐదు రూపాయల యాభై పైసలు మాత్రమే) వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.
తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్(8) ప్రకారం కలిగియుండురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు
తనఖా ఉంచిన స్థిరాస్తి వివరములు క్రింద వివరించబడ్డాయి:
ప్రైమరీ/కొల్లేట్రల్ సెక్యూరిటీ: షెడ్యూల్-ఏ: ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పు, గుణదల రిజిస్ట్రార్స్ ఆఫీస్ పరిధిలో నిడమానూరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ ఏరియా, ఆర్.ఎస్.నెం.162/1, సమీప డోర్.నెం.8-104లో విస్తీర్ణం 242 చ.గ.లలో 30 చ.గ.ల అవిభక్త మరియు పేర్కొనబడని ఉమ్మడి హక్కు. **హద్దులు: తూర్పు:** ఇనంపూడి లవ్ కుమార్ మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **దక్షిణం:** జెడ్.పి హైస్కూల్ కు చెందిన ఆస్తి, **పడమర:** మొవ్వ భాగ్య సాయి ప్రసన్నలక్ష్మి గారి ఆస్తి, **ఉత్తరం:** 18 అడుగుల వెడల్పు రోడ్డు. **షెడ్యూల్-బి:** పైన పేర్కొన్న షెడ్యూల్-ఏ ఆస్తిలో నిర్మించిన సాయి కృష్ణ రెసిడెన్సీలో బాల్కనీలు, గ్రౌండ్ ఫ్లోర్ మరియు 50 చ.అ.ల కామన్ ఏరియా మరియు 85 చ.అ.ల పార్కింగ్ ప్రాంతంతో సహా 840 చ.అ.ల విస్తీర్ణంలో నీరు, డ్రైనేజీలు, మార్గాలు మొదలైన వాటిపై సాధారణ అవసరాలు గల ఫ్లాట్ నెం. జి.ఎఫ్-1కు **హద్దులు: తూర్పు:** ఇనంపూడి లవ్ కుమార్ మరియు ఇతరులకు చెందిన ఆస్తి మరియు ఈ ఫ్లాట్ యొక్క బాల్కనీ, **దక్షిణం:** జెడ్.పి హైస్కూల్ కు చెందిన ఆస్తి, **పడమర:** మొవ్వా భాగ్య సాయి ప్రసన్న లక్ష్మి గారి ఆస్తి, **ఉత్తరం:** సాధారణ ప్రాంత మెట్లు.

తేది: 17-04-2025
ప్రదేశము: విజయవాడ
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంక్ ఆఫ్ బరోడా

గుంటూరు మెయిన్ బ్రాంచి, రాజీవ్ గాంధీ భవన్, హిందు కాలేజ్ దగ్గర, గుంటూరు , ఏపి-522004.
ఫోన్: 8977513906, మెయిల్ ఐడి: guntur@bankofbaroda.com

ఈ వేలం ద్వారా వాహనం అమ్మకం
https://www.bankofbaroda.in/e-auction.htm

ఈ దిగువ తెలిపిన ఋణగ్రహీత బకాయి చెల్లింపు నందు విఫలమగుటచే బ్యాంక్ వారు ఋణగ్రహీతలచే అమలు చేయబడిన తనఖా ఒప్పందము క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ వారి వద్ద తనఖా ఉంచిన దిగువ తెలిపిన వాహనములను తిరిగి స్వాధీనత/జప్తు చేసికొని **"ఎక్కడ ఎలా ఉందో అలాగే" & "ఏది ఉందో అది అలాగే"** అను ప్రాతిపదికన వేలం ద్వారా విక్రయం జరుపుచున్నారు. మరియు వేలం నోటీసు నందు సవివరముగా చెప్పిన నియమములు & నిబంధనలకు లోబడి మాత్రమే అమ్మకం జరుపబడును.

క్ర.స	ఋణగ్రహీత / హామీదారు పేరు & చిరునామా	హైపోథికేటెడ్ చరాస్తులు / మెషినరీ తయారీ - మోడల్ మొ.లగు యొక్క నిల్వలు వివరాలు	ది. 25.01.2025 నాటికి బకాయి మొత్తం
1.	శ్రీ గుంజా వెంకటరావు, తండ్రి: గుంజా వెంకటేశ్వర్లు హెచ్.నెం.18-112/26, స్వర్ణ పిచ్చయ్య కాలనీ, పిడుగురాళ్ళ రూరల్, పిడుగురాళ్ళ, పల్నాడు జిల్లా, ఏపి-522413.	VEHICLE NO: AP 39 VD 1930 YEAR OF MFG : 2023 MAKE : EICHER (VE COMMERCIAL VEHICLES LTD) MODEL: PRO 3019 M SLP HSD22FT BS VI NGB BASE7S COLOR : NEW GOLDEN BROWN	రూ.26,46,570.54 + ది.25-01-2025 నుండి వడ్డీ మరియు ఏదైనా ఉంటే ఇతర ఛార్జీలు.

రిజర్వు ధర : రూ.21,06,000/- (అక్షరాల ఇరవై ఒక్క లక్షల ఆరు వేల రూపాయలు మాత్రమే)
ధరావత్తు : రూ.2,10,600/- (అక్షరాల రెండు లక్షల పది వేల ఆరు వందల రూపాయలు మాత్రమే)

వేలం జరుగు ప్రదేశం: బ్యాంక్ ఆఫ్ బరోడా, గుంటూరు మెయిన్ బ్రాంచి, గుంటూరు నందు, వేలం తేది: 07.05.2025, సమయం: మ. 2.00 గం॥ల నుండి సా.6.00 గం.ల వరకు. బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/-, ఆసక్తి గల కొనుగోలుదారులు / బిడ్డర్లు ఈ తనఖా ఉంచిన చరాస్తులను **తేది.02.05.2025** నుండి **07.05.2025** వరకు (ఈ తేదీ లోపు) **ఉదయం గం. 10.00 ల నుండి సాయంత్రం గం.4.00** ల వరకు తనిఖీ చేసుకొనవచ్చును. **ధరావత్తు మొత్తం: "బ్యాంక్ ఆఫ్ బరోడా" గుంటూరు మెయిన్ బ్రాంచి, గుంటూరు, ఖాతా నెం.05170015181869, IFSC Code: BARB0GUNTUR** (ఐదవ అక్షరం సున్నా) ద్వారా జమ చేయవచ్చును. పూర్తి వివరముల వేలం నోటీసు & టెండరు దరఖాస్తు బ్యాంక్ వారి యొక్క వెబ్‌సైట్ **www.bankofbaroda.co.in** మరియు బ్రాంచి కూడా అందుబాటులో ఉంది మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్ **https://www.bankofbaroda.in/e-auction.htm** మరియు ఆన్‌లైన్ ఆక్షన్ పోర్టల్ **https://baanknet.com** నందు అప్‌లోడ్ చేయబడినది. మరియు బ్రాంచి నందు కూడా లభించును. కావున దయచేసి గమనించగలరు. ఇతర ఏమైనా సమాచారము కొరకు బ్రాంచి సెల్: 8977513906 నందు సంప్రదించగలరు. సందేహాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెం.8291220220 మరియు మెయిల్ ఐడి: support.BAANKNET@psballiance.com. **గమనిక:** గోడౌన్ అద్దెను విజయవంతమైన బిడ్డరు చెల్లించవలెను.

తేది: 17-04-2025
ప్రదేశము: గుంటూరు
అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref: B1/40/2025 — **ఫారం నెం.VI (ఎ)** — ది.21-04-2025

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19), సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాధమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన కాకినాడ జిల్లా, తొండంగి మండలం, బెండపూడి గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎడమ కాలువ ఏర్పాటు చేయు నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనల ననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, స్పెషల్ డిప్యూటీ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ, యూనిట్-1, రాజమహేంద్రవరం వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలక్టరు /ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: కాకినాడ — మండలం: తొండంగి — గ్రామం: బెండపూడి

క్రమ సంఖ్య	సర్వే నెం./ స.డి.నెం.	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య.సెం.	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెంట్లు	పట్టాదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు/కట్టడములు వగైరా వివరములు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	66-3C1A	నంజ	0.08	0.02	పాలచర్ల వీర గణపతి (తండ్రి) వెంకటరావు	201	66-3C1B	66-4A	66-3C2	ఖాళీ స్థలము
2	202-3A2	నంజ	4.75	0.03	పాలచర్ల వీర రాఘవులు (తండ్రి) తిరుపతిరావు	202-3A1	202-2	202-3A1	202-3B	కొబ్బరి-2
3	222-2B1	నంజ	1.16	0.035	బిక్కిన ఫకీర్ (సుబ్బారావు) (తండ్రి) సత్యం	222-1A	222-2B2	269	222-2B3	కొబ్బరి-2 కూలిపోయిన ఇంటి గోడ
4	222-2B2	నంజ	1.16	0.085	బిక్కిన అప్పారావు (తండ్రి) సత్యం	222-2B1	224	269	222-2B3	కొబ్బరి-12 అరటి తోట
5	224-2A	పుంజ	1.89	0.02	పాలచర్ల వీరరాఘవులు (భర్త) తిరుపతిరావు పాలచర్ల వీరభద్ర ప్రసాద్ (తండ్రి) తిరుపతిరావు	222	224-2C	269	224-2C	రైస్ మిల్లు కాంపౌండ్ గోడ మరియు ఇనుప గేటు
6	271-1A	పుంజ	6.40	0.11	కొంగర విశాలాక్షి (భర్త) వెంకట సత్యప్రసాద్	269	271-1C	271-B	269, 271-1C	రైస్ మిల్ మరియు కాంపౌండ్ గోడ
7	271-1B	పుంజ	6.40	0.10	కాళిన కోమలి సునీత (భర్త) కె.పి.ఆర్.జి. మల్లేశ్వరరావు, చింతలపూడి సత్యా అన్నపూర్ణ దేవి (భర్త) వెంకటేశ్వరరావు	270	271-1C	271-1C	269, 271-1A	ఆర్.సి.సి. షెడ్
మొత్తం:			21.84	0.40						

సం/- **శ్రీమతి ఎస్.సరళ వందనం,** స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

బంగారం @ లక్ష..!

న్యూఢిల్లీ : బంగారం ధర భగ్గుమంటోంది. పేదల ఆలోచనకు అందకుండా.. మధ్యతరగతి ప్రజలు కొనలేని స్థాయికి చేరింది. సోమవారం 10 గ్రాముల బంగారం ధర దాదాపు రూ.1 లక్ష చేరువలో నమోదయ్యింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రతరం కావడానికి తోడు డాలర్ బలహీన పడడంతో పసిడికి డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల (99 శాతం) స్వచ్ఛత కలిగిన 10 గ్రాములపై రూ.1650 ఎగిసి రూ.99,800కు చేరిందని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. శుక్రవారం నాడు స్వర్ణం ధర రూ.98,150 వద్ద ముగిసింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పసిడిపై రూ.1600 పెరిగి రూ.99,300గా పలికింది. బంగారంపై మూడు శాతం వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) అమల్లో ఉంది. పన్నులు కలుపుకుంటే లక్షపైనా చెల్లించాల్సి ఉంటుంది. గుడ్ రిటర్న్స్ ప్రకారం.. కిలో వెండిపై రూ.1000 పెరిగి రూ.1,01,000గా నమోదయ్యింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు పసిడి 3,397 డాలర్లకు చేరింది. 2025లో ఇప్పటి వరకు 10 గ్రాముల బంగారంపై ధర రూ.20,850 పెరిగింది. గతేడాది డిసెంబర్ 31న సుమారు రూ.79,000 వద్ద నమోదయిన అపరంజి.. గడిచిన మూడున్నర నెలల్లో 26.41 శాతం మేర పెరిగి సామాన్యులకు అందుబాటులోకి లేకుండా పోవడంతో కొనుగోలుదారుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)

బొబ్బిలి పోలీసు స్టేషన్లో 2024లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం కింతలాంబ గ్రామానికి చెందిన కిల్లక మోహనరావు (29)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి పదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన 16 ఏళ్ల బాలిక పార్వతీపురం పట్టణంలో ఏకలవ్య స్కూల్లో చదువుతోంది. ఆమె అవసరాల కోసం తన మామయ్యను రూ.3 వేలు కావాలని అడుగ్గా తన మామయ్య ఫోన్ ఫే ద్వారా బొబ్బిలిలో ఉంటున్న నిందితుడు మోహనరావుకు పంపాడు. ఆ డబ్బులు తీసుకొనేందుకు ఆమె పార్వతీపురం నుండి బొబ్బిలికి వచ్చి, పట్టణంలో ఉంటున్న తన మామయ్య స్నేహితుడు కిల్లక మోహనరావు వద్దకు వెళ్లగా, డబ్బులు ఇస్తానని చెప్పి ఆమెను తన రూమ్‌కు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని తన మామయ్యతో చెప్పగా వెంటనే 112 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయగా పార్వతీపురం పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బొబ్బిలి పోలీసులు కేసు విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలి కుటుంబానికి రూ.5 లక్షల నష్ట పరిహారం మంజూరు చేయాలని అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు.

భాషా పోరాటమే కాదు.. జాతి పోరాటం కూడా

- ఉదయనిధి

చెన్నై : త్రిభాషా విద్యావిధానం పేరుతో హిందీని బలవంతంగా రుద్దుతున్న కేంద్రప్రభుత్వంపై తమ పోరాటం భాషా పోరాటమే కాదని, తమిళ సంస్కృతిని రక్షించేందుకు చేస్తున్న జాతి పోరాటమని తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యానించారు. సోమవారం నందనం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి పేరిట రూ.4.80 కోట్లతో కొత్తగా నిర్మించిన ఆడిటోరియం ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. 'పెరియార్, గ్రాండ్‌మాస్టర్ అన్నా, కలైంజర్ కరుణానిధి, ఇప్పటి మన ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సహా హిందీకి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు' అని అన్నారు. 1986లో హిందీకి వ్యతిరేకంగా కరుణానిధి చేసిన ప్రసంగం ఇప్పటికీ సముచితంగానే ఉంటుందని ఆయన గుర్తుచేశారు. 1956లో హిందీ వ్యతిరేకంగా విద్యార్థుల చేసిన నిరసనలే తమిళ సంస్కృతిని కాపాడాయి. నీట్, ఎన్ఇపి, త్రిభాషా విధానాలకు సంబంధించి వాటి వెనుక ఉన్న వ్యూహాలను విద్యార్థులు అర్థం చేసుకోవాలని' ఉదయనిధి కోరారు.

చెలామణిలో నకిలీ నోట్లు

- నోట్ల రద్దు సమయంలో ఇలాంటి నోట్లు కనబడవన్న మోడీ సర్కార్
- గుజరాత్ నుంచే అత్యధికంగా ఫేక్‌నోట్ల ముద్రణ

దేశంలో నకిలీ కరెన్సీ మళ్లీ కలకలం సృష్టిస్తున్నది. ఆనాడు ఆదరాబాదరాగా చేసిన నోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రతిపక్షాలు, ప్రజలు తప్పుబట్టినా మోడీ సర్కార్ వినలేదు. పైగా ఎన్నో జాగ్రత్తలు తీసుకుని పెద్దనోట్లను తెస్తున్నామని, ఇది బ్లాక్‌మనీని, నకిలీ కరెన్సీని అరికడుతుందని ప్రకటించింది. ఇపుడు రూ.500 నోట్లు నకిలీవి వస్తున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కేంద్రహోంశాఖ హెచ్చరిక చేస్తోంది. అంటే నకిలీ కరెన్సీని అడ్డుకోలేని కేంద్రంలోని బిజెపి సర్కారు ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా వ్యవహరిస్తోందని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



న్యూఢిల్లీ : దేశంలో నకిలీ నగదు చెలామణిలో ఉన్నదన్న విషయం ఆందోళన కలిగిస్తున్నది. ముఖ్యంగా, గుజరాత్‌లో ఇలాంటి ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. నవంబర్ 8, 2016న కేంద్రంలోని మోడీ సర్కారు పెద్ద నోట్ల రద్దును అమలు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎటిఎంల ముందు క్యూలైన్లలో నిలబడి జనం ప్రాణాలు సైతం కోల్పోయారు.

పెద్ద నోట్ల రద్దుపై మోడీ తన టెలివిజన్ ప్రసంగంలో ప్రకటన చేశారు. "అవినీతి, నల్లధనం, నకిలీ నోట్లు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంలో, మన దేశాన్ని శుద్ధి చేసే ఈ ఉద్యమంలో, మన ప్రజలు కొన్ని రోజులు కష్టాలను భరించలేరా? ప్రతి పౌరుడూ నిలబడి ఈ 'మహాయజ్ఞం'లో పాల్గొంటారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని అన్నారు. ఆయన చెప్పినట్టుగా అవినీతి కానీ, నల్లధనం కానీ అంతం కాలేదన్నది అనుభవం చెబుతున్న సత్యం. ఒకవేళ కేంద్రం చెప్పినట్టుగానే జరిగి ఉంటే.. వీటిపై స్పష్టమైన గణాంకాలను విడుదల చేసి ఉండేదని విశ్లేషకులు అంటున్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించని కారణంగానే బిజెపి సర్కారు అలాంటి సాహసం చేయలేదని చెప్తున్నారు. నల్లధనానికి పెద్దనోట్లు కీలకంగా మారాయని చెప్పిన మోడీ సర్కారు.. నోట్ల రద్దు తర్వాత రూ.2 వేలు నోటును తీసుకురావటానికి గల కారణాన్ని వారు ప్రశ్నించారు. ఇంతలో 'పెద్దోళ్ల లెక్కలు తేలాయోమో?' అని వారు అనుమానాలను వ్యక్తం చేశారు.

డీమానిటైజేషన్ తర్వాత లెక్కకు రాని సంపదను మోడీ సర్కారు తొలగిస్తుందని అంతా భావించారు. కానీ, మోడీ సర్కారు అలా చేయలేదు. 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లెక్కల్లో లేని సంపద పెద్ద ఎత్తున డిపాజిట్ కాలేదని చెప్పారు. ఆ తర్వాత ఏడాది..రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కూడా ఇదే విషయాన్ని చెప్పింది. దాదాపు 99.3 శాతం రద్దు చేయబడిన కరెన్సీ బ్యాంకులకు తిరిగి వచ్చిందని వివరించింది. అంటే... అవినీతి, నల్లధనం అంతం అంటూ మోడీ చెప్పినా.. అవి వాస్తవరూపం దాల్చలేదన్నది అందరికీ తెలిసిందే.

ఏటికేడూ పెరిగిన ఫేక్ కరెన్సీ జప్తు

2016లో రూ.15.92 కోట్ల విలువైన నకిలీ కరెన్సీ జప్తు జరిగింది. తర్వాతి సంవత్సరాల్లో ఇవి గణనీయంగా పెరిగాయి. వీటి విలువ 2017లో రూ.28.10 కోట్లు, 2018లో రూ.17.95 కోట్లు, 2019లో రూ.25.39 కోట్లు, 2020లో రూ.92.17 కోట్లు, 2021లో రూ.20.39 కోట్లుగా నమోదయింది. 2021 తరువాత సంవత్సరాల గణాంకాల ప్రకారం వరుసగా రూ. 28.10 కోట్లు, రూ. 17.95 కోట్లు, రూ. 25.39 కోట్లు, రూ. 92.17 కోట్లు, రూ. 20.39 కోట్లుగా ఉంది. వాస్తవానికి.. 2015లో నోట్ల రద్దుకు ముందు రూ.15.48 కోట్ల నకిలీ కరెన్సీ మాత్రమే స్వాధీనం కావటం గమనార్హం.

ఆందోళన కలిగిస్తున్న నకిలీ నోట్లు

నిజానికి పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశంలో నకిలీ నోట్ల కలకలం పెరిగింది. మరీ ముఖ్యంగా.. దాదాపు ఆరేడేళ్ల తర్వాత.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నకిలీ రూ.500 నోటు చెలామణీ పెరుగుదలను చూసింది. 14.4 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఆర్‌బిఐ ఈ సమాచారాన్ని వెల్లడించింది. ఆర్‌బిఐ వార్షిక నివేదిక ప్రకారం.. బ్యాంకింగ్ వ్యవస్థలో 91,110 నకిలీ రూ.500 నోట్లు వచ్చి చేరాయి. అంటే, వాటి విలువ రూ.4.55 కోట్లు అన్నమాట. ఇది గత సంవత్సరం గణాంకాల కంటే పెరుగుదలను నమోదు చేయటం గమనార్హం. గతేడాది మొత్తం రూ. 3.98 కోట్లు విలువ ఉన్న 79,669 నకిలీ నోట్లు కనుగొనబడ్డాయి.

ఆ రూ.500 నోట్లతో జాగ్రత్త..

కేంద్ర హోం శాఖ హెచ్చరికలు

అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారుచేసిన రూ.500 దొంగనోట్లు చెలామణీలోకి వచ్చినట్టు కేంద్ర హోంశాఖ తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని వివరించింది. ఈ సమాచారాన్ని డిఆర్ఐ, ఎఫ్ఐయు, సిబిఐ, ఎన్ఐఎ, సెబీతో కూడా పంచుకున్నది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలావరకు అసలు నోట్లలాగే ఉన్నట్టు వెల్లడించింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వివరించింది. ఈ నోట్లలో ఒక చిన్న స్పెల్లింగ్ తప్పు ఉన్నదని పేర్కొన్నది. దీనిని గుర్తించడంలో అదే కీలకమని వివరించింది. 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'లో 'ఇ'కి బదులు 'ఎ' పడినట్టు పేర్కొన్నది. ఈ చిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరీక్షించాల్సి ఉంటుందని వివరించింది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చరించారు.

ముంచేస్తున్న నాసిరకం మొక్కలు!

- అనుమతుల్లేని నర్సరీలు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి -గంగవరం

చిత్తూరు జిల్లా గంగవరం మండల పరిధిలో అనుమతులు లేని నర్సరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కర్ణాటకలోని మంచి బ్రాండెడ్ విత్తనాల పేరుతో నాసిరకం మొక్కలు విక్రయిస్తూ రైతులను నిలువునా ముంచేస్తున్నాయి. కనీసం లైసెన్సులు కూడా లేని నర్సరీలు మాయమాటలతో నాసిరకం మొక్కలు రైతులకు అంటగట్టి వేల రూపాయల నష్టం కలిగించి రైతుల జీవితాలను అంధకారం చేస్తున్నాయి. నాసిరకం నర్సరీలపై నిఘా వుంచాల్సిన సంబంధిత శాఖ అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంచేస్తున్న నాసిరకం మొక్కలు

గంగవరం పరిదిలోని పుంగనూరు - పలమనేరు రహదారిలో ఒక కిలోమీటరు దూరంలోనే పది నర్సరీలు, ఏడు కిలోమీటర్ల పరిధిలో సుమారు 15 నర్సరీలు వున్నాయి. ఈ నర్సరీలలో గోసు, వంకాయ, మిరప, కాలీఫ్లవర్, బొప్పాయి, టమాటా మొక్కలు విక్రయిస్తున్నారు. వీటిని నర్సరీ నిర్వాహకులు కర్ణాటక నుంచి మంచి బ్రాండెడ్ విత్తనాలు తెచ్చి మొక్కలు పెంచి ఇస్తున్నామని నమ్మించి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. కూరగాయల పంటలు పండించడానికి గతంలో రైతులు తమంతట తాము విత్తనాలతో నార్లు పోసుకొని పక్వానికి వచ్చిన తర్వాత పొలాల్లో రకరకాల కూరగాయల పంటలు పండించేవారు.

ప్రస్తుతం ఊరుకో నర్సరీ కావడంతో నర్సరీ నిర్వాహకులు నాసిరకం విత్తనాల తెచ్చి ఆ విత్తనాలకు రకరకాల పేర్లతో మొక్కలు తయారుచేసి రైతులకు విక్రయిస్తున్నారు. వీరికి ఎలాంటి అనుమతులు లేవు. లక్షల రూపాయలు ఆదాయం ఆర్జిస్తున్నా ప్రభుత్వానికి ఎలాంటి రుసుం చెల్లించడంలేదని ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని రైతులువాపోతున్నారు.

యథేచ్ఛగా అనుమతుల్లేని నర్సరీలు

గంగవరం మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లో సుమారు 15 నర్సరీలు వున్నాయి. కర్ణాటక నుంచి తీసుకొచ్చిన మంచి బ్రాండెడ్ విత్తనాలతో పెంచిన మొక్కలు విక్రయిస్తున్నామని నమ్మిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ నర్సరీలకు లైసెన్సులు కూడా లేవని, గత ప్రభుత్వంలో లైసెన్సులు తీసుకోవాలని హెచ్చరించినా ఖాతరు చేయలేదని రైతులు వాపోతున్నారు. వీటిపై సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు వేల రూపాయల నష్టం

రైతులు ఒక్కో మొక్క రూపాయి నుండి ఐదు రూపాయల వరకు పెట్టుబడి పెట్టి పొలాల్లో నాటిన తర్వాత వంద మొక్కలకు కనీసం 40 శాతం వరకు చనిపోతున్నాయని, మళ్లీ వాటి స్థానంలో మొక్కలు నాటినా పంట ఒక్కసారిగా రాకపోగా కొన్ని మొక్కలు పూత దశలో కొంత భాగం, పంట పూర్తి దశలో మరి కొంత భాగం కోల్పోయి రకరకాలుగా వేల రూపాయల్లో తీవ్ర నష్టం ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం నర్సరీలలో టమాటా, మిరప, వంకాయ, క్యాలీఫ్లవర్, గోసు, బొప్పాయి, తదితర కూరగాయల మొక్కలు పెంచి విక్రయిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. ఈ నాసిరకం మొక్కలు నాటి కష్టాలు పాలు కావాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

40 శాతం మొక్కలు చనిపోయాయి

నేను రెండు ఎకరాలలో కాలీఫ్లవర్ నాటాను. అందులో 40 శాతం మొక్కలు చని పోయాయి. ఆ ప్రాంతం అంతా పిచ్చి మొక్కలతో అల్లుకుపోయింది. ఈ విషయాన్ని నర్సరీ వారిని అడిగితే మీరు వాటికి సక్రమంగా నీరు అందిం చడం లేదు.. ఎక్కువగా క్రిమి సంహారక మందులు వాడడంతోనే అలా అయిందని బెదిరిస్తున్నారు.. అయితే నాసిరకం విత్తనాలతోనే ఈ సమస్య వచ్చింది..

- వెంకటరమణ, రైతు

అమ్మో..! వందే భారత్

- పశువులను ఢీకొన్నా 'తీవ్ర ప్రమాదాలు'
- భద్రతా చర్యలు అవసరం
- ఆర్‌పిఎఫ్ సిబ్బందిని మోహరించాలి
- లోకోపైలట్లపై నిరంతర ఒత్తిడి
- రైల్వే సేఫ్టీ కమిషన్ నివేదిక

న్యూఢిల్లీ : భారతీయ రైల్వేలో సమూల మార్పులను తీసుకొస్తున్నామని కేంద్రంలోని మోడీ సర్కారు గొప్పలు చెప్పుకుంటున్నది. ఇందులో భాగంగా భారత్‌లోని మొట్టమొదటి సెమీ-హై-స్పీడ్ 'వందే భారత్' రైలుకు తీవ్ర ప్రచారాన్ని కల్పించింది. అది తమ ప్రభుత్వ ఘనతగా చెప్పుకున్నది. అయితే, 'వందే భారత్' భద్రతా ప్రమాణాలు మాత్రం ఆందోళనను కలిగిస్తున్నాయి. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ పశువులను ఢీకొన్న సందర్భాలలో కూడా తీవ్రమైన ప్రమాదాలకు గురవుతుందని రైల్వే భద్రతపై ఒక నివేదిక పేర్కొన్నది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, రైల్వే సేఫ్టీ కమిషన్ ఈ నివేదికను రూపొందించింది.

'దృఢమైన కంచెను ఏర్పాటు చేయాలి'

ఈ నివేదిక ప్రకారం.. వందే భారత్ రైళ్లలోని ప్రముఖ కోచ్ లోకోమోటివ్.. సాధారణ రైళ్ల కంటే చాలా తేలికైనది. ఏదైనా అడ్డంకిని ఢీకొనటం లేదా పశువులు కూడా ఢీకొంటే అధిక వేగంతో తీవ్రమైన ప్రమాదానికి దారితీయవచ్చు. హై-స్పీడ్ రైళ్ల నిర్వహణకు సంబంధించి రైల్వేలు తీసుకోవలసిన భద్రతా చర్యలను నివేదిక వివరించింది. రైళ్లకు ముప్పును కలిగించే మానవులు, పశువులను నిరోధించడానికి దృఢమైన కంచెను ఏర్పాటు చేయాలని సూచించింది. 160 కి.మీ. వేగంతో రైళ్లు నడిచే మార్గాల్లో లెవల్ క్రాసింగ్ గేట్లను తొలగించాలని పేర్కొన్నది.

'ఆర్‌పిఎఫ్ సిబ్బందిని నియమించండి'

భారతీయ రైల్వే.. క్రమం తప్పకుండా అతిక్రమించే ప్రదేశాలు, పశువుల ప్రవేశ ప్రదేశాలను గుర్తించాలని నివేదిక సూచించింది. రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్) సిబ్బందిని మోహరించడం, క్రమం తప్పకుండా పెట్రోలింగ్ చేయడం, రైతులు తమ పశువులతో దాటడానికి వీలుగా సబ్‌వేను అందించడం వంటి తగిన యంత్రాంగాన్ని రూపొందించాలని వివరించింది. భారతదేశపు మొట్టమొదటి సెమీ-హై-స్పీడ్ రైళ్లు అయిన వందే భారత్ రేక్‌లను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలలోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ, మోడరన్ కోచ్ ఫ్యాక్టరీ, రాయ్‌బరేలిలలో తయారు చేస్తున్నారు. గతేడాది డిసెంబర్ 26 నాటికి రైల్వే నెట్‌వర్క్‌లో మొత్తం 136 వందే భారత్ రైలు సేవలు నడుస్తున్నాయి.

అధిక వేగంతో పశువులను ఢీకొంటే తీవ్రమైన ప్రమాదాలు సంభవించే అవకాశమున్నదని భద్రతా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. రైల్వేలు అనేక మార్గాల్లో 160 కి.మీ. వేగంతో రైళ్లను నడపాలని యోచిస్తున్న సమయంలో ఈ హెచ్చరిక రావటం గమనార్హం. ఆర్పీఎఫ్, ఇతర శాఖ అధికారులు సమయానికి ఉమ్మడి తనిఖీలు చేసి అతిక్రమణలను నిరోధించాలని నివేదిక పిలుపునిచ్చింది. రైల్వే ప్రాపర్టీని ఆనుకుని ఉన్న భూనివాసితులు ట్రాక్ దాటడం ద్వారా కలిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రైళ్ల వేగాన్ని 130 నుంచి 160 కిలోమీటర్లకు పెంచుతున్నప్పుడు శాశ్వత, తాత్కాలిక వేగ పరిమితులు పెద్ద సంఖ్యలో ఉండటంతో లోకో పైలట్లకు నిరంతరం ఒత్తిడి కలుగుతున్నది. ఈ విషయంలో రైల్వే తగిన చర్యలు తీసుకోవాలని నివేదిక సూచించింది.

ఎసిబి పేరిట అధికారులకు బెదిరింపు కాల్స్

- ఉద్యోగుల నుంచి రూ.75 వేలు వసూలు

ప్రజాశక్తి- డెంకాడ (విజయనగరం జిల్లా)

ప్రభుత్వ అధికారులే లక్ష్యంగా కొంతమంది ఎసిబి అధికారులపేరుతో ఫోన్లలో బెదిరింపులకు పాల్పడి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఘటన వెలుగు చూసింది. ఈ నెల 17న స్థానిక తాహశీల్దార్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా విఆర్ఒను ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు ఎసిబి అధికారులమని చెప్పి ఆ మరుసటి రోజు నుంచి మండలంలోని ప్రభుత్వాధికారులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. మండల స్థాయిలో ఒక అధికారికి ఫోన్ చేసి మిగతా అధికారులందరికీ లైన్ కలపమని చెప్పి బెదిరించారు. మూడు రోజుల క్రితం మండల స్థాయిలో ఉన్న రెవిన్యూ అధికారికి ఫోన్ చేసి ఎసిబి డిఎస్‌పిని మాట్లాడుతున్నానని చెప్పి బెదిరించడమే కాకుండా ఆస్తుల వివరాలు, జీతం వివరాలు అడిగి మిమ్మల్ని అరెస్ట్ చేయడానికి వస్తున్నాం అని చెప్పి బెదిరించారు. దిగువ స్థాయి అధికారులందరికీ ఫోన్ చేసి లైన్ కలపాలని బెదిరించడంతో ఆందోళనకు గురైన ఆ అధికారి మండల స్థాయిలో మరో అధికారికి ఫోన్ చేసి నకిలీ ఎసిబి అధికారులకు లైన్ కలిపారు. దీంతో, తన పైనున్న అధికారి ఫోను నెంబర్ ద్వారా కాల్ రావడంతో వారంతా లైన్‌లోకి వచ్చారు. వీరందరినీ 'ఏయే ఉద్యోగాలు చేస్తున్నారు. ఆస్తుల వివరాలు, ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయి. బ్యాంకు బ్యాలెన్సు ఎంత?' అంటూ బెదిరించారు. ఇప్పుడే మిమ్మల్ని అరెస్ట్ చేయడానికి వస్తున్నామని భయపెట్టి వారి నుంచి రూ.75 వేలు తమ అకౌంట్‌లోకి వేయించుకున్నారు. ఆ తర్వాత ఆ ఫోన్ నెంబర్‌కు మండల స్థాయి అధికారులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడం, అకౌంట్ నెంబర్ నకిలీ నెంబర్ అని తేలడంతో అధికారులు తెల్లముఖం వేశారు. దీంతో, నకిలీ ఎసిబిపై క్రైమ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

రెండు రోజులు ఎస్‌వియు డిగ్రీ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 22 , 23 తేదీల్లో ఆరంభం కావలసిన బిఎ, బికాం, బిఎస్‌సి డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు అనగా మొదటి రెండు రోజులలో జరగాల్సిన సబ్జెక్టులను వాయిదా వేస్తున్నట్లు ఎస్‌వియు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 22 నుంచి పరీక్షలు ప్రారంభం కావాల్సి వుంది. కొన్ని సాంకేతిక కారణాల రీత్యా వాయిదా పడ్డాయని, ఈ రెండు పరీక్షలను మే నెల 12 ,14 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జరగవలసిన వివిధ సబ్జెక్టులు యథాతథంగా, ఆయా తేదీల్లోనే జరుగుతాయని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

మొదటి అంతస్తు, రీజినల్ డ్రగ్స్ స్టోర్స్ బిల్డింగ్, ఎంఎంసి కాంపౌండ్, ఎన్‌హెచ్16 సర్వీస్ రోడ్, గుణదల, విజయవాడ-8. ఫోన్ నెం.8978680814. ఇమెయిల్: eeapmsidc.krishnadt@@gmail.com

షార్ట్ టెండరు నోటీసు నెం.02/ఇఇ/ఎపిఎంఎస్ఐడిసి డివిజన్/క్రిష్ణజిల్లా/విజేప్/డిబి/2025-26, తేది.17.04.2025

దిగువ నాలుగు (04) నెంబర్ల పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ఫ్లాట్‌ఫామ్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నారు. 1) ఎన్‌టిఆర్ జిల్లాలో ఎహెచ్, నందిగామ వద్ద ఐపిహెచ్‌ఎల్ ల్యాబ్ ఎస్టాబ్లిష్‌మెంట్ & రోజువారి నిర్వహణ, 2) ఎస్‌ఎస్ బ్లాక్, న్యూ జిజిహెచ్, విజయవాడ 3) పాత జిజిహెచ్, విజయవాడ, 4) ఎ, బి& సి బ్లాకులు, న్యూ జిజిహెచ్, విజయవాడ. ఇతర వివరాలను వెబ్‌సైట్: https://tender.apeprocurement. gov.in లో చూడవచ్చును.

సం/- కె.నాగార్జున రావు, బి.టెక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు

DIPRNo.4051PP/CL/ADVT/1/1/2021-22

సప్తగిరి గ్రామీణ బ్యాంక్

(ప్రభుత్వ రంగ సంస్థ RRB: ఇండియన్ బ్యాంక్‌చే ప్రాయోజితం)

తాడిగడప బ్రాంచి, విజయవాడ. ఫోన్: 0866-2581876, 8886644169

బంగారు నగల వేలం ప్రకటన

ఈ దిగువ ఉదహరించిన వ్యక్తులు మా బ్రాంచిలో బంగారు నగలు తాకట్టుపెట్టి ఋణము తీసుకొని సదరు అప్పు సకాలంలో చెల్లించమని నోటీసులు పంపించిననూ బాకీ చెల్లించనందున బాకీ గడువు తీరినందువలన మాకు తాకట్టు పెట్టిన ఆభరణములను **ది. 13-05-2025, మంగళవారం మధ్యాహ్నం 2 గం. 30 ని.లకు** వేలం వేయుటకు నిర్ణయించడమైనది. వేలం పాటలో పాల్గొనదలచినవారు **రూ. 5,000/-** ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంపాటలో పొల్గొనవచ్చును. వేలం తేది మార్పులకు గానీ, నిలుపుటకుగానీ, రద్దుచేయుటకు గానీ బ్రాంచి మేనేజర్‌కు సర్వాధికారములు కలవు. వేలం తరువాత ఇంకనూ బాకీ తీరని యెడల వారిపై కోర్టు ద్వారా చర్య తీసుకోబడును.

క్ర.సం	అప్పు నెం	ఖాతాదారుని పేరు	భర్త / తండ్రి పేరు	ఋణము మంజూరు చేసిన తేది	మొత్తం బరువు గ్రాములలో
1.	50061900882	తిప్పిరెడ్డి వేణుగోపాల రెడ్డి	టి.వి.కృష్ణ రెడ్డి	23-11-2023	30 గ్రా॥

తేది: 21-04-2025
ప్రదేశము: తాడిగడప

అధీకృత అధికారి
సప్తగిరి గ్రామీణ బ్యాంక్

విడుపు ప్రకటన

ICICI Bank

శాఖా కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్‌హల్లి హొసూర్, మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

ప్రకటన

(లోన్ డాక్యుమెంట్/ ఆస్తి డాక్యుమెంట్ లో వివరించిన ప్రకారం కవర్ చేకయబడిన మొత్తం ఆ ఇంటి బేరింగ్ నం.1-24, టి.ఎస్.నం.507/3, బ్లాక్ నం.17, వార్డు నం.01 కొలత 400 చ.గ.లు. లేదా 334.44 చ.మీ.లు. తెనాలి టౌన్ మరియు మున్సిపాలిటీ, గుంటూరు జిల్లా, ఎ.పి. మరియు హద్దులు : ఉత్తరం : 8 చ.గ.లు. వెడల్పు రోడ్డు 40.03, దక్షిణం : 39-05 అ.లు. తుమ్మల సుబ్రమణ్యేశ్వరరావు స్థలం సరిహద్దు, తూర్పు : 80-04 అ.లు. పసుపులేటి సుబ్బారావు ప్రదేశం సరిహద్దు, పడమర : 91-06 అ.లు. మేడిశెట్టి సత్యనారాయణ ప్రదేశం సరిహద్దు" ఆస్తిలో ఉన్న దరఖాస్తుదారు చుండూరు రమణ మూర్తి మరియు సహ దరఖాస్తుదారు చుండూరు శాలినిలకు చెందిన చర వస్తువులను ఖాళీ చేయమని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. 07.03.2025న ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ ద్వారా సెక్యూరిటీజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 యొక్క సెక్షన్ 13 (4) క్రింద ఈ ప్రకటన ప్రచురణ నుండి 7 రోజుల కాల వ్యవధిలో స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది.
చర వస్తువలను ఖాళీ చేయడంలో విఫలమైతే, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ మీ స్వంత ఖర్చుతో ఆస్తిలో ఉన్న చర వస్తువులతో పాటు ఆస్తిని వేలం వేయడానికి నిర్బంధించబడుతుంది మరియు పరిణామాలకు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ బాధ్యత వహించదని దయచేసి గమనించండి.

తేది : 22 ఏప్రిల్, 2025
ప్రదేశం : తెనాలి

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయము, మచిలీపట్నం.

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినను దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించుండలేదు మరియు ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున, సదరు బంగారు నగలు **ది.25-04-2025, శుక్రవారం, సాయంత్రం 04.00 గంటలకు** మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు **ది.25-04-2025 మధ్యాహ్నం 02.00 గం॥లలోపు తమ గుర్తింపు కార్డును చూపి రూ.5,000/-** లు ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా కూడో బకాయి రద్దుకాని యెడల మిగిలిన బకాయి మరియు ఇతర ఖర్చులు కొరకు వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలీన బకాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

క్రమ. సం	లోన్ ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	మొత్తం తూకం గ్రాముల్లో
చల్లపల్లి బ్రాంచి. ఫోన్: 9563388889			
1.	007416630000234	జంపన వీరబాబు 5-102, తండ్రి: వెంకటేశ్వర రావు, రాముడుపాలెం, చల్లపల్లి, కృష్ణాజిల్లా-521126, ఆంధ్రప్రదేశ్.	15.90
చిన్నాపురం బ్రాంచి. ఫోన్: 7799111213			
1.	078316540005833	గౌని శ్రీనివాసరావు మెరక వీధి, చిన్నాపురం, కృష్ణా, 521001, ఆంధ్ర ప్రదేశ్	32.00
గుడ్లవల్లెరు బ్రాంచి. ఫోన్: 9160503232			
1.	113426540004994	దెలాయి అశ్విని శాంతి భర్త: ఏడుకొండలు, సంత రోడ్, రామాలయం దగ్గర, గుడ్లవల్లేరు, కృష్ణాజిల్లా ఆంధ్రప్రదేశ్-521356.	36.50
పోరంకి బ్రాంచి. ఫోన్: 9542209384			
1.	330006630002271	గోలి శ్రీ వెంకట్ డి.నెం.1-334, లక్ష్మీపురం కాలనీ, పెనుమలూరు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521137.	31.80
2.	330006540225016	పానుగంటి మాధురి భర్త: కీరణ్ బాబు ఈమని, 7-92, ఈమని, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522308.	43.50
3.	330006540225017	పానుగంటి మాధురి భర్త: కీరణ్ బాబు ఈమని, 7-92, ఈమని, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522308.	58.20
పునాదిపాడు బ్రాంచి. ఫోన్: 7777885519			
1.	090416630002645	కాటూరి రమేష్ కేరాఫ్: కాటూరి శోభనాద్రి, 2-58, గొల్లగూడెం, కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521151.	12.70
2.	090416630001532	కాటూరి రమేష్ కేరాఫ్: కాటూరి శోభనాద్రి, 2-58, గొల్లగూడెం, కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521151.	15.50
హనుమాన్ జంక్షన్ బ్రాంచి. ఫోన్: 9966790716			
1.	020016540005019	గోరిపర్తి శ్రీను తండ్రి: రామస్వామి, మేడిచర్ల, బాపులపాడు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521105	6.00
2.	020016540005138	దండాసి గోవిందరాజు తండ్రి: పురుషోత్తం, 10-37, ఇందిరా నగర్, బాపులపాడు, ఆంధ్రప్రదేశ్-521105.	8.00
తాడిగడప బ్రాంచి. ఫోన్: 88639469006			
1.	119316630000301	గంటా ఉషారాణి భర్త: గంటా ఫణిబాబు, 1-111, ఎస్.సి కాలని, తాడిగడప, కృష్ణాజిల్లా, ఏపి-521137	6.00
2.	119316540005265	గోనెల వేణు తండ్రి: ఏడుకొండలు, డి.నెం.5-235, కార్మిక నగర్, తాడిగడప, కృష్ణాజిల్లా, ఏపి-521137	16.90
3.	119316540004605	గోనెల వేణు తండ్రి: ఏడుకొండలు, డి.నెం.5-235, కార్మిక నగర్, తాడిగడప, కృష్ణాజిల్లా, ఏపి-521137	21.00
కానూరు బ్రాంచి. ఫోన్: 9948566516			
1.	146216540002751	అడుసుమల్లి వీరాంజనేయులు తండ్రి: వెంకటపయ్య, హెచ్.నెం.6-28, SA02Q శావల్యపురం, శావల్యపురం మండలం, ఏపి-522646.	22.00

తేదీ.21-04-2025, స్థలం: మచిలీపట్నం. అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,రీజనల్ ఆఫీస్, విజయవాడ

సామాజిక మార్పులపై గళమెత్తిన నేత

బాధాతప్తులకు బాసటగా పోప్ ఫ్రాన్సిస్

వాటికన్ సిటీ : కేథలిక్స్ చర్చి మత పెద్దగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి పోప్ ఫ్రాన్సిస్ సాధారణమైన పోప్ పోకడలకు భిన్నంగా వ్యవహరిస్తూ వచ్చారు. చర్చి లోపలి సాంప్రదాయవాదుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ ఆయన తన ధోరణిని మార్చుకోలేదు. పలు సామాజిక అంశాలపై, సమస్యలపై ఆయన తన గళాన్ని వినిపించారు. దీంతో రాడికల్ పోప్‌గా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడ్డారు. లాటిన్ అమెరికాకు చెందిన తొలి పోప్‌గా ఆయన తొలినాళ్ల నుండి బాధాతప్తులకు బాసటగా నిలుస్తూ వచ్చారు. శరణార్థులు, వాతావరణ మార్పులతో పోరాటం చేస్తున్న దేశాలకు అండగా నిలిచారు. మానవాళి సృష్టిస్తున్న ఈ వాతావరణ సంక్షోభానికి ప్రజలే బలవుతారని ఆయన హెచ్చరించారు. బిషప్‌లు, మతాధిపతులు లైంగిక నేరాలకు పాల్పడిన ఘటనలపై ఆయన తీవ్రంగా స్పందించారు. 2013 మార్చిలో పోప్‌గా ఎన్నికైన నాటి నుండి కేథలిక్ చర్చి నాయకుడిగా తనదైన ముద్ర వేసేందుకు ప్రయత్నించారు. జార్జి మారియో బెర్గోయిగ్లో పోప్‌గా మారిన తర్వాత 13వ శతాబ్దానికి చెందిన ఆధ్యాత్మికవేత్త, నిరుపేదల కోసం తన సంపదను, జీవితాన్ని అంకితం చేసిన సెయింట్ ఫ్రాన్సిస్ పేరులోని ఫ్రాన్సిస్‌ను తీసుకుని పోప్ ఫ్రాన్సిస్‌గా ప్రసిద్ధులయ్యారు. విలాసవంతమైన రాజభవనాలు విడిచిపెట్టి, సామాన్యమైన దుస్తులు ధరించి అత్యంత వినయంతో ప్రజల్లో మెలిగేవారు. వితంతువులు, అత్యాచార బాధితులు, ఖైదీలు ఇలాంటి వారికి తరచుగా ఫోన్ కాల్స్ చేసి మాట్లాడేవారు. తనకు ముందు బాధ్యతలు నిర్వహించిన పోప్‌ల కన్నా ఎక్కువగా ప్రజలకు అందుబాటులో వుండేవారు. సోషల్ మీడియా నుండి పోర్నోగ్రఫీ (అశ్లీల సాహిత్యం) వరకు అనేక అంశాలపై యువతతో మాట్లాడేవారు. తన ఆరోగ్యం గురించి కూడా ఎలాంటి దాపరికం లేకుండా పంచుకున్నారు. మోకాళ్ల నొప్పులతో ఆయన చివరి కాలంలో వీల్ ఛెయిర్‌కే అంకితమయ్యారు.

ఖైదీల పాదాలకు ముద్దు పెట్టి...

వాటికన్‌లో మొదటి ఈస్టర్‌కు ముందుగా, పోప్ రోమ్ జైల్లోని ఖైదీల పాదాలను కడిగి, ముద్దు పెట్టుకున్నారు. తనకు ముందు పనిచేసిన పోప్‌లకంటే అధికంగా ప్రపంచవ్యాప్తంగా అందరి ఆదరాభిమానాలు అందుకోవడానికి ఆయనలోని ఇలాంటి గుణాలే కారణాలుగా వున్నాయి. మొట్టమొదటి విదేశీ పర్యటనకు ఆయన ఇటలీ ద్వీపకల్పమైన లాంపెడుసాను ఎంచుకున్నారు. యూరప్‌కు చేరుకోవాలని ఆశించే వేలాదిమంది శరణార్థులు ప్రవేశించే పాయింట్ ఇదే. ప్రపంచీకరణ ఉదాసీనతను ఆయన నిందించారు.

ట్రంప్ చర్యలను ఖండించి..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటి పదవీ హయాంలో మెక్సికోకు వ్యతిరేకంగా సరిహద్దు గోడను నిర్మించడాన్ని పోప్ తీవ్రంగా విమర్శించారు. క్రైస్తవ విరుద్ధమైన చర్య అని ఖండించారు. ట్రంప్ రెండోసారి ఎన్నికైన తర్వాత కూడా ఆయన శరణార్థులను అమానవీయంగా తరలించడాన్ని తీవ్రంగా నిరసించారు. ఇదొక ప్రధానమైన సంక్షోభంగా మారుతుందని, అత్యంత దారుణమైన పరిస్థితులకు దారి తీస్తుందని హెచ్చరించారు.

2016లో యూరప్ శరణార్థుల సంక్షోభం తీవ్రంగా వున్న రోజుల్లో, పోప్ ఫ్రాన్సిస్ గ్రీక్ ద్వీపమైన లెస్బాస్‌కు వెళ్లి ఆశ్రయం కోరుతున్న సిరియా ముస్లిమ్‌లకు చెందిన మూడు కుటుంబాలను తీసుకుని రోమ్ తిరిగి వచ్చారు. మతాల మధ్య సయోధ్యకు ఆయన కట్టుబడ్డారు. ఇతర భిన్నమైన మార్గాల్లో వాటికన్ దౌత్యానికి జవసత్వాలు ఇచ్చారు. అమెరికా, క్యూబాల మధ్య చారిత్రక సయోధ్యకు వెసులుబాటు కల్పించేందుకు సాయపడ్డారు. కొలంబియాలో శాంతి ప్రక్రియను ప్రోత్సహించారు.

వాతావరణ మార్పులపై గళమెత్తి...

చారిత్రక 2015 పారిస్ వాతావరణ ఒప్పందాన్ని ప్రభావితం చేసిన వ్యక్తిగా పోప్ ఫ్రాన్సిస్‌ను నిపుణులు పేర్కొంటారు. వాతావరణ మార్పులపై సత్వర కార్యాచరణ చేపట్టాలని ఆయన నిరంతరం విజ్ఞప్తి చేస్తూ ఉండేవారు. ముంచుకొస్తున్న ఈ పర్యావరణ విపత్తుకు సంపన్న దేశాల ఆర్థిక వ్యవస్థలు, వారి విధానాలే కారణమని వాదించేవారు. ఇప్పటికే జరగరాని నష్టం జరిగిపోయిందని అంటూ ఇక ఆలస్యం చేయరాదని, వెంటనే కళ్ళు తెరవాలని 2023లో ఆయన ప్రపంచ నేతలకు విజ్ఞప్తి చేశారు.

శాంతి కాముకుడు

శాంతి కాముకుడైన పోప్ తరచూ ఆయుధాల తయారీదారులను నిరసించేవారు. ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల ఘర్షణలు, యుద్ధాలతో అతలాకుతలమవుతున్న నేపథ్యంలో మూడో ప్రపంచ యుద్ధం తప్పదంటూ హెచ్చరించారు. గాజా, ఉక్రెయిన్, కాంగో, మయన్మార్ సహా ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాలలో శాంతి నెలకొనాలని పోప్ ఆకాంక్షించారు. 'పోరాటం చేస్తున్న వారికి విజ్ఞప్తి చేస్తున్నాను. కాల్పుల విరమణ జరపండి, బందీలను విడుదల చేయండి. శాంతి, భవిష్యత్తును కోరుకుంటూ ఆకలితో అలమటిస్తున్న ప్రజలకు సాయం చేయండి. వలసవాదులు, అణగారిన ప్రజల పట్ల కరుణ చూపండి.' అని విజ్ఞప్తి చేశారు.

పోప్ బాధ్యతలు చేపట్టేనాటికి అప్పటికే కుంభకోణాలు చుట్టుముట్టిన కేథలిక్ చర్చి వైఖరులను మార్చడంలో, దూరంగా జరిగిన విశ్వాసపరులను తిరిగి వెనక్కి తెచ్చుకోవడంలో పోప్‌కే ఘనతనివ్వాలని ఆయన అభిమానులు పేర్కొంటారు. గే కేథలిక్స్ గురించి మాట్లాడమంటే 'నేనెవరిని అంచనా వేయడానికి?' అని ఎదురు ప్రశ్నించారు. మతాధిపతుల లైంగిక దాడుల అభియోగాల వల్ల కలిగిన నష్టాన్ని పూడ్చడానికి ఆయన తనవంతుగా ప్రయత్నించారు. బాధితులను కలుసుకున్నారు. అందుకు బాధ్యులైన వారిని జవాబుదారీ చేస్తామని హామీ ఇచ్చారు.

గొప్ప మానవతావాది
ప్రపంచ నేతల సంతాపం

పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూతపై ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ప్రజల మనిషి, గొప్ప మానవతావాది అంటూ కొనియాడారు.

పోప్ మృతికి వైట్‌హౌస్ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. రెస్ట్ ఇన్ పీస్, పోప్ ఫ్రాన్సిస్ అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఈస్టర్ సందర్భంగా తన సతీమణితో కలిసి పోప్‌ను ఆదివారం కలిశారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది ఆయనను అమితంగా ప్రేమిస్తారని పేర్కొన్నారు.

ఇటలీ ప్రధాని జార్జియా మెలోని పోప్ మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గొప్ప మానవతావాది అని ప్రశంసించారు. ఆయన సలహాలు, సూచనలు, బోధనలు, అన్నీ తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు.

యువతలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు పోప్ ఎంతగానో కృషి చేశారని అర్జెంటైనా అధ్యక్ష కార్యాలయం పేర్కొంది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ మాట్లాడుతూ, మరింత స్వచ్ఛమైన, శాంతియుతమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. కేథలిక్ చర్చి పరిధి దాటి లక్షలాదిమందికి ఆయన స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆయన వినయం, ప్రేమ, కరుణ, దయ ఎంతోమందిని దగ్గర చేసిందన్నారు.

రష్యా ఆర్థడాక్స్, కేథలిక్ చర్చిల మధ్య సంబంధాలు బలోపేతం కావడానికి పోప్ చేసిన కృషిని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసించారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సమాజంలోని దుర్బలురు గురించి ఆయన ఎప్పుడూ ఆలోచించేవారని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ వ్యాఖ్యానించారు. ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్, పోలెండ్ అధ్యక్షుడు ఆండ్రెజ్ దుడా, స్పెయిన్ న్యాయ మంత్రి ఫెలిక్స్ బోలానోస్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్, ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్, తూర్పు తైమూర్, ఈజిప్ట్, జర్మనీ, టిబెట్ నేతలు కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన గొప్ప మానవతా వాది అని ప్రశంసించారు. పోప్ మృతి వార్త తనను ఎంతగానో కలిచివేసిందని కింగ్‌చార్లెస్ వ్యాఖ్యానించారు. ఐక్యత, పర్యావరణం పట్ల ఆయన నిబద్ధత ప్రశంసించదగ్గవన్నారు. ప్రధాని కెయిర్ స్టార్మర్ కూడా సంతాపం తెలియజేశారు. అందరికీ సమాన అవకాశాలు కలిగిన ప్రపంచం కోసం ఆయన నిరంతరంగా కృషి చేశారని, ఆ విధంగానే ప్రపంచ ప్రజలకు గుర్తుండిపోతారని కొనియాడారు.

పేదల గొంతు వినండి

- సివిల్ సర్వీసెస్ అధికారులతో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : పేదల సమస్యలపై సున్నితంగా ఉండాలని, వారి గొంతును వినాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సివిల్ సర్వీసెస్ అధికారులకు ప్రధాని నరేంద్రమోడీ కోరారు. సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వచ్చే వెయ్యేళ్ల భవిష్యత్‌ను రూపొందించేలా తమ ప్రభుత్వ విధానాలను అమలుచేస్తున్నామని అన్నారు. భారతదేశపు సమగ్రాభివృద్ధి అంటే ఏ గ్రామం, ఏ కుటుంబం, ఏ పౌరుడు వెనుకబడి ఉండకుండా ఉండటం అని తెలిపారు. గత పదేళ్లలో భారతదేశం ప్రభావవంతమైన పరివర్తన దిశగా సాగుతోందని మోడీ చెప్పారు. సాంకేతిక యుగంలో పాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదని, అవకాశాలను పెంచడం అని మోడీ పేర్కొన్నారు. 2023లో జి20 శిఖరాగ్ర సదస్సును భారత్ విజయవంతంగా నిర్వహించిందని, ప్రపంచం దానిని గుర్తించిందని మోడీ ప్రస్తావించారు. 'భారతదేశం ఇప్పుడు కేవలం పాల్గొనడం లేదు. నాయకత్వం వహిస్తోంది' అని మోడీ తెలిపారు.

ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తుల బదిలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక హైకోర్టులకు చెందిన ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేసింది. ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగిన సమావేశాల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సంజయ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి ఒకరు, తెలంగాణ హైకోర్టు నుంచి ఇద్దరు, కర్ణాటక హైకోర్టుకు చెందిన నలుగురు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావును కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పెరుగు శ్రీ సుధను కర్ణాటకకు, జస్టిస్ కాసోజు సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు సుప్రీంకోర్టు కొలీజియం బదిలీ చేసింది. కర్ణాటక హైకోర్టుకు చెందిన జస్టిస్ హేమంత్ చందన్ గౌడర్‌ను మద్రాస్ హైకోర్టు, జస్టిస్ కృష్ణన్ నటరాజన్ కేరళ హైకోర్టుకు, జస్టిస్ నెరనహళ్లి శ్రీనివాసన్ సంజయ్ గౌడను గుజరాత్ హైకోర్టుకు, జస్టిస్ దీక్షిత్ కృష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేసింది.

ఉర్సా' భూముల వ్యవహారం బయటపెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

గురిచేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. శాంతిభద్రతల పేరుతో ఇరువర్గాలకు రాజీచేసే పెత్తందార్లపై ఎలాంటి చర్యలూ లేకుండా ప్రభుత్వం రక్షించడం అన్యాయమని కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్రామంలో దళితులకు రక్షణ కల్పించి సామాజిక బహిష్కరణ అమలు చేసిన పెత్తందార్లపై ఎస్‌సి, ఎస్‌టి ఎట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మరోసారి ఇలాంటి చర్యలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామంలో పర్యటించి దళితులకు మనోధైర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యకు మూలమైన విద్యుత్‌ఘాతం వల్ల చనిపోయిన దళిత యువకుని కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలని, సామాజిక బహిష్కరణ అమలు జరిగిన కాలానికి బాధితులందరికీ పరిహారం చెల్లించాలని శ్రీనివాసరావు డిమాండు చేశారు.

మే 20న కార్మికుల సార్వత్రిక సమ్మెకు ఎస్‌కెఎం మద్దతు

- రైతులు మండల స్థాయిలో భారీ నిరసనలు చేపట్టాలని పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మే 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన కార్మికుల సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) మద్దతు తెలిపింది. ఎస్‌కెఎం జనరల్ బాడీ సమావేశం ఢిల్లీలో జరిగింది. నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుతోపాటు ఇతర డిమాండ్ల సాధనం కోసం కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన మే 20 సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. ఆ రోజున దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికులు సార్వత్రిక సమ్మెకు పూర్తిగా మద్దతు ఇవ్వాలని, మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చింది.

కార్మికుల డిమాండ్లకు మద్దతు ఇవ్వడంతోపాటు ఎంఎస్‌పి చట్టబద్ధంగా హామీ, రుణ మాఫీ, ఎన్‌పిఎఫ్‌ఎఎం ఉపసంహరణ, ఇండో-యుఎస్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంతో యుఎస్ సామ్రాజ్యవాదం ముందు రైతుల ప్రయోజనాలను తాకట్టుపెట్టొద్దు, రోజువారీ వేతనం రూ.600తో పాటు 200 రోజుల పని, సామాజిక భద్రత, వ్యవసాయ కార్మికులకు రూ.10 వేల నెలవారీ పెన్షన్, వలస కార్మికులు, కౌలు రైతుల హక్కుల కోసం డిమాండ్ చేసింది. ప్రైవేటీకరణ, ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జూన్ 26న విద్యుత్ రంగ కార్మికుల సమ్మెకు సంఘీభావం, మద్దతు ఇవ్వాలని జనరల్ బాడీ నిర్ణయించింది. వినియోగదారులందరికీ 300 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం ఎస్‌కెఎం తన డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తుంది.

మోడీ ప్రభుత్వం అన్యాయమైన వాణిజ్య నిబంధనలను విధించడానికి, యుఎస్ వ్యవసాయ ఉత్పత్తులను భారతదేశంలోకి దిగుమతి చేయడానికి యుఎస్ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఎస్‌కెఎం ఏప్రిల్ 23 వరకు ట్రంప్, మోడీ, వాన్స్ దిష్టిబొమ్మలను దహనం చేస్తుంది. అధిక సబ్సిడీతో కూడిన పాలు, పాల ఉత్పత్తులు, సోయాబీన్, పత్తి, ఎలుకలు, గోధుమలు, బియ్యం, పప్పుధాన్యాలు, నూనెగింజలు, వరి, జన్యుమార్పిడి పంటలు, పండ్లు, కూరగాయలు, ప్రాసెస్ చేయబడిన, డబ్బాల్లో తయారుచేసిన ఆహార పదార్థాలను భారత మార్కెట్లలోకి సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడం వల్ల భారతీయ రైతుల ఆదాయం, జీవనోపాధి దెబ్బతింటుందని ఎస్‌కెఎం పేర్కొంది. ట్రంప్ పరిపాలన మోడీ ప్రభుత్వాన్ని పిడిఎస్ ఆహార పంపిణీని ముగించాలని, ఇంధనం, ఎరువులపై రైతులకు ఉన్న అన్ని సబ్సిడీలను ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేస్తోందని విమర్శించింది. భారతదేశం తన పేటెంట్ చట్టాలను అమెరికన్ కంపెనీలకు అనుగుణంగా మార్చాలని ఇది కోరుకుంటోందని, ఈ మార్పులు భారత రైతుల స్వాతంత్ర్యాన్ని హరిస్తుందని పేర్కొంది. భారతీయ ప్రజల ఆహార భద్రతపై వినాశకరమైన ప్రభావాన్ని చూపుతాయని పేర్కొంది. నవంబర్‌లో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రైతు వ్యతిరేక బిజెపి, ఎన్‌డిఎలను శిక్షించాలని ప్రజల్లో ప్రచారం చేయడానికి బీహార్‌లో ఒక నిర్దిష్ట ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి, 10 మహా పంచాయతీలను నిర్వహించాలని జనరల్ బాడీ నిర్ణయించింది.

వర్సిటీల్లో కుల వివక్ష నిర్మూలనకు
వేముల చట్టం

- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

యునివర్సిటీల్లో కుల వివక్ష నిర్మూలనకు వేముల రోహిత్ చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. 2016లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు)లో కుల వివక్షకు బలైన రోహిత్ వేముల పేరును చట్టానికి పెట్టారు. 2013 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రోహిత్ చట్టాన్ని తెస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈ చట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ తాజాగా రెండు పేజీల లేఖను రాశారు. నేటికీ దేశంలో లక్షలాది మంది విద్యా సంస్థల్లో దళిత, ఆదివాసీ, ఒబిసి వర్గాలకు చెందిన విద్యార్థులు క్రూరమైన అంటరాని తనాన్ని ఎదుర్కోవడం సిగ్గు చేటన్నారు. ఈ కుల వివక్ష కారణంగా రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి తెలివైన యువకుల హత్య ఆమోదయోగ్యం కాదన్నారు. దీనికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని లేఖలో గుర్తు చేశారు. ఇదే అంశంపై ఇటీవల కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, హిమచల్‌ప్రదేశ్ సిఎం సుఖ్వీందర్ సుఖుకు సైతం లేఖలు రాశారు.

ఎన్నికల కమిషన్ రాజీ పడింది

- మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో అక్రమాలు
- బోస్టన్‌లో రాహుల్ ఆరోపణ

బోస్టన్ : దేశంలో ఎన్నికల కమిషన్ రాజీ పడిపోయిందని, అసలు ఆ వ్యవస్థలోనే ఏదో లోపం ఉన్నదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో పోలైన ఓట్ల లెక్కలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ దీనిపై ఎన్నికల కమిషన్ స్పష్టత ఇవ్వాలని కోరారు. అమెరికాలోని బోస్టన్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్ ప్రసంగిస్తూ మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరిగిన రోజు సాయంత్రం 5.30 గంటలకు పోలైన ఓట్ల వివరాలు ప్రకటించారని, అదేరోజు రాత్రి 7.30 గంటలకు ప్రకటించిన వివరాల ప్రకారం దానికి అదనంగా మరో 65 లక్షల ఓట్లు కలిశాయని తెలిపారు. 'ఎన్నికల కమిషన్ సాయంత్రం ఒక సంఖ్య చెప్పింది. ఆ తర్వాత రెండు గంటల వ్యవధిలోనే 65 లక్షల మంది ఓటేశారని తెలిపింది. ఇది భౌతికంగా అసంభవం' అని రాహుల్ అన్నారు. ఒక ఓటు వేయడానికి ఎంత సమయం పడుతుందో వివరిస్తూ రాత్రి బాగా పొద్దు పోయే వరకూ క్యూ లైన్లలో భారీగా ఓటర్లు ఉంటే తప్ప ఓట్ల నమోదు ఆ స్థాయిలో పెరగడం సాధ్యం కాదని చెప్పారు. అక్కడ అలా జరగలేదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలలో తీసిన వీడియోలు అందజేయాలని కోరితే అందుకు నిరాకరించారని, ఆ తర్వాత ఎన్నికల చట్టాలలో చేసిన మార్పుల కారణంగా అలాంటి వాటికి పరిమితంగానే అవకాశం ఉన్నదని అన్నారు. 'ఓటుకు, ఓటుకు మధ్య సుమారు మూడు నిమిషాల సమయం పడుతుంది. తెల్లవారుజామున రెండు గంటల వరకూ ఓటర్లు క్యూ లైన్లలో పెద్ద సంఖ్యలో బారులు తీరి ఉంటే తప్ప ఆ స్థాయిలో ఓటింగ్ పెరగదు. కానీ అలా జరగలేదు. వీడియోలు చూపాలని కోరితే నిరాకరించారు. ఆ తర్వాత ఎన్నికల చట్టాన్నే మార్చేశారు. ఇప్పుడు వీడియోలు అడిగే అవకాశం కూడా లేకుండా పోయింది' అని రాహుల్ తెలిపారు.

సేవలను బట్టి చూడాలి, మతాన్ని బట్టి కాదు !

- బిజెపి ఎంపి దూబే వ్యాఖ్యలపై ఖురేషి

న్యూఢిల్లీ : వ్యక్తులను వారు చేసిన సేవలను బట్టి నిర్వచించాలి కానీ వారి మతాలను బట్టి కాదని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) ఎస్‌వై ఖురేషి వ్యాఖ్యానించారు. బిజెపి ఎంపి నిషికాంత్ దూబే తనను ముస్లిం కమిషనర్‌గా అభివర్ణించడంపై ఆయన సోమవారం పై రీతిలో స్పందించారు. "మన రాజ్యాంగం భావ ప్రకటనా స్వేచ్ఛకు హామీ కల్పించింది. ఎవరైనా ఏం మాట్లాడాలనుకుంటే అది మాట్లాడవచ్చు." అని ఖురేషి ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో మాట్లాడుతూ అన్నారు. వక్ఫ్ చట్టంపై చేసిన ప్రకటనకు కట్టుబడి వుంటారా అని ప్రశ్నించగా, కచ్చితంగా అని బదులిచ్చారు. 2010 జులై నుండి 2012 జూన్ వరకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఆయన పని చేశారు. ముస్లిం భూములను కబళించడానికి ప్రభుత్వం పన్నిన దారుణమైన దుష్ట పన్నాగమే ఈ వక్ఫ్ చట్టం అని ఖురేషి పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 17న ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనిపై కచ్చితంగా సుప్రీం స్పందిస్తుందని ఆయన అన్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే పనిని తప్పుడు ప్రచార యంత్రాంగం చక్కగా చేసిందని ఆయన వ్యాఖ్యానించారు.

ఎన్నికల కమిషనర్‌గా రాజ్యాంగబద్ధమైన పదవిని నా శాయశక్తులా నిర్వహించాను. ఐఎఎస్‌గా సుదీర్ఘమైన, సంతృప్తికరమైన కెరీర్ గడిపాను. భారతదేశ భావజాలం పట్ల నాకు పూర్తిగా విశ్వాసం వుంది. ఇక్కడ ఒక వ్యక్తిని వారు చేసిన సేవల ద్వారా నిర్వచిస్తారు తప్ప, వారి మతపరమైన గుర్తింపుల ద్వారా కాదు." అని పిటిఐతో మాట్లాడుతూ ఖురేషి వ్యాఖ్యానించారు. "కానీ కొంతమందికి, మతపరమైన గుర్తింపులనేవి వారి విద్వేష రాజకీయాలను ముందుకు తీసుకెళ్లడానికి కీలకమైనవని నేను భావిస్తున్నాను. భారతదేశం ఎల్లప్పుడూ తన రాజ్యాంగబద్ధమైన సంస్థలు, సూత్రాల పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తుంది." అని ఆయన పేర్కొన్నారు. దేశంలో అంతర్యుద్ధాలకు భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా బాధ్యుడంటూ దూబే చేసిన ప్రకటనకు పార్టీతో ఎలాంటి సంబంధం లేదని బిజెపి స్పష్టం చేసింది, అది జరిగిన కొద్ది గంటలకే ఆదివారం ఉదయం దూబే మాజీ సిఇసిపై మాటలతో దాడి చేశారు. వక్ఫ్ చట్టాన్ని ఆయన విమర్శించడమే ఈ దాడికి కారణం. అందుకని ఆయనను ముస్లిం కమిషనర్‌గా ముద్ర వేసేశారు. అంతకుముందు రోజే సుప్రీం కోర్టుపై, సిజెఐ సంజీవ్‌ఖన్నాపై కూడా ఇలాగే తీవ్రంగా విమర్శలు చేశారు.

ద్విసభ్య ధర్మాసనానికి ఎస్‌సి, ఎస్‌టి కేసులు

ప్రజాశక్తి-అమరావతి

ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో నిందితులు దాఖలు చేసే ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణ పరిధి అంశాన్ని ద్విసభ్య ధర్మాసనం తేల్చాలని జస్టిస్ టి మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని సింగిల్ జడ్జి ఇటీవల తీర్పు చెప్పారు. నిందితులు నేరుగా హైకోర్టును ఆశ్రయించవచ్చని వైసిపి నాయకులు విడదల రజిని, కాకాణి గోవర్ధన్ రెడ్డి తరపు న్యాయవాదులు వాదించారు. ఇందుకు పలు సుప్రీంకోర్టు ఉత్తర్వులను నివేదించారు. దీంతో ఈ అంశాన్ని తేల్చే వ్యవహారాన్ని ధర్మాసనానికి నివేదిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి చెందిన ఫైల్‌ను చీఫ్ జస్టిస్ ముందుంచాలని రిజిస్ట్రీకి ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి వరకు రక్షణ కల్పించాలని కాకాణి లాయర్ వినతిని తోసిపుచ్చారు. చిలకలూరిపేట నియోజకవర్గం టిడిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనపై ఎస్‌సి, ఎస్‌టి ఎట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయడాన్ని విడదల రజిని హైకోర్టులో సవాల్ చేశారు. అక్రమ మైనింగ్ చేశారంటూ నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసును కాకాణి సవాల్ చేస్తూ పిటిషన్ వేశారు.

దూబేపై కోర్టు ధిక్కార పిటిషన్‌కు అనుమతి అక్కర్లేదు

- సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : బిజెపి ఎంపీ నిషికాంత్ దూబేపై కోర్టు ధిక్కార పిటిషన్ నమోదు చేయడానికి తమ అనుమతి అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు గౌరవాన్ని, అధికారాన్ని తగ్గించే విధంగా అపనిందలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసిన దూబేపై కోర్టు ధిక్కార పిటిషన్ నమోదు చేయడానికి అనుమతి కోరుతూ సుప్రీంకోర్టు న్యాయవాది అనాస్ తన్వీర్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. కోర్టు ధిక్కార పిటిషన్ నమోదు చేయడానికి ఎలాంటి అనుమతి అవసరం లేదని తెలిపింది. 'మీరు దాఖలు చేయండి', ఈ విషయంలో అటార్నీ జనరల్ నుంచి అనుమతి పొందాలని పిటిషనర్‌కు తెలిపింది.

చర్యలపై నోరుమెదపని బిజెపి!

దేశంలో జరుగుతున్న అన్ని అంతర్యుద్ధాలకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాయే కారణమని, అలాగే మత యుద్ధాలకు సుప్రీంకోర్టు కారణమని దూబే శనివారం ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే ఇలాంటి ప్రకటనలతో బిజెపి ఏకీభవించబోదని, మద్దతు కూడా ఇవ్వబోదని ఆ పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జెపి నడ్డా తెలిపారు. కానీ జార్ఖండ్‌లోని గొడ్డా లోక్‌సభ స్థానానికి నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించిన దూబేపై చర్యలు తీసుకునేదీ లేనిదీ మాత్రం ఆయన చెప్పలేదు. అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణికి తన్వీర్ ఇప్పటికే లేఖ రాశారు. దూబేపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని, దూబే చేసిన వ్యాఖ్యలు సుప్రీంకోర్టు నిష్పాక్షికతపై దురుద్దేశాలు ఆపాదించేలా ఉన్నాయని ఆ లేఖలో ఆరోపించారు. 'దూబే వ్యాఖ్యలలో సరైనవి కావు. అవి గౌరవనీయ సుప్రీంకోర్టుపై అపవాదు వేస్తున్నాయి. న్యాయ వ్యవస్థ నిష్పాక్షికతపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని వమ్ముచేసేలా ఉన్నాయి. మతపరమైన అపనమ్మకాన్ని సృష్టించేలా ఉన్నాయి. ఇవన్నీ 1971వ సంవత్సరపు కోర్టు ధిక్కరణ చట్టంలోని సెక్షన్ 2 (సి) (ఐ)లో నిర్వచించిన చర్యల పరిధిలోకే వస్తాయి' అని వివరించారు.

జమ్ముకాశ్మీర్‌లో ఆగని భారీ వర్షాలు

- పాఠశాలలకు సెలవులు

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌ను వరసగా మూడో రోజు సోమవారం కూడా భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో సోమవారం అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ విషయాన్ని విద్యా శాఖ మంత్రి సకినా ఇట్టూ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. 'తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, అంచనాల దృష్ట్యా అన్ని పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించాం' అని తెలిపారు. శనివారం రాత్రి నుంచి జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్ష సంబంధిత కారణాలతో ఇప్పటి వరకూ ఐదుగురు మరణించారు. వందల మంది నిరాశ్రయులయ్యారు. కాగా, రానున్న 24 గంటల్లోనూ జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

- హైకోర్టుకు తెలిపిన రిటైర్డు పోలీస్ అధికారి సుబ్రమణ్యంరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని 60 ఏళ్ల రిటైర్డు పోలీసు అధికారి సుబ్రహ్మణ్యంరెడ్డి హైకోర్టుకు చెప్పారు. ఏ కేసు నమోదు చేశారో చెప్పకుండా తిరుపతి నుంచి బలవంతంగా విజయవాడ తీసుకొచ్చారన్నారు. దర్యాప్తు పేరుతో పోలీసులు అనుచితంగా వ్యవహరించారని, కేన్సర్‌తో బాధపడుతున్న తన భార్యకు కనీసం మందులు కొనే సమయం కూడా పోలీసులు ఇవ్వలేదని చెప్పారు. అనారోగ్యం కారణంగా రైలులో వస్తానని చెప్పినా తనతో పోలీసులను పంపి విజయవాడ తీసుకొచ్చారని చెప్పారు. ఈ వివరాల తర్వాత హైకోర్టు, సిట్ దర్యాప్తు అధికారే కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వాలంది. దర్యాప్తు అధికారి శ్రీహరిబాబును సుమోటోగా ప్రతివాదిగా చేర్చింది. సుబ్రహ్మణ్యంరెడ్డి ఏ కేసులోనూ నిందితుడు కానప్పుడు ఆయన విషయంలో ఎందుకు పోలీసులు దారుణంగా వ్యహరించారని ప్రశ్నించింది. సుబ్రహ్మణ్యంరెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేయాలంటే దర్యాప్తు అధికారే తిరుపతికి వెళ్లి ఆయన ఇంట్లోనే రికార్డు చేయాలంది. వాంగ్మూలం నమోదు చేసేప్పుడు దర్యాప్తు అధికారి తప్ప ఇతరులు ఉండకూడదని చెప్పింది. తమ అనుమతి తీసుకోకుండా ఏ పోలీసు అధికారి కూడా సుబ్రహ్మణ్యంరెడ్డి ఇంటికి వెళ్లకూడదని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కె మన్మథరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 60 ఏళ్ల రిటైర్డు పోలీస్ ఆఫీసర్ టి బాల సుబ్రహ్మణ్యంరెడ్డిని గుర్తు తెలియని పోలీసులు ఈ నెల 16వ తేదీ రాత్రి 11:50 గంటలకు తిరుపతిలోని ఆయన ఇంటి నుంచి తీసుకెళ్లారని, ఆయన ఆచూకీ తెలియడం లేదని వైసిపి నేత మేకా వెంకటరామిరెడ్డి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. గత ఆదేశాల మేరకు సుబ్రహ్మణ్యంరెడ్డి వ్యక్తితంగా కోర్టుకు వచ్చి పై వివరాలు చెప్పడంతో హైకోర్టు పోలీసులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

కసిరెడ్డి కేసులో వివరాలు సమర్పించండి

- సిఐడికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ రాజ్ కసిరెడ్డి దాఖలు చేసిన కేసులో వివరాలు సమర్పించాలని సిఐడి అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ టి మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులిచ్చారు. కసిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే ఆన్‌లైన్‌లో వాదిస్తూ, మధ్యంతర ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా వేశామని, దీనిని అత్యవసరంగా జరపాలని కోరారు. వైసిపి ప్రభుత్వంలో మద్యం కుంభకోణానికి సంబంధించి గతేడాది సెప్టెంబర్ 23న సిఐడి కేసు నమోదు చేసింది.

వాళ్లను ఇంటి వద్దనే విచారించండి

మద్యం కేసులో గత వైసిపి ప్రభుత్వంలో ఐటి సలహాదారుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వేరే పిటిషన్ వేశారు. తనను ఇంటి వద్ద విచారించేలా సిట్ అధికారులను ఆదేశించాలని రాజ్ కసిరెడ్డి తల్లిదండ్రులు కసిరెడ్డి ఉపేందర్ రెడ్డి, సుభాషిణి లంచ్‌మోషన్ పిటిషన్ వేశారు. నోటీసులను అందుకున్నాక సిట్ ఎదుట హాజరయ్యారని వాళ్ల న్యాయవాది చెప్పారు. పిటిషనర్లకు 60 ఏళ్లకు పైబడి వయసని, ఇంటి వద్ద న్యాయవాదుల సమక్షంలో విచారణకు అనుమతించాలని కోరారు. దీనిపై పిపి ప్రతివాదన చేస్తూ, బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 179 మేరకు పిటిషనర్లను వారి ఇంటి వద్ద విచారించేందుకు అభ్యంతరం లేదన్నారు. వాదనల తర్వాత న్యాయమూర్తి జస్టిస్ ఎన్ హరినాథ్ పిటిషనర్లను న్యాయవాదుల సమక్షంలో వారి ఇంటి వద్దే విచారించాలని సిట్‌ను ఆదేశించారు. వాళ్లపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. విచారణను మే 5కు వాయిదా వేశారు.

మీకోసం

ఉల్లిరసంలో దూది ముంచి ముఖంపై నల్లమచ్చలు ఉన్నచోట రాసుకుంటే ఫలితం ఉంటుంది.

జీవన సౌరభం

చేయగలిగే శక్తి ఉన్నవాడి కంటే చేయాలనే కోరిక, సంకల్పం ఉన్నవాడు ఎక్కువ ఫలితం సాధిస్తాడు.

గాడిద బద్ధకం

ఒక ఊరిలో ఓ రైతు పొలం పనులకు గాడిదని ఉపయోగించేవాడు. పొలం దున్నడం, కుప్ప నూర్చడం, పొలం నుండి పంట కళ్లానికి చేర్చడం, ధాన్యం బస్తాలు ఇంటికి చేర్చడం వంటి పనులు అన్నీ ఆ గాడిదతోనే చేయించేవాడు. గాడిదకు తిన్నంత ఆహారం పెట్టేవాడు. దాన్ని ఒక జంతువులా కాకుండా తన ఇంటి సొంత మనిషిలా చూసుకునేవాడు. కాని ఆ గాడిదకు ఒక చెడ్డ అలవాటుంది. దానికి బద్ధకం ఎక్కువ. పని చేయడానికి ఇష్ట పడేదికాదు. ఒక్కోసారి పని తప్పించుకోవటానికి అనారోగ్యంలా నటించేది. రైతుతో సేవలు చేయించుకునేది.

ఇలా బాగా బద్ధకానికి అలవాటు పడిన గాడిద, రైతు నుండి ఏ మాత్రం పనిలేని చోటుకి వెళ్లిపోవాలనుకునేది. తగిన సమయం కోసం ఎదురు చూసేది. ఒక రోజు రైతు పొలంలోకి రాజు గారి గుర్రం ఒకటి మేత మేయడానికి వచ్చింది. 'ఆ గుర్రంతో రాజు గారి గుర్రంశాలకు నేను కూడా చేరుకుంటే భలే ఉంటుంది. అక్కడ ఎక్కువ గుర్రాలు ఉంటాయి. అన్ని గుర్రాల మధ్య పని తేలికగా తప్పించుకోవచ్చు. ఆకారంలో నేను కూడా గుర్రం లాగే ఉంటాను కదా!' అనుకుంది.

గుర్రంతో మాటలు కలిపింది. 'ఇక్కడ పని ఎక్కువ. ఆహారం అసలు పెట్టడం లేదు. రైతు సరిగా చూసుకోవడం లేదు' అని అబద్ధాలు చెప్పి ఏడ్చింది. గుర్రం 'సరే' అంది. సాయంత్రం గుర్రం లాగే తయారై రాజుగారి గుర్రం శాలకు చేరుకుంది. అక్కడా దాంతో గాడిద చాకిరీ చేయించారు. పైగా రైతు దగ్గర ఉన్నంత స్వేచ్ఛ ఆ గుర్రంశాలలో గాడిదకి దొరకలేదు. పైగా కొట్టి మరీ పరుగులు పెట్టిస్తున్నారు. ఆయాసంతో దానికి నీరసం వచ్చేసేది.

ఒక రోజు ఆ గుర్రాలశాల నుండి ఎలాగైనా తప్పించుకోవాలని అనుకుంది. కాపరి వచ్చినప్పుడు ఓండ్రించింది. అంతే కాపరి దాన్ని గుర్రాలశాల నుండి తరిమికొట్టాడు. బతుకుజీవుడా అనుకుంటూ గాడిద రైతు పొలం వైపు పరుగు లంకించుకుంది. ఆ రోజు నుండి రైతు చెప్పిన పనులు బుద్ధిగా చేసింది. తప్పిపోయిన తన గాడిద తిరిగి వచ్చినందుకు రైతు కూడా చాలా సంతోషించాడు.

– రాళ్లబండి సంగంనాయుడు,
జరజాపుపేట, విజయనగరం,
94909 35258.

నేను గీసిన బొమ్మ



పి.వీక్షిత,
3వ తరగతి,
ఎస్.ఎస్. సెకండరీ స్కూల్,
అరుంబాకం,
చెన్నయ్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వేసవిలో చర్మాన్ని కాపాడుకుందాం..!

ఎండలు మండిపోతున్న వేసవిలో చర్మాన్ని కాపాడుకోవటం కూడా చాలా కీలకం. భానుడి ఉగ్రరూపానికి చర్మం ఇట్టే కమిలి పోతుంటుంది. చెమట పొక్కులు మొదలుకొని సెగగడ్డలు దాకా ఎన్నో రకాల సమస్యలు చర్మంపై దాడిచేస్తుంటాయి. జిడ్డు చర్మం, మొటిమలు, వేడి వల్ల చర్మం పాడిబారడం.. ఇలా చెప్పుకుంటే అనేక సమస్యలు ఇబ్బంది పెట్టేవి చాలా ఉన్నాయి. వీటన్నింటి నుంచి విముక్తి పొందడానికి చాలామంది రక రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. చర్మంపై ఎండ ప్రభావంతో ముఖం, కళ్లు జీవం లేనట్లుగా కనిపిస్తుంటాయి. కంటి చుట్టూ నల్లటి వలయాలు, ముఖంలో తాజాదనం లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. కొన్ని ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించటం ద్వారా మన శరీరాన్ని కాపాడుకోవచ్చు.

మృతకరణాలు తొలగించుకోవాలి : చర్మ సౌందర్యాన్ని దెబ్బతీసే వాటిలో మృతకణాలు కూడా ఒకటి. వీటి వల్ల చర్మం డల్‌గా కనిపిస్తుంటుంది. ఇవి చర్మానికి పోషకాలు అందకుండా చేసి చెమట గ్రంథుల్ని మూసుకుపోయేలా చేస్తాయి. ఈ క్రమంలో మొటిమలు, మచ్చలు వంటివి ఏర్పడతాయి. సౌందర్య రక్షణలో భాగంగా వీటిని తొలగించుకోవడం చాలా అవసరం. దీనికోసం స్నానం చేయడానికి ముందు ఏదైనా ఏదైనా నూనెతో చర్మాన్ని మసాజ్ చేసుకోవాలి. ఆ తర్వాత స్నానం చేస్తే కొంతవరకూ మృతకణాలు పోతాయి. చర్మానికి ఎలాంటి హానిలేకుండా సులభంగా వీటిని వదిలించుకోవచ్చు.

మాయిశ్చరైజ్ చేసుకోవాలి : అవాంఛిత రోమాలను ఎప్పటికప్పుడు తొలగించుకోవటం సహజంగా జరిగే ప్రక్రియే. దీనికోసం వివిధ రకాల క్రీములు వాడటం, వ్యాక్సింగ్ చేసుకోవటం వంటివి చేస్తుంటారు. వీటివల్ల చర్మం ఇరిటేట్ అయి ఎరుపెక్కడం, దురదరావడం...ఇలా పలు సమస్యలు తలెత్తుతాయి. అవాంఛిత రోమాలను తొలగించుకోవడానికి ముందు, ఆ తర్వాత ఆ ప్రదేశంలో చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయడం తప్పనిసరి. దీనికోసం చర్మతత్వాన్ని బట్టి మాయిశ్చరైజింగ్ క్రీములను ఎంపికచేసుకోవాలి.



తాజా పండ్లు: వేసవికాలంలో చర్మాన్ని తాజాగా మార్చుకోవడానికి, మెరిపించుకోవడానికి విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారం సైతం మేని మెరుపుపై ప్రభావం చూపుతుంది. మచ్చలేని మెరిసే చర్మం సొంతమవుతుంది.

సన్‌స్క్రీన్ మేలు : బయటకు వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవటం మంచిది. ఇది ఎండ నుంచి మన శరీరాన్ని కాపాడుతుంది. బయటకు వెళ్లే ముందు ఖచ్చితంగా 20 నిమిషాల ముందే రాసుకుంటే మంచిది. ఇంటికి చేరుకున్న తర్వాత చల్లటి నీటితో ముఖం కడుక్కోవడం, స్నానం చేయటం తప్పనిసరి. చర్మాన్ని తేమగా ఉంచుకోవడానికి మాయిశ్చరైజర్ రాసుకోవడమూ ముఖ్యమే.

వంటింటి చిట్కాలూ మేలే...

వేసవిలో చర్మంపై టానింగ్ అనేది ప్రతిఒక్కరూ ఎదుర్కొనే సమస్య. ఎండ వేడిమితో అధిక ఉష్ణోగ్రతలతో ఈ సమస్య మరింత ఎక్కువమవుతుంటుంది. సున్నిత చర్మం కలిగిన వారు మరీ ఎక్కువగా ఈ సమస్యను ఎదుర్కొంటుంటారు. సన్‌స్క్రీన్ చర్మాన్ని కొంతవరకూ రక్షించినప్పటికీ ఎక్కువ ప్రభావంతంగా పనిచేయదు. ఫలితంగా చర్మం కాంతి హీనమవుతుంటుంది. అందువల్ల చర్మాన్ని జాగ్రత్తగా కాపాడుకోవడం చాలా ముఖ్యం. కొన్ని వంటింటి చిట్కాలతో చర్మాన్ని ప్రకాశవంతం చేసుకోవటంతోపాటుగా వేడి నుంచి రక్షణ పొందొచ్చు.

బాదం పిండి : బాదం పిండి చర్మాన్ని సురక్షితంగా ఉంచుతుంది. ఈ పిండితో కలబంద రసాన్ని కలిసి స్నానం చేస్తే చర్మంపై టాన్ పోతుంది. ఎక్కువ కాంతివంతంగా కూడా ఉంటుంది.

దోసకాయ : ఇంట్లో ఉండే కూరగాయల్లో దోసకాయ ఒకటి. శరీరానికి నీటిని అందించే కూరగాయ కూడాను. ఇందులో విటమిన్ ఎ, బి 1 ఉండటం వల్ల దోసకాయ శరీరం లోపలే కాదు. బయట కూడా మంచి ప్రభావాన్ని చూపిస్తుంది. వారానికి మూడుసార్లు దోసకాయను ముఖం, మెడ భాగాల్లోనే కాదు. కాలి భాగాల్లో రుద్దినా ప్రభావం కనిపిస్తుంది.

టమోటా : టమోటాల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

వేసవిలో బయట తిరిగి వచ్చినప్పుడు, టమోటా గుజ్జులో చక్కెర కలుపుకొని ప్యాక్‌లా చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. జిడ్డు, పొడిచర్మం రెండింటికీ చక్కగా పనిచేస్తుంది. పొడి చర్మం ఉన్న వారు ఇందులో ఆలివ్ ఆయిల్ లేదా బాదం నూనెతో కలిపి ఉపయోగించొచ్చు. గంధపు చెక్కను ఉపయోగించినా చర్మం కాంతివంతమవుతుంది.

పెరుగు : పెరుగు ఎల్లప్పుడూ చర్మాన్ని సున్నితంగా ఉంచుతుంది. ఎండ నుంచి వచ్చిన తర్వాత పులియబెట్టిన పెరుగును కొంచెం పసుపుతో కలిపి ముఖం, మెడ, చేతి భాగాల్లో మర్దనా చేసి అరగంట తర్వాత కడిగేయొచ్చు. ఇలా చేస్తే ఆయా భాగాల్లో టాన్ తొలగిపోయి, ప్రకాశవంతంగా ఉంటాయి.

బొప్పాయి : బొప్పాయితో తయారుచేసిన మాస్క్ శరీరంలోని అన్ని భాగాలకూ ఉపయుక్తంగా ఉంటుంది. బొప్పాయి పండ్లను ముక్కలుగా కట్ చేసి గుజ్జుగా చేసి తేనెతో కలిపి ముఖం, మెడ భాగాల్లో ప్యాక్‌లా అప్లైచేసి ఓ 20 నిముషాలు ఆగి కడిగేయాలి. ఇలా వారానికొకసారి చేస్తే చర్మం నిగారిస్తుంది. వేడి వల్ల ఏర్పడే మొటిమలు రాకుండా చేస్తుంది.

నారింజ, నిమ్మ : చర్మానికి అవసరమైన సి విటమిన్ నారింజ, నిమ్మ భర్తీ చేస్తాయి. పెరుగు పులియబెట్టి నారింజ రసం కలిపి చర్మంపై అప్లై చేయాలి. ఇది సన్ టాన్‌తోపాటు పొడి చర్మాన్ని నివారిస్తుంది. చర్మం ప్రకాశవంతంగా ఉంటుంది. నిమ్మరసం తరచుగా చాలామంది ఉపయోగిస్తారు. ఇది చర్మాన్ని రిఫ్రెష్ చేస్తుంది.

ఇవి కూడా చేయొచ్చు

- ఐస్ ముక్కల్ని ముఖంపై రద్దుకోవటం ద్వారా రక్త ప్రసరణ పెరుగుతుంది. ముడతల ప్రభావం తగ్గుతుంది.
- కీరదోస గుజ్జులో కొద్దిగా నిమ్మరసం, తేనె మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో పెట్టాక ముఖం, మెడపై రాసుకుంటే మురికిని తొలగించి, ముఖాన్ని శుభ్రపరుస్తుంది.
- కలబంద గుజ్జును ఫ్రిజ్‌లో ఉంచి ఆ తర్వాత ముఖానికి మర్దన చేస్తే కమిలిన చర్మం తాజాగా మారుతుంది. చర్మంపై వేడి ప్రభావం కూడా తగ్గుతుంది.
- గులాబీ నీటిని గోరువెచ్చగా చేసి కీరదోస రసం కలిపి ఐసుముక్కలను కళ్లపై పెట్టుకుంటే కళ్ల కింద ఏర్పడిన నల్లటి వలయాలు దూరమవుతాయి. ఉబ్బిన కళ్లకు సాంత్వన చేకూరుతుంది.

– డాక్టర్ జి.అర్చన మాధురి,
ఎంబిబిఎస్, ఎండి డివిఎల్,
డెర్మటాలజిస్ట్,
కాస్మోటిక్ కేర్ స్పెషలిస్ట్,
విజయవాడ

3000 మంది ఆర్టిస్టులతో...

కథానాయకుడు మహేష్‌బాబు, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హాలీవుడ్ మూవీ 'ఎస్ఎస్ఎంబి 29'. ఫిబ్రవరి రెండోతేదీన ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆ తర్వాత ఒరిస్సాలో మొదటి షెడ్యూల్ పూర్తయ్యింది. కాశీని తలపించే సెట్స్‌లో చిత్రీకరణ జరగ్గా..ప్రియాంకాచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించారు. వీటికి సంబంధించిన ఫొటోలు ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లో జరగబోయే రెండో షెడ్యూల్‌లో మహేష్, ప్రియాంకాచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌లతోపాటుగా 3000 మంది జూనియర్ ఆర్టిస్టులతో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించబోతున్నారు. ప్రముఖ హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ల నేతృత్వంలో ఈ సీక్వెన్‌ను తెరకెక్కించబోతున్నారు. ఈనెలాఖరులో రిహార్సల్స్ పూర్తిచేసి ఆ తర్వాత షూటింగ్ పూర్తిచేస్తారు. 'వన్ నేనొక్కడినే' మూవీలో ఉన్నట్లుగా ఈ సినిమాలో కూడా బోట్ ఛేజింగ్ సీన్ కూడా ఉంటుందని సమాచారం. దీనికి సంబంధించిన ఏర్పాట్లలో టెక్నీషియన్లు నిమగ్నమై ఉన్నారు. ఇప్పటికే పలు హాలీవుడ్ ఏజెన్సీలతో ఒప్పందాలు కూడా చేసుకోవటంతో ఆయా సంస్థలకు చెందిన టెక్నీషియన్లు ఈ మూవీ కోసం ఇప్పటికే పని ప్రారంభించారు. సముద్రంలో జరిగే ఫైట్ సీక్వెన్స్ ఈ సినిమాకు హైలెట్‌గా నిలుస్తుందని, దీనికి సంబంధించిన వీఎఫ్ఎక్స్ కూడా అదిరిపోయేలా ఉంటాయనే చర్చ ఇండస్ట్రీలో బాగా జరుగుతోంది.

'కుబేర' విడుదలకు సిద్ధం

ఈ వేసవిలో రాబోతున్న భారీ బడ్జెట్ సినిమాల్లో 'కుబేర' కూడా ఒకటి. దర్శకుడు శేఖర్ కమ్ముల సినిమాల్లో అత్యధిక బడ్జెట్ సినిమా ఇదే. నాగార్జున, ధనుష్ ప్రధాన పాత్రల్లో నటించారు. రష్మిక కథానాయిక. దేవీశ్రీప్రసాద్ సంగీతాన్ని అందించారు. బ్యాంకాక్, ముంబై పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరిగింది. తెలుగు, తమిళంలో ఏకకాలంలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ పూర్తయ్యింది. ఎడిటింగ్, నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ వేసవిలోనే ఈ సినిమా థియేటర్లలో సందడి చేయనుంది.

యష్.. 20 కేజీలు బరువు తగ్గాడు...

కేజీఎఫ్ సిరీస్‌తో సాలిడ్ హిట్స్ కొట్టి పాన్ ఇండియాస్థాయిలో మంచి గుర్తింపును కన్నడ హీరో యష్ తెచ్చుకున్నారు. ప్రస్తుతం 'టాక్సిక్' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంటున్నారు. గీతు మోహన్‌దాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఆయనకు ఇది 19వ సినిమా. ఇదే సమయంలో రెండు భాగాలుగా తెరకెక్కుతున్న హిందీ చిత్రం 'రామాయణ'లో రావణుడిగా యష్ నటించబోతున్నారు. సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తుండగా ఇప్పటికే కొన్ని సన్నివేశాల షూటింగ్ కూడా జరిగింది. 'దంగల్'తో బ్లాక్ బస్టర్ హిట్‌ను అందుకున్న నితీష్ తివారీ 'రామాయణ' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం యష్ తన బరువును 20 కేజీల వరకూ తగ్గించుకున్నారు.

25న 'సోదరా' విడుదల

కథానాయకులుగా సంపూర్ణేష్‌బాబు, సంజోష్ నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. ఈనెల 25న ఈ సినిమా విడుదల కానుంది. అన్నదమ్ముల అనుబంధాన్ని సరికొత్తగా చూపుతూ ఈ సినిమా తెరకెక్కింది. ప్రమోషన్ కార్యక్రమాలను చిత్ర యూనిట్ నిర్వహిస్తోంది. హృదయకాలేయం, కొబ్బరిమట్ట, క్యాలీఫ్లవర్ లాంటి సినిమాలతో సంపూర్ణేష్‌బాబు అలరిస్తున్నారు. చిరు పేరుతో సంపూర్ణేష్‌బాబు, పవన్‌కళ్యాణ్‌పేరుతో సంజోష్ పాత్రలు 'సోదరా' చిత్రంలో ఉన్నాయి. ఈ సినిమాలో ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా, బాబా భాస్కర్, బాబుమోహన్, గెటప్ శ్రీను ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. సునీల్ కశ్యప్ సంగీతం, జాన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. శివ శర్వాణి ఎడిటర్. సుద్దాల అశోక్‌తేజ, పూర్ణాచారి సాహిత్యాన్ని అందిస్తున్నారు. క్యాన్స్ ఎంటర్‌టైన్మెంట్స్, మాంక్ ఫిలిమ్స్ బ్యానర్లపై చంద్ర చగంలా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

'సారంగపాణి జాతకం' పూర్తి వినోదాత్మకం : శివలెంక కృష్ణప్రసాద్



'సారంగపాణి జాతకం'లో యాక్షన్స్, సస్పెన్స్, థ్రిల్లర్, కామెడీ, లవ్ ఇలా అన్ని రకాల అంశాలుంటాయి. ఇంద్రగంటి గారు కథను చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. థియేటర్లలో అందరూ హాయిగా నవ్వుకునేలా ఈ చిత్రం ఉంటుంది. ఓ ఫుల్ లెంగ్త్ కామెడీ మూవీ చేయాలనే లోటు ఈ చిత్రంతో తీరిపోయింది. జంధ్యాలతో ఇలాంటి ఓ పూర్తి వినోదాత్మక సినిమా చేయలేకపోయానే? అనే లోటు ఇప్పుడు తీరిపోయింది. కొన్ని చిత్రాలు ఆడియెన్స్‌కు ఎప్పుడూ గుర్తుండిపోతాయి. అలా ఈ 'సారంగపాణి' నిత్రం ఎప్పుడూ ప్రేక్షకుల మదిలో నిలిచిపోతుంది. చాలాకాలం పాటు గుర్తుండే చిత్రం కూడా అవుతుంది. జెంటిల్‌మాన్, సమ్మోహనం తర్వాత మా కాంబోలో హాట్రిక్ హిట్‌గా 'సారంగపాణి జాతకం' సినిమా నిలవబోతుంది. మోహనకృష్ణ రాసిన కథ, కథనం ప్రతిఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఫ్యామిలీతోపాటుగా యూత్ ఆడియెన్స్ అందరినీ మెప్పిస్తుంది. సినిమా చాలా బాగా వచ్చింది. ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని తీశాం. మంచి సీజన్ దొరకాలనే ఇప్పటివరకూ ఆగాం. సమ్మర్ హాలీడేస్ స్టార్ అయ్యాయి. మా సినిమా సంపూర్ణంగా వినోదాన్ని పంచుతుంది' అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ అన్నారు. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాణంలో మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూపా కొడువయూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈనెల 25న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా మీడియాతో శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడారు. వెన్నెల కిశోర్, వైవా హర్ష, నరేష్, అవసరాల శ్రీనివాస్ తదితరులు నటించారు.

ఎ+ గ్రేడ్‌లో రోహిత్, కోహ్లి

బుమ్రా, జడేజా కూడా...

తెలుగు కుర్రాళ్లు నితీష్, అభిషేక్‌కు గ్రేడ్-సిలో చోటు

- **34మంది ఆటగాళ్లతో బిసిసిఐ కాంట్రాక్టు**

ముంబయి: టీమిండియా క్రికెటర్ల వార్షిక కాంట్రాక్టు జాబితాను భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) సోమవారం వెల్లడించింది. 2024-25ఏడాదికి బిసిసిఐ ప్రకటించిన కాంట్రాక్ట్ జాబితాలో మొత్తం 34మంది ఆటగాళ్లకు చోటు దక్కింది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతోపాటు విరాట్ కోహ్లి, బుమ్రా, జడేజాకు టాప్ గ్రేడ్‌లో చోటు లభించింది. ఎ+ గ్రేడ్‌లో నలుగురు, గ్రేడ్-ఎలో ఐదుగురు, గ్రేడ్-బిలో ఐదుగురు ఆటగాళ్లకు చోటు దక్కింది. కేటగిరి-సిలో అత్యధికంగా 19మంది క్రికెటర్లు ఉన్నారు. గత ఏడాది బిసిసిఐ కాంట్రాక్ట్ జాబితాలో చోటు కోల్పోయిన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ కూడా ఈ ఏడాది కాంట్రాక్టు జాబితాలో చోటు దక్కింది. దేశవాళీ క్రికెట్‌కు దూరంగా ఉన్న కారణంగా శ్రేయస్ అయ్యర్‌కు గ్రూప్-బిలో, అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి రంజీట్రోఫీ టోర్నీకి దూరంగా ఉన్న కారణంగా ఇషాన్ కిషన్‌కు గ్రూప్-సిలో చోటు లభించింది. గత ఏడాది గ్రూపు-ఎలో ఉన్న రిషబ్ పంత్, అంతర్జాతీయ క్రికెట్‌కు ఇటీవల గుడ్‌బై చెప్పిన రవిచంద్రన్ అశ్విన్‌లకు బిసిసిఐ ఈసారి కాంట్రాక్ట్ జాబితాలో చోటు కల్పించలేదు. హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డిలకు గ్రేడ్-సిలో చోటు దక్కింది. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ అభిషేక్ శర్మ జులై 2024లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసి 17టి20లు ఆడాడు. ఇక నితీశ్ రెడ్డి 2024 అక్టోబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసి ఐదు టెస్టుల్లో 298పరుగులు, నాలుగు టి20ల్లో 80పరుగులు చేశాడు. స్పిన్ సంచలనం వరణ్ చక్రవర్తి 18అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 4వన్డేలు, 12టి20లు ఆడాడు. హర్షిత్ రాణా 2024 నవంబర్‌లో అరంగేట్రం చేసి రెండు టెస్టులు, 5వన్డేలు, 2టి20లు ఆడాడు. ఇక ఆకాశ్ దీప్ జులై 2024లో అరంగేట్రం చేసి 7టెస్టుల్లో 15వికెట్లు పడగొట్టాడు. బిసిసిఐ ఆటగాడికి కాంట్రాక్ట్ జాబితాలో చోటు కల్పించాలంటే ఏడాదిలో 3టెస్టులు, 8వన్డేలు, 10 టి20లో తప్పనిసరిగా ఆడాల్సి ఉంది. అక్టోబర్ 1, 2024 నుంచి సెప్టెంబర్ 30, 2025వరకు బిసిసిఐ నిబంధనల ప్రకారం వీరంతా క్రికెట్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది.

2024-25 ఏడాది బిసిసిఐ ప్రకటించిన గ్రేడ్‌లు...

ఎ+: రోహిత్, కోహ్లి, బుమ్రా, జడేజా
ఎ : సిరాజ్, కెఎల్ రాహుల్, శుభ్‌మన్, హార్దిక్, షమీ
బి : సూర్యకుమార్, కుల్దీప్, అక్షర్, జైస్వాల్, శ్రేయస్
సి : రింకు, తిలక్ వర్మ, గైక్వాడ్, దూబే, బిష్ణోయ్, సుందర్, ముఖేష్ కుమార్, సంజు, అర్ష్‌దీప్, ప్రసిధ్, పటీధర్, జురెల్, సర్ఫరాజ్, నితీశ్ రెడ్డి, ఇషాన్ కిషన్, అభిషేక్, ఆకాశ్ దీప్, వరణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా.

గ్రేడ్‌ల వారీ పారితోషికం

గ్రేడ్ ఎ+ : రూ.7కోట్లు
గ్రేడ్-ఎ : రూ.5కోట్లు
గ్రేడ్-బి : రూ.3కోట్లు
గ్రేడ్-సి : రూ.1కోటి

సత్తా చాటిన సాయి సుదర్శన్, గిల్

- **కోల్‌కతాపై గుజరాత్ గెలుపు**

కోల్‌కతా: గుజరాత్ టైటాన్స్ ఈ సీజన్ ఐపిఎల్‌లో మరో విజయాన్ని నమోదు చేసుకుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఈడెన్‌గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జట్టు 39పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత గుజరాత్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(90), సాయి సుదర్శన్(52) అర్ధసెంచరీలకి తోడు చివర్లో జోస్ బట్లర్(41 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. షారుఖ్ ఖాన్(11 నాటౌట్)సైతం చెలరేగగా గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కోల్‌కతా జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు కోల్పోయి 159పరుగులే చేయగల్గింది. కెప్టెన్ అజింక్యా రహానే(50), రఘువంశీ(27నాటౌట్), రింకు సింగ్(21) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. గుజరాత్ బౌలర్లు ప్రసిధ్, రషీద్ ఖాన్‌కు రెండేసి, సిరాజ్, ఇషాంత్, సుందర్, సాయి కిషోర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు టాస్ ఓడిన గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు కోల్‌కతా బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా బౌండరీలతో చెలరేగారు. పవర్ ప్లే తర్వాత జోరు పెంచిన గిల్ 34 బంతుల్లోనే అర్ధ శతకం బాదేయగా.. . హర్షిత్ రానా బౌలింగ్‌లో సిక్సర్ కొట్టిన సాయి అర్ధసెంచరీ కొట్టాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 12.2 ఓవర్లలో 114పరుగులు జతచేశారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని విడదీసేందుకు కోల్‌కతా కెప్టెన్ అజింక్యా రహానే బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. అయితే.. ఎట్టకేలకు రస్సెల్ విజయవంతమయ్యాడు. డేంజరస్ సుదర్శన్ ఔటయ్యాక జోస్ బట్లర్(41 నాటౌట్) జతగా గిల్ రెచ్చిపోయాడు. ఎడాపెడా బౌండరీలు బాదిన అతడు రెండో వికెట్‌కు 58 పరుగులు జోడించాడు. సెంచరీకి చేరువైన గిల్.. వైభవ్ బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడి రింకూ చేతికి చిక్కాడు. ఆ తర్వాత వచ్చిన రాహుల్ తెవాటియా(0)ను హర్షిత్ పెవిలియన్ పంపాడు. వైభవ్ వేసిన 20వ ఓవర్లో బట్లర్ రెండు ఫోర్లు కొట్టగా షారుఖ్ ఖాన్(11 నాటౌట్) ఐదో బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో, గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. కోల్‌కతా బౌలర్లు వైభవ్ అరోరా, హర్షిత్ రాణా, ఆండీ రస్సెల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శుభ్‌మన్ గిల్‌కు దక్కింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	8	6	2	12	+1.10
ఢిల్లీ	7	5	2	10	+0.58
బెంగళూరు	8	5	3	10	+0.47
పంజాబ్	8	5	3	10	+0.17
లక్నో	8	5	3	8	+0.08
ముంబయి	8	4	4	8	+0.48
కోల్‌కతా	8	3	5	6	+0.21
రాజస్తాన్	8	2	6	4	-0.63
సన్‌రైజర్స్	7	2	5	4	-1.21
చెన్నై	8	2	6	4	-1.39

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు

లక్నో సూపర్‌జెయింట్స్ x ఢిల్లీ క్యాపిటల్స్
వేదిక: బెంగళూరు; రాత్రి 7.30గం॥లకు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68